శ్రీశ్రీ సినిమా పాటలు
రూ॥180/-
పేజీలు:180



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

పెరూ నాజ్కాలైన్స్‌లో నేలకూలిన విమానం
గాజా అంతటా దాడులు
ఇండోనేసియాలో ఫెర్రీ దగ్ధం
08

సంపుటి 09, సంచిక: 244 | సోమవారం | 03-08-2026 | ఖమ్మం
Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar
పేజీలు: 12+8 | వెల రూ. 5.00



# అట్టహాసంగా లష్కర్ బోనాలు

- శివసత్తుల నృత్యాలు, వెల్లువెత్తిన భక్తులతో సందడిగా మారిన ఉజ్జయినీ మహంకాళి ఆలయం
- పట్టువస్త్రాలు, బోనం సమర్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- కుటుంబ సమేతంగా తొలి బోనం సమర్పించిన హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్
- బోనాల జాతరలో పాల్గొన్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు
- ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు

12



## మధ్యాహ్న భోజన కార్మికుల వేతనం

# నెలకు రూ.3వేలేనా?

### రూ.10వేలు ఇస్తామన్న హామీని ప్రభుత్వం అమలు చేయాలి



- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్
- కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు
- ప్రజా సమస్యలపై ఎర్రజెండా మాత్రమే నిరంతరం గొంతెత్తుతుందని ఉద్ఘాటన

ఘనంగా తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్నభోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 3వ మహాసభలు



ప్రజాపక్షం/హైదరాబాద్

అవిశ్రాంత పోరాటాల వల్లే కార్మికుల సమస్యల పరిష్కారం అవుతాయని ఇందుకు మధ్యాహ్న భోజన పథకం వర్కర్లు సంసిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు పిలుపునిచ్చారు.మధ్యాహ్న భోజన కార్మిక లకు ఇప్పటికి నెలకు కేవలం రూ. 3 వేలు మాత్రమే చెల్లించడం దారుణమని, ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన నెలకు రూ.10 వేల వేతన హామీని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 3వ మహాసభలు ఆదివారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాల యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మధ్యాహ్న భోజన పథకం జాతీయ అధ్య క్షురాలు బి.వి.విజయలక్ష్మి, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర అధ్యక్షురాలు ప్రేం పావని, ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తరువాయి 8లో

లోటు వర్షపాతంతో పెరిగిన 'పెట్రో' విక్రయాలు 7 భవిష్యత్ కార్యాచరణపై 5న సిజెపి చర్చ



## స్వేచ్ఛ, సమానత్వం...

# సామాజిక న్యాయమే పునాది

- తెలంగాణ పునర్‌నిర్మాణంలో ఎన్‌ఆర్‌ఐలు, ఐఒసి ప్రతినిధులు భాగస్వామ్యం కావాలి
- రాష్ట్రంలో సంక్షేమాన్ని, అభివృద్ధిని రెండు కళ్లుగా ముందుకు తీసుకెళ్తున్నాం
- అమెరికాలో జరిగిన ఇండియన్ ఓవర్‌సీస్ కాంగ్రెస్ ప్రతినిధుల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో రాష్ట్రంలో సంక్షేమాన్ని, అభివృద్ధిని రెండు కళ్లుగా ముందుకు తీసుకెళ్తున్నామని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర రూపురేఖలను మారుస్తూ ప్రపంచ స్థాయి పెట్టుబడుల కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతు న్నామన్నారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో విచ్చిన్నమైన తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తాము గాడిలో పెడుతున్నామన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయమే పునాదిగా సాగుతున్న తెలంగాణ పునర్నిర్మాణంలో విదే శాల్లో ఉన్న తెలుగు ఎన్‌ఆర్‌ఐలు, ఐఒసి ప్రతిని ధులు భాగస్వాములు కావాలన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా ఆదివారం అమెరికాలో జరి గిన ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ (ఐఒసి) ప్రతిని ధుల సమావేశంలో భట్టి విక్రమార్క ముఖ్య అతి థిగా హాజరై,ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న విప్లవాత్మక అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తు ప్రణాళికలను విదేశీ ప్రతినిధులకు, ఎన్‌ఆర్‌ఐలకు తరువాయి 8లో

# 4 నుంచి నీట్ యుజి కౌన్సెలింగ్

### సెప్టెంబర్ 8 నుంచి 2026-27 బ్యాచ్ విద్యా సంవత్సరం ప్రారంభం



**న్యూఢిల్లీ :** ఆల్ ఇండియా కోటా కింద ఎంబిబిఎస్, ఇతర అండర్ గ్రాడ్యుయేట్ వైద్య కోర్సులలో ప్రవేశాల కోసం మొదటి విడత కౌన్సెలింగ్ ఈనెల 4న ప్రారంభం కానుంది. 2026–27 బ్యాచ్ విద్యా సంవత్సరం సెప్టెంబర్ 8న మొదల వుతుంది. మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం, డీమ్డ్, సెంట్రల్ యూనివర్సిటీల కోసం మొదటి విడత కౌన్సెలింగ్ ఈనెల 4 నుండి 17 వరకు జరుగు తుంది. చేరడానికి 22 చివరి తేదీ. రెండవ విడత కౌన్సెలింగ్ 24 నుండి సెప్టెంబర్ 2 వరకు, తరువాయి 8లో



## మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై

# ఉక్కుపాదం

- దేశంలో అరెస్టులు గణనీయంగా పెరిగాయ్ వేల కోట్ల రూపాయల మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నాం
- 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్' ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ :** మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పుకొచ్చారు. దీనివల్ల అరెస్టులు గణనీయంగా పెరిగాయని, వేల కోట్ల రూపాయల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నామని స్పష్టం చేశారు. ఆది వారం నాడు దేశవ్యాప్త 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్' (అభివృద్ధి చెందిన భారతదేశం కోసం మాదకద్రవ్య రహిత యువత ఉద్యమం)ను తరువాయి 12లో

## ఇరాన్, పశ్చిమాసియా విజ్ఞప్తితో

# దాడులు ఆపేశా

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన
- అంతా అబద్ధమని ఖండించిన ఇరాన్
- సర్వసన్నద్ధంగా ఉన్నాం–దాడిచేస్తే ధ్వంసమే : ఆరాఘ్చి
- యుద్ధ విస్తరణ లేకుండా చర్యలు : సౌదీ రాజు సల్మాన్ విజ్ఞప్తి



**వాషింగ్టన్:** ఇరాన్‌తోపాటు పశ్చిమాసియాలోని ఇతర తమ మిత్ర దేశాలు చేసిన విజ్ఞప్తి మేరకు ప్రళయం సృష్టించే స్థాయిలో చేద్దామనుకున్న దాడులను వాయిదా వేసినట్లు అమెరికా అధ్య క్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆదివారం ప్రకటించారు. "మేం దాడికి సిద్ధపడ్డాం, కానీ ఇరాన్ సహా పశ్చి మాసియా మిత్రదేశాలు చేసిన విజ్ఞప్తితో ఆగి పోయాం" అని పేర్కొన్నారు. ఐతే ట్రంప్ ప్రకటన పచ్చి అబద్ధమని, తాము అమెరికాకు ఎలాంటి విజ్ఞప్తి చేయలేదని ఇరాన్ సైనికాధికారులను ఉటంకిస్తూ మెహర్ వార్తాసంస్థ ప్రకటించింది. ఇదొక కొత్త అబద్ధం, మేం అమెరికాను అడగ లేదు, మా సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి సర్వసన్నద్ధంగా ఉన్నాం, దాడి చేస్తే ధ్వంసం చేస్తాం" అని సైనికవర్గాలు పేర్కొన్నాయి. ఇరాన్ ఫార్స్ వార్తాసంస్థ ఒక అధికారవర్గాన్ని ఉటంకిస్తూ, అమెరికా శత్రుపూరిత దురాక్రమణ సాగి నంతకాలం హోర్ముజ్ జలసంధి మూసే ఉంటుం దని పేర్కొంది. ఐదు నెలలుగా కొనసాగుతున్న యుద్ధం ముగించేందుకు పశ్చిమాసియాలో మిత్ర దేశాలు ఒప్పంద పరిమితులపై ఇరాన్‌తో ఒక ప్రాథమిక అంగీకారానికి వచ్చాయని తన సొంత ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ప్రకటిం చారు. హోర్ముజ్ జలసంధి తెరిచేందుకు, ఇరాన్ అణు ముప్పు తొలగించే ఒప్పందానికి సంబంధిం చిన ముసాయిదా ఖరారైందని ఇరాన్ సహా పశ్చి మాసియాలోని తమ మిత్రదేశాలు హామీ ఇవ్వ డంతో దాడులు ఆపేశానని ట్రంప్ పేర్కొన్నారు. ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌పై భారీ దాడులు నిలిపివేసేందుకు ఇజ్రాయెల్ కూడా అంగీకరిం చిందన్నారు. "రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఎన్నడూ చూడనంత బీభత్సం, బలం, శక్తి సామ ర్థ్యాలతో ఇరాన్‌పై దాడికి అమెరికా సన్నద్ధంగా ఉండగా,ఒప్పంద పరిమితులపై అంగీకారం కుది రినందువల్ల ఇరాన్‌పై కొత్త దాడులు తరువాయి 8లో

## అందాల కలబోత..

# ప్రకృతి రమణీయత..



పర్యాటకులను ఆకర్షిస్తున్న జలపాతాలు



కుంటాల జలపాతం



పోచ్చెర జలపాతం

ప్రజాపక్షం/నేరడిగొండ

అడవుల జిల్లా అదిలాబాద్ ఖిల్లా. దట్టమైన అడ వులతో.. పక్షుల కిలకిల రావాలు.. చెంగుచెం గున ఎగిరే వన్యప్రాణుల సందళ్ళు... గలగల పారే సెలయేర్లు.. పొంగిపోర్లే వాగులు... దట్ట మైన అడవుల మధ్య గుట్టలను చీల్చుకుంటూ వెళ్లే నాలుగు వరసల జాతీయ రహదారి 44, మహబూబ్ ఘాట్, బోథ్ ఎక్స్ రోడ్ వద్ద అర్బన్ పార్క్, ఇవన్నీ కలగలిపి తెలంగాణ కశ్మీరుగా పిలిచే అదిలాబాద్ అందాలు చూడతరమా! ప్రకృతి ప్రేమికులను ఇట్టే ఆకర్షిస్తున్న ప్రకృతి రమణీయతతో సెలవు దినాలలో పర్యాటకులతో సందడిగా మారుతుంది.

**కనువిందు చేస్తున్న కుంటాల జలపాతం**

అందమైన పచ్చని ప్రకృతి రమణీయతను కను విందు చేసే కుంటాల తరువాయి 12లో

# ధాన్యం పక్కదారి



- సూర్యాపేట జిల్లాలో రూ.172.84 కోట్లు, హనుమకొండ జిల్లాలో రూ.9 కోట్లకు పైగా సిఎంఆర్ ధాన్యం మాయం

### విజిలెన్స్ వరుస దాడుల్లో సూర్యాపేట జిల్లాలో బయటపడ్డ మిల్లర్ల బాగోతం

- గత 13 రోజులుగా రైస్ మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు



ప్రజాపక్షం/సూర్యాపేట /హనుమకొండ

కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుండి సేక రించిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ రైస్ కోసం ప్రభుత్వం మిల్లర్లకు అప్పగించగా ఆ ధాన్యం పక్కదారి పట్టింది. ఈనేపథ్యంలో రైస్ మిల్లుల అక్రమార్కులపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విభాగంతో ఉక్కుపాదం మోపుతోంది. గత కొంతకాలంగా పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తున్న అధికా రులు, సీఎంఆర్ బకాయిలు పెండింగ్ లో పెట్టిన డిఫాల్టర్ మిల్లర్ల జాబితాను సిద్ధం చేసుకుని వరు సగా ఇటీవల ఆకస్మిక దాడులు నిర్వహిస్తు న్నారు. సివిల్ సప్లయ్ అధికారులతో కలిసి మిల్లు ల్లోని భౌతిక నిల్వలు, రికార్డులను పక్కాగా తనిఖీ చేస్తూ.. ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా పక్కదారి పట్టించిన మిల్లర్ల గుట్టును రట్టు చేస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో రూ.172.84 కోట్లు, హన్మకొండ జిల్లాలో రూ.9 కోట్లకు పైగా ధాన్యం పక్కదారి పట్టినట్లు తరువాయి 8లో

# సాహిత్యంలో 'స్థానిక' పరిమళం

సాహిత్యం అంటే ఊహల ప్రపంచం. అయితే, సాహిత్యం పరిధిని అంతటే పరిమితం చేయడం సరికాదు. ఎందుకంటే, అది ఒక కాలాన్ని, ఒక సమాజాన్ని, ఒక భౌగోళిక ప్రాంతాన్ని, అక్కడి ప్రజల జీవన విధానాన్ని భద్రపరిచే సాంస్కృతిక వారసత్వ ప్రతీక కూడా. ఒక రచయిత తన చుట్టూ ఉన్న నేలను, మనుషులను, వారి మాటలను, వారి కష్టాలను, వారి పండుగలను, వారి పోరాటాలను తన రచనలో ప్రతిబింబించినపుడు అక్కడే ప్రాంతీయవాద సాహిత్యం పుడుతుంది. ప్రపంచ సాహిత్యంలో 'ప్రాంతీయవాదం' లేదా 'ప్రాంతీయ సాహిత్యం' అనే భావన ఒక ప్రత్యేక సాహిత్య ధోరణిగా ఎదిగింది. ఇది ఒక చిన్న ప్రాంతాన్ని మాత్రమే వర్ణించే పరిమిత దృక్పథం కాదు. ఒక నిర్దిష్ట భూభాగం ద్వారా మానవ జీవితంలోని విశాలమైన అనుభవాలను అర్థం చేసుకునే సాహిత్య పద్ధతి. ప్రాంతీయవాద సాహిత్యం ఒక ప్రాంతపు భౌగోళిక స్వరూపాన్ని చిత్రిస్తుంది. ఆ ప్రాంతంలో నివసించే ప్రజల ఆలోచనా విధానం, సామాజిక సంబంధాలు, ఆచారాలు, భాష, చరిత్ర, ఆర్థిక పరిస్థితులు, వారి కలలు, వారి పరాజయాలకు అద్దం పడుతుంది. వాటిని ఒక సజీవ చిత్రంగా అందిస్తుంది. ఒక గ్రామం, ఒక నది, ఒక కొండ ప్రాంతం, ఒక సముద్రతీరం, ఒక పల్లెటూరు వంటివన్నీ కథాగమనంలో కీలక ప్రాంతాలే. ఎన్నో అనుభవాలను అందించిన ప్రదేశాలే. 19వ శతాబ్దం ద్వితీయార్ధంలో ముఖ్యంగా అమెరికన్ సాహిత్యంలో ప్రాంతీయవాదం ఒక ప్రముఖ ఉద్యమంగా ఎదిగింది. అమెరికా అంతర్యుద్ధం తరువాత దేశం వేగంగా పారిశ్రామికీకరణ వైపు కదులుతున్న సమయంలో పాత గ్రామీణ సంస్కృతులు, స్థానిక జీవన విధానాలు మారిపోతున్నాయి. ఆ మార్పుల మధ్య స్థానిక సమాజాల ప్రత్యేకతలు కనుమరుగవుతాయనే భావనతో అనేక మంది రచయితలు తమ ప్రాంతాల జీవితాన్ని నమోదు చేయడం ప్రారంభించారు. ఈ రచనలు ఒక రకంగా సామాజిక చరిత్ర పత్రాలుగా కూడా నిలిచాయి. ప్రాంతీయవాదం వాస్తవికత (రీజనల్ రియలిజం)తో బలమైన సంబంధం కలిగి ఉంది. రొమాంటిక్ సాహిత్యం సాధారణంగా అసాధారణమైన వ్యక్తులు, గొప్ప భావోద్వేగాలు, కల్పిత ప్రపంచాలను ముందుకు తెస్తే, ప్రాంతీయ సాహిత్యం సాధారణ మనుషుల జీవితాలపై దృష్టి పెడుతుంది. రైతు, మత్స్యకారుడు, చిన్న వ్యాపారి, గ్రామీణ మహిళ, కార్మికుడు వంటి సామాన్యుల జీవితాలు ఇందులో ప్రధాన పాత్రలు పోషిస్తాయి. వారి రోజువారీ కష్టాలు, ఆనందాలు, సంఘర్షణలు, సామాజిక పరిమితులు సాహిత్య వస్తువులుగా మారుతాయి. అయితే, ప్రాంతీయవాదం కేవలం వాస్తవ చిత్రణతో ఆగిపోదు. అనేక సందర్భాల్లో రచయితలు తమ ప్రాంతాన్ని ఒక ప్రత్యేకమైన సాంస్కృతిక ప్రపంచంగా కూడా చూపించారు. ఒక పర్వత ప్రాంత ప్రజల నమ్మకాలు, ఒక తీర ప్రాంత సమాజపు జీవన విధానం, ఒక ఎడారి ప్రాంత ప్రజల పోరాట స్వభావం తదితరాలన్నీ కథకు ప్రత్యేకమైన వాతావరణాన్ని సృష్టిస్తాయి. అందుకే ప్రాంతీయ సాహిత్యంలో ప్రకృతి ఒక నేపథ్యం మాత్రమే కాకుండా జీవించే శక్తిగా కనిపిస్తుంది. అక్కడ భాష కూడా కీలక పాత్ర పోషిస్తుంది. నిజానికి భాష అనేది ప్రాంతీయ సాహిత్యానికి అత్యంత ముఖ్యమైన అంశం. ఒక ప్రాంతపు మాండలికం, స్థానిక పదజాలం, పలుకుబడి, సామెతలు, సంభాషణ శైలి రచనకు నిజమైన జీవాన్ని ఇస్తాయి. ఒక పాత్ర ఏ భాషలో మాట్లాడుతుందో దాని ద్వారా ఆ పాత్ర సామాజిక




నేపథ్యం, ప్రాంతీయ గుర్తింపు తెలుస్తాయి. ప్రామాణిక భాషలో రాయడం కంటే స్థానిక భాషా రూపాలను ఉపయోగించడం ద్వారా రచయితలు తమ పాత్రలను మరింత సహజంగా తీర్చిదిద్దుతారు. అమెరికన్ సాహిత్యంలో ఈ లక్షణాలను పలువురు రచయితలు అత్యంత సమర్థంగా ఉపయోగించారు. వివిధ నదీతీర ప్రాంతాలు, పరిసరాల జీవితాలు వారి రచనలకు ప్రధాన ఆధారమయ్యాయి. అనేక రచనల్లో నది కేవలం ఒక ప్రయాణ మార్గంగా కాకుండా, ఒక దేశ వికాసాన్ని, గమనాన్ని, జీవన రీతులను అర్థం చేసుకునే మాధ్యమంగా ఉపయోగపడుతుంది. స్థానిక భాష, గ్రామీణ సంభాషణలు, నది పరిసరాల జీవితం, బానిసత్వం, పెత్తందారుల ఆధిపత్య ధోరణులు, వర్గ తేడాలు, అంతర్యుద్ధాలు వంటి అనేకానేక అంశాలు తరువాతి కాలంలో రచయితలు అందిపుచ్చుకున్నారు. అందుకే, ఇప్పటికీ ప్రాంతీయ సాహిత్యం, సమాజంలోని వైరుధ్యాలను ఎంతో సహజంగా చిత్రించే సాధనమైంది. సామాజిక పరిశీలనకు మార్గమైంది.


కొంత మంది సముద్ర తీర ప్రాంతాలు, గ్రామాల్లోని జీవితాలను తమతమ రచనల్లో ప్రతిబింబించారు. చిన్న పట్టణాల్లో నివసించే సాధారణ ప్రజల భావోద్వేగ ప్రపంచం, వారి సంబంధాలు, ఒంటరితనం, ప్రకృతితో వారి అనుబంధం ఈ రచనల్లో కనిపిస్తుంది. ఈ కోవకు చెందిన రచయితలంతా పెద్ద రాజకీయ సంఘటనల కంటే సాధారణ జీవితంలోని చిన్న చిన్న అనుభవాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ప్రేమ్‌చంద్, దాశరధి రంగాచార్యులు వంటి రచయితలు రైతు జీవితాన్ని తన రచనల్లో ప్రతిబింబించారు. భూమిని ఆధారంగా చేసుకుని జీవించే రైతుల కష్టాలు, ఆర్థిక సమస్యలు, ప్రకృతితో వారి పోరాటం ఆయన రచనల్లో ప్రధాన అంశాలుగా కనిపిస్తాయి. ఆయన ప్రాంతీయవాదం గ్రామీణ జీవితాన్ని కేవలం అందమైన దృశ్యంగా చూపించలేదు; దాని వెనుక ఉన్న సామాజిక, ఆర్థిక సమస్యలను కూడా వెలుగులోకి తెచ్చింది. పలు ప్రాంతాల్లోని కుటుంబ చరిత్రలు, జాతి సంబంధాలు, బానిసత్వం వారసత్వం, సామాజిక వర్గాల మధ్య సంఘర్షణలు కొన్ని రచనల్లో ఆవిష్కృతమవుతయి. ప్రాంతీయవాద సాహిత్యం మొదట అమెరికాలో ప్రారంభమైనప్పటికీ, కేవలం అక్కడికే పరిమితం కాలేదు. ప్రపంచంలోని ప్రతి భాషలోనూ ఈ ధోరణి కనిపిస్తుంది. రష్యన్ సాహిత్యంలో గ్రామీణ జీవితం, ఫ్రెంచ్ సాహిత్యంలో ప్రావిన్షియల్ సమాజాలు, లాటిన్ అమెరికన్ సాహిత్యంలో స్థానిక సంస్కృతులు, ఆఫ్రికన్ సాహిత్యంలో వలస పాలనకు ముందు సమాజాల చిత్రణ వంటివన్నీ ప్రాంతీయ దృష్టికోణంతో ముడిపడి ఉన్నాయి. భారతీయ సాహిత్యంలో కూడా ప్రాంతీయవాదానికి గొప్ప సంప్రదాయం ఉంది. భారతదేశం భాషా, సాంస్కృతిక వైవిధ్యాలతో కూడిన దేశం కావడం వల్ల ప్రతి ప్రాంతానికి ప్రత్యేకమైన జీవన అనుభవాలు ఉన్నాయి. బెంగాలీ సాహిత్యంలో గ్రామీణ బెంగాల్ జీవితం, మలయాళ సాహిత్యంలో కేరళ సామాజిక మార్పులు, తమిళ సాహిత్యంలో గ్రామీణ సమాజాల చిత్రణ, తెలుగు సాహిత్యంలో తెలంగాణ, రాయలసీమ, కోస్తా ప్రాంతాల ప్రత్యేక జీవన విధానాలు ప్రాంతీయ సాహిత్యానికి బలమైన ఆధారాలుగా నిలిచాయి. తెలుగు సాహిత్యంలో ప్రాంతీయతకు ప్రత్యేకమైన స్థానం ఉంది. గురజాడ అప్పారావు నుంచి కాళోజీ నారాయణరావు వరకు, రాచకొండ విశ్వనాథ శాస్త్రి నుంచి ఆధునిక తెలంగాణ కథా రచయితల వరకు అనేక మంది రచయితలు తమ ప్రాంతాల భాషను, సామాజిక వాస్తవాలను సాహిత్యంలోకి తీసుకువచ్చారు. ఒక ప్రాంతపు మాండలికాన్ని ఉపయోగించడాన్ని కేవలం భాషా ప్రయోగంగా పేర్కొవడం తగదు. అది ఆ ప్రాంత ప్రజలకు సాహిత్యంలో గౌరవప్రదమైన స్థానం కల్పించడం అనే గొప్ప విలువలకు కట్టుబడింది. అయితే, ప్రాంతీయవాదంపై కొన్ని విమర్శలు కూడా లేకపోలేదు. కొన్నిసార్లు ఒక ప్రాంతాన్ని అతిగా పొగడ్తల్లో ముంచడం, ఇతర ప్రాంతాల పట్ల నిర్లక్ష్యం చూపడం వంటి ప్రమాదాలు ఉంటాయి. ఒక ప్రాంతాన్ని వర్ణించడం అంటే దానిని ఆదర్శంగా చూపించడం కాదని, ఆ ప్రాంతంలోని సమస్యలు, అసమానతలు, సామాజిక వైరుధ్యాలను కూడా నిజాయితీగా చూపించాల్సిన బాధ్యత రచయితపై ఉంటుందని అంటారు. గొప్ప ప్రాంతీయ సాహిత్యం తన ప్రాంతాన్ని ప్రేమిస్తుంది, కానీ దాని లోపాలను కూడా ప్రశ్నిస్తుంది. ప్రపంచీకరణ కాలంలో ప్రాంతీయవాద సాహిత్యానికి కొత్త ప్రాధాన్యం వచ్చింది. ప్రపంచం ఒకే మార్కెట్‌గా మారుతున్న సమయంలో స్థానిక భాషలు, సంస్కృతులు, జీవన విధానాలు కనుమరుగయ్యే ప్రమాదం పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రాంతీయ సాహిత్యం ఒక సాంస్కృతిక సంరక్షణ సాధనంగా మారింది. ఒక చిన్న గ్రామంలోని జీవితం కూడా ప్రపంచ మానవ అనుభవంలో భాగమేనని అది గుర్తుచేస్తుంది. మొత్తం మీద, విశ్వవ్యాప్త మానవ అనుభవాలను అర్థం చేసుకోవాలంటే ముందుగా ఒక నిర్దిష్ట నేలను అర్థం చేసుకోవాలనే సత్యాన్ని ప్రాంతీయవాదం మనకు గుర్తుచేస్తుంది. ఒక నది ఒడ్డున జీవించే మనిషి కథ, ఒక చిన్న గ్రామంలోని మహిళ అనుభవం, ఒక రైతు పోరాటం, ఒక మత్స్యకారుడి జీవితం.. చూడడానికి స్థానికమైనవే అనిపించినప్పటికీ, వాటిలోని భావోద్వేగాలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న మనుషులందరికీ అర్థమయ్యేలా ఉంటాయి. అందుకే ప్రాంతీయవాద సాహిత్యం చిన్న పరిధిలో పుట్టి, విశాలమైన మానవ ప్రపంచాన్ని చేరుకునే సాహిత్య ప్రవాహంగా నిలుస్తుంది.

**– సత్య శ్రీ**

# 'కొంపెల్ల జనార్దనరావు జీవితం—సమగ్రసాహిత్యం'

ఈ శీర్షికతో ఏటుకూరి ప్రసాద్, యామిజాల ఆనంద్ సంయుక్త సంపాదకత్వంలో వచ్చిన పుస్తకం గురించి ఏమి చెప్పినా తక్కువే.. ఎంత చెప్పినా స్వల్పమే. ఈ పుస్తకం ముఖచిత్రంపై చూపు పడగానే 'ఎవరీ కొంపెల్ల జనార్దనరావు?' అని ఆశ్చర్యపోయే నేటి తరం, ఆ ప్రశ్నకు సమాధానం తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. తెలుగు ఆధునిక సాహిత్య చరిత్రలో వెలుగుల్ని పంచి, కాలగర్భంలో మరుగునపడిపోయిన ఒక మహోన్నత వ్యక్తిత్వాన్ని తిరిగి మన ముందుకు తీసుకొచ్చిన సాహిత్య యజ్ఞమే ఈ గ్రంథం. మహాకవి శ్రీశ్రీ తన అజరామరమైన 'మహాప్రస్థానం' పుస్తకాన్ని కొంపెల్ల జనార్దనరావుకు అంకితం చేశాడంటే, ఆయన వ్యక్తిత్వ విశిష్టతను ప్రత్యేకంగా వివరించాల్సిన అవసరం ఉండదు. మూడు పదుల వయసు కూడా నిండక ముందే హడావిడిగా మనల్ని విడిచి వెళ్లిపోయిన కొంపెల్ల మరికొంత కాలం జీవించి ఉండి ఉంటే, తెలుగు సాహిత్య చరిత్ర మరొక రూపాన్ని సంతరించుకునేదేమో! ఆయన ప్రతిభకు శ్రీశ్రీ అంకిత గేయం సంపూర్ణ కొలమానం కాకపోయినా, ఆ అసామాన్య సాహిత్యజీవి గురించి అనేక ప్రశ్నలకు దారి తీసే విలువైన పత్రంగా నిలిచింది. అందులో చాలా విషయాలు చర్చకు వచ్చాయి. 'ఉదయిని' పత్రికను నెలకొల్పి, ఆర్థికంగా, శారీరకంగా కొంపెల్ల అలసిపోయాడు. తన శక్తి, సమయం, ఆర్థిక వనరులన్నింటినీ సాహిత్య సేవకే అంకితం చేసిన ఆయన రచనలు నేడు చాలా మందికి తెలియకపోవడం దురదృష్టకరం. 1920, 1930 దశకాల్లో వివిధ పత్రికల్లో చెల్లాచెదురుగా ముద్రితమైన ఆయన రచనలను వెదికి, సేకరించి, ఒకే గ్రంథంలో సమీకరించడం ఎంతటి కఠిన సాధనో ఊహించడం కూడా కష్టం. దాదాపు ఎనిమిది దశాబ్దాలుగా మరుగునపడ్డ ఒక సాహిత్యకారుడి జీవితాన్ని, రచనలను, వ్యక్తిత్వాన్ని తిరిగి వెలుగులోకి తీసుకురావడం ఒక అసాధారణ సంపాదక బాధ్యత. ఒక మహాయజ్ఞం. ఈ పుస్తకం వెనుక ఏటుకూరి, యామిజాల సాగించిన అవిశ్రాంత పరిశోధన, అన్వేషణ, సేకరణ, శ్రమ ప్రతి పుటలోనూ కనిపిస్తుంది. ముఖ్యంగా ఈ గ్రంథం వెలుగు చూడాలని చివరి క్షణం వరకు తపించిన ఏటుకూరి సంకల్పం ఈ పుస్తక రూపంలో సాకారమైంది. ఆచార్యుడిగా, ఉద్యమ నిర్మాతగా, రచయితగా, సంపాదకుడిగా, పరిశోధకుడిగా, వక్తగా బహుముఖ ప్రజ్ఞను చాటుకున్న ఆయన చివరి కోరిక నెరవేరడం తెలుగు సాహిత్యానికి ఒక సంతోషకరమైన సందర్భం. ఈ గ్రంథం వెలువడడం, ఆయనకు సాహితీ ప్రపంచం చెల్లించిన గొప్ప నివాళి. పుస్తకం ఆరంభంలోనే 'మహాప్రస్థానం' తొలి ముద్రణ ముఖచిత్రాన్ని ప్రచురించడం అత్యంత సందర్భోచితం. ఆ ముఖచిత్రమే పాఠకుడిని ఒక చారిత్రక కాలంలోకి తీసుకెళ్తుంది. అరుదైన ఛాయాచిత్రాలు, స్వదస్తూరీలు, 'బొమ్మలు చెప్పే కథలు' వంటి విశిష్ట విభాగాలతో కూడిన ఈ గ్రంథం ఎనిమిది భాగాలుగా రూపుదిద్దుకుంది. 'ఎవరీ జనార్దనరావు?' అనే ప్రశ్నతో ప్రారంభమయ్యే తొలి భాగం, ఆ ప్రశ్నకు నేరుగా సమాధానం చెప్పకుండానే అనేక గొప్ప సాహితీవేత్తల రచనల ద్వారా పాఠకుడిని కొంపెల్ల వ్యక్తిత్వానికి చేరువ చేస్తుంది. శ్రీశ్రీ,





చదవాల్సిన పుస్తకం

అబ్బూరి వరదరాజేశ్వరరావు, ఆచంట జానకీరామ్, పిలకా గణపతిశాస్త్రి, ఎస్వీ రామారావు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి వంటి ప్రముఖుల వ్యాసాలు కొంపెల్ల స్థాయిని మనకు అర్థమయ్యేలా చేస్తాయి. రెండో భాగంలో పింగళి నాగేంద్రరావు, వేటూరి ప్రభాకరశాస్త్రి, ద్వానా శాస్త్రి, కామేశ్వరరావు, జ్వాలాముఖి, బూదరాజు రాధాకృష్ణ వంటి సాహిత్య దిగ్గజాల అభిప్రాయాలు చోటు చేసుకున్నాయి. ఆంధ్రభూమి, గృహలక్ష్మి, భారతి, కృష్ణాపత్రిక వంటి పత్రికల్లో వెలువడిన వ్యాసాలను కూడా ఇందులో చేర్చడం ద్వారా సంపాదకులు ఒక విలువైన సాహిత్య దస్తావేజును రూపొందించారు. మూడో భాగమైన 'కవనచాతురి'లో వివిధ పత్రికల్లో ముద్రితమైన కొంపెల్ల కవితలు చోటు చేసుకున్నాయి. నాలుగో భాగం ఆయన వచన రచనల ద్వారా రచయితగా ఆయన ఆలోచనా లోతును, భాషా నైపుణ్యాన్ని ఆవిష్కరిస్తుంది. 'భారతి' పత్రికలో పనిచేసిన రోజుల్లోనూ, తరువాత 'ఉదయిని'లో రాసిన సమీక్షలను ఐదో భాగంలో సమగ్రంగా సమీకరించారు. ఆ సమీక్షలను వెదికి పట్టుకోవడానికి సంపాదకులు చేసిన పరిశోధన ప్రతి పుటలో ప్రతిధ్వనిస్తుంది. 'కవుల లోగిలి', 'అనుబంధాలు' వంటి విభాగాలు కొంపెల్ల వ్యక్తిత్వాన్ని మరింత సమగ్రంగా పరిచయం చేస్తాయి. మహాప్రస్థానాన్ని కొంపెల్లకు అంకితం చేస్తూ, శ్రీశ్రీ రాసిన గేయాన్ని ఆయన స్వదస్తూరీలోనే ముద్రించడం ఈ గ్రంథానికి మరింత చారిత్రక విలువను చేకూర్చింది. గతంలో 'పోయెట్రీ వర్క్ షాప్' పేరిట వెలువడిన గ్రంథం ద్వారా తెలుగు రచయితల స్వదస్తూరీలను పాఠకుల ముందుకు తీసుకొచ్చిన ఘనత కూడా ఏటుకూరి, యామిజాల ద్వయానిదే. అలాంటి ప్రయోగం తెలుగు సాహిత్యంలోనే కాదు, ప్రపంచ సాహిత్య చరిత్రలో కూడా అరుదుగా కనిపిస్తుంది. ఇది ముమ్మాటికీ 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చేరదగిన పుస్తకం. ఎంతో మంది రచయిత చేతిరాతల్లో కనిపించే కొట్టివేతలు, దిద్దుబాట్లు, పదాల మార్పులు ఒక రచన వెనుక వారు అనుభవించే అంతర్మథనాన్ని మన కళ్లముందు నిలబెడతాయి. ఒక కవిత పుట్టుకకు ముందు ఎన్నిసార్లు అది కాగితంపై పుడుతుందో, చనిపోతుందో, మళ్లీ పుడుతుందో ఆ ప్రతులే సాక్ష్యాలుగా నిలుస్తాయి. ఒకప్పుడు అనేక పత్రికల్లో ప్రచురితమైన రచనలు కాలగర్భంలో కలిసిపోయాయి. రచయితల అసలు చేతిరాత ప్రతులే అరుదుగా దొరికే పరిస్థితిలో, వారు పలు దశల్లో రాసి, సవరించి, కొట్టివేసిన చిత్తు ప్రతులను సేకరించడం ఎంతటి దుర్లభమో ఊహించడం కష్టం కాదు. అలాంటి పరిశోధన వెనుక ఉన్న సహనం, పట్టుదల, సాహిత్యాభిమానం నిజంగా ఆశ్చర్యానికి గురిచేస్తాయి. ఆధునిక, ప్రగతిశీల తెలుగు సాహిత్యానికి పునాదులు వేసిన రచయితల్లో ముందువరుసలో నిలిచినా, తగిన గుర్తింపు పొందని శిష్ట్లా మహేశ్వరరావు సమగ్రసాహిత్యాన్ని కూడా ఇదే స్థాయిలో పరిచయం చేసిన ఘనత ఈ ఇద్దరు సంపాదకులకే దక్కుతుంది. ఇప్పుడు వారి సంయుక్త కృషిలో మరో ఆణిముత్యం 'కొంపెల్ల జనార్దనరావు జీవితం'. అయితే ఈ పుస్తకం ఆవిష్కారానికి ముందే ఏటుకూరి భౌతికంగా దూరమవడం తెలుగు సాహిత్యానికి తీరని లోటు. ఆ వేదన మధ్యనే ఆయన కలను సాకారం చేస్తూ ఈ గ్రంథాన్ని పాఠకుల ముందుకు తీసుకురావడం ఆయనకు అందించిన అత్యంత సముచిత నివాళి. ఆయన స్ఫూర్తిని కొనసాగిస్తూ యామిజాల ఇలాంటి పరిశోధనాత్మక సాహిత్య భాండాగారాలను మరెన్నో వెలుగులోకి తీసుకురావాలని మనసారా ఆశిద్దాం. మరుగునపడిన మణులను వెలికితీయడం, మరచిపోయిన మహనీయులను కొత్త తరానికి పరిచయం చేయడం, కాలం చెదరగొట్టిన సాహిత్య సంపదను మళ్లీ ఒక చోట చేర్చి భవిష్యత్తు తరాలకు అందించడం ఎంత గొప్ప సాంస్కృతిక సేవో ఈ గ్రంథం మనకు గుర్తు చేస్తుంది. ఒక రచయిత జీవితాన్ని మాత్రమేగాక, ఒక సాహిత్య యుగాన్నే మన ముందుంచిన ఈ గ్రంథం ప్రతి సాహిత్యాభిమాని గ్రంథాలయంలో తప్పనిసరిగా ఉండాల్సిన పుస్తకం. తెలుగు సాహిత్య స్మృతిని సంరక్షించిన అపూర్వ గ్రంథం కాబట్టే దీనిని ప్రతి ఒక్కరూ చదవాలి. చదివించాలి.

**పుస్తకం పేరు**

**'కొంపెల్ల జనార్దనరావు జీవితం—సమగ్రసాహిత్యం'**

సంపాదకులు: ఏటుకూరి ప్రసాద్, యామిజాల ఆనంద్

వెల: రూ. 500

సోల్ డిస్ట్రిబ్యూటర్లు:


నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).

## 'యుద్ధ రచయిత' చానర్ బ్రూక్

**(ఆగస్టు 3, రూపర్ట్ చానర్ బ్రూక్ జయంతి)**



రూపర్ట్ చానర్ బ్రూక్ (1887 ఆగస్టు 3 – 1915 ఏప్రిల్ 23) ఇంగ్లండ్‌కు చెందిన ప్రముఖ కవి. మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభ దశలో రాసిన యుద్ధ 'సానెట్స్'తో ఆయన ప్రత్యేక గుర్తింపు పొందాడు. ముఖ్యంగా 'ది డెడ్', 'ది సోల్జర్' వంటి కవితలు దేశభక్తి, త్యాగం, ఆదర్శవాదం కలగలిసిన భావాలతో విస్తృత ఆదరణ పొందాయి. ఆయన సాహిత్య ప్రతిభతో పాటు, అందమైన రూపం.. ఆకర్షణీయమైన వ్యక్తిత్వం కూడా సమకాలీనుల దృష్టిని ఆకర్షించింది. ఆయనను ఆ కాలంలో ఇంగ్లండ్‌లో 'అత్యంత అందమైన యువకుల్లో ఒకరు' అని పేర్కొంటారు. బ్రూక్ ఇంగ్లండ్‌లోని వార్విక్‌షైర్ కౌంటీలో రగ్బీ పట్టణంలో జన్మించారు. తండ్రి పాఠశాల ఉపాధ్యాయుడు, తల్లి విద్యార్థుల సంరక్షణ బాధ్యతలు నిర్వహించే అధికారిణి. చిన్నప్పటి నుంచే విద్య, సాహిత్యం, సంస్కృతి ప్రధానమైన కుటుంబ వాతావరణంలో పెరిగిన బ్రూక్ రగ్బీ స్కూల్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసి, తరువాత కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలోని కింగ్స్ కాలేజీలో క్లాసికల్ సాహిత్యాన్ని అభ్యసించాడు. విద్యార్థి దశలోనే సాహిత్య సంఘాలు, నాటక బృందాలు, మేధో చర్చా వేదికల్లో చురుకుగా పాల్గొన్నాడు. ఈ కాలంలో ఏర్పడిన స్నేహాలు ఆయన ఆలోచనా ప్రపంచాన్ని ప్రభావితం చేశాయి. విశ్వవిద్యాలయ జీవితం తరువాత బ్రూక్ ఇంగ్లండ్‌లోని సాహిత్య వర్గాల్లో గుర్తింపు పొందాడు. బ్లూమ్స్‌బరీ గ్రూప్, జార్జియన్ కవుల వర్గం, డైమాక్ కవుల సమూహంతో ఆయనకు అనుబంధం ఏర్పడింది. అమెరికన్ కవి రాబర్ట్ ఫ్రాస్ట్, ఎడ్వర్డ్ థామస్ వంటి రచయితలతో కూడా పరిచయాలు పెరిగాయి. గ్రాంట్‌చెస్టర్ గ్రామంలో నివసించిన కాలంలో ఆయన రాసిన 'ది ఓల్డ్ వికరేజ్', 'గ్రాంట్‌చెస్టర్' కవిత ఆయన ప్రసిద్ధ రచనల్లో ఒకటిగా నిలిచింది. బెర్లిన్‌లో ఉన్నప్పుడు స్వదేశం పట్ల కలిగిన తపన ఈ కవితలో ప్రతిబింబిస్తుంది. సాహిత్యంతో పాటు బ్రూక్ వ్యక్తిగత జీవితం కూడా ఎన్నో భావోద్వేగ మలుపులు తిరిగింది. పలు ప్రేమ సంబంధాలు, స్నేహాలు, వ్యక్తిగత విభేదాలు ఆయన జీవితాన్ని ప్రభావితం చేశాయి. 1912 ప్రాంతంలో తీవ్రమైన మానసిక సంక్షోభాన్ని ఎదుర్కొన్నాడు. అనంతరం విశ్రాంతి కోసం జర్మనీ, అమెరికా, కెనడా, దక్షిణ పసిఫిక్ దీవుల్లో పర్యటించాడు. అనేక 'ప్రయాణ కథనాలు' రాశాడు. తాహితీ దీవిలో గడిపిన కాలం ఆయన జీవితంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది. అక్కడ ఏర్పడిన అనుబంధం ఆయన వ్యక్తిత్వంలో మరో కోణాన్ని వెల్లడించినట్లు జీవిత చరిత్రకారులు పేర్కొంటారు. మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమైన తర్వాత 1914లో బ్రూక్ బ్రిటిష్ రాయల్ నేవల్ వలంటీర్ రిజర్వ్‌లో చేరాడు. అనంతరం రాయల్ నేవల్ డివిజన్‌లో అధికారిగా నియమితులయ్యాడు. బెల్జియంలోని ఆంట్‌వెర్ప్ ముట్టడిలో పాల్గొన్నారు. యుద్ధ అనుభవాల నేపథ్యంలో ఆయన రాసిన ఐదు సానెట్లు విశేష ఖ్యాతి పొందాయి. వాటిలో 'ది సోల్జర్' అత్యంత ప్రసిద్ధి చెందింది. స్వదేశం కోసం ప్రాణత్యాగాన్ని గౌరవప్రదమైన విధిగా చిత్రీకరించిన ఈ కవిత యుద్ధ ప్రారంభ దశలో బ్రిటన్‌లో దేశభక్తి భావజాలానికి ప్రతీకగా మారింది. 1915లో వెలువడిన '1914 అండ్ అదర్ పోయమ్స్' అనే సంకలనం అనేక ముద్రణలు పొందింది. ఆయన మరణం తర్వాత ఈ పుస్తకానికి మరింత ఆదరణ లభించింది. అయితే బ్రూక్ యుద్ధరంగంలో వీరమరణం పొందలేదు. 1915లో మధ్యధరా సముద్ర ప్రాంతానికి వెళ్తున్న బ్రిటిష్ దళంలో భాగంగా ప్రయాణిస్తున్న సమయంలో ఈజిప్టులో ఆయనకు తీవ్రమైన జీర్ణాశయ వ్యాధి సోకింది. అనంతరం దోమ కాటు వల్ల సంక్రమించిన ఇన్‌ఫెక్షన్ రక్తంలో వ్యాపించి సెప్టిసీమియాగా మారింది. ఫ్రెంచ్ ఆసుపత్రి నౌకలో చికిత్స పొందుతున్నప్పటికీ 1915 ఏప్రిల్ 23న, కేవలం 27 ఏళ్ల వయసులో మరణించాడు. అప్పటికి గల్లిపోలీ యుద్ధానికి బయలుదేరిన దళం ప్రయాణంలో ఉండటంతో ఆయనను గ్రీస్‌కు చెందిన స్కైరోస్ ద్వీపంలోని ఆలివ్ తోటలో ఖననం చేశారు. ఆయన సమాధి ఇప్పటికీ అక్కడే ఉంది. బ్రూక్ మరణించిన కొద్దికాలానికే ఆయన తమ్ముడు కూడా పశ్చిమ యుద్ధరంగంలో ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాదం కుటుంబాన్ని తీవ్రంగా కలచివేసింది. అయినప్పటికీ రూపర్ట్ బ్రూక్ పేరు యుద్ధ కవిత్వంలో శాశ్వత స్థానం సంపాదించింది. ఆయన స్మారకార్థం ఇంగ్లండ్‌లోని వెస్ట్‌మినిస్టర్ అబ్బేలోని 'పోయెట్స్ కార్నర్'లో మొదటి ప్రపంచ యుద్ధ కవుల స్మారక శిలాఫలకంపై ఆయన పేరు చెక్కారు. జన్మస్థలమైన రగ్బీలో విగ్రహం నెలకొల్పారు. గ్రాంట్‌చెస్టర్‌లో ఆయన నివసించిన గృహాల వద్ద జ్ఞాపిక ఫలకాలు ఏర్పాటు చేశారు. స్కైరోస్‌లోని సమాధి వద్ద శాశ్వత స్మారక చిహ్నం నిర్మించారు. ఆయన కవితల పంక్తులు బ్రిటన్‌తో పాటు న్యూజిలాండ్‌లోని యుద్ధ స్మారకాలపై కూడా కనిపిస్తాయి. 2023లో ఆయన జీవితాన్ని స్మరించుకుంటూ కొత్త చమురు చిత్రపటాన్ని కూడా రూపొందించారు. బ్రూక్ సాహిత్య వారసత్వం కాలక్రమేణా విభిన్న కోణాల్లో విశ్లేషణకు లోనైంది. యుద్ధ ప్రారంభ దశలో ఆయన కవితలు దేశభక్తికి చిహ్నాలుగా భావించగా, తరువాతి తరాల విమర్శకులు వాటిలో కనిపించే ఆదర్శవాదాన్ని ప్రశ్నించారు. ముఖ్యంగా యుద్ధం భయానకతను ప్రత్యక్షంగా అనుభవించిన తరువాతి కవులు యుద్ధాన్ని మరింత వాస్తవికంగా చిత్రించడంతో బ్రూక్ కవిత్వంపై కొత్త చర్చలు ప్రారంభమయ్యాయి. అయినప్పటికీ ఆయన కవితల్లో కనిపించే యువత ఉత్సాహం, త్యాగ భావన, మాతృభూమిపై ప్రేమ, భాషలోని సౌందర్యం ఇప్పటికీ పాఠకులను ఆకర్షిస్తూనే ఉన్నాయి. ఆయన ప్రభావం సాహిత్యానికే పరిమితం కాలేదు. ఆయన జీవితంపై జీవితచరిత్రలు వెలువడ్డాయి. నవలల్లో పాత్రగా కనిపించాయి. పలువురు సంగీతకారులు ఆయన కవితలకు స్వరాలు సమకూర్చారు. యుద్ధ స్మారక కార్యక్రమాల్లో, సాహిత్య చర్చల్లో, ప్రజా ప్రసంగాల్లో ఆయన కవితల పంక్తులు తరచూ ఉటంకిస్తునే ఉంటారు. కేవలం ఇరవై ఏడు సంవత్సరాల జీవితమే గడిపినప్పటికీ, బ్రూక్ ఇంగ్లిష్ సాహిత్యంలో మొదటి ప్రపంచ యుద్ధపు ప్రారంభ దశను ప్రతిబింబించిన ప్రముఖ కవిగా చిరస్థాయిగా గుర్తింపు పొందాడు.



స్కైరోస్‌లోని సమాధి వద్ద శాశ్వత స్మారక చిహ్నం

ఈ వారం కవితలు

## నేటి యువతరం


నేటి యువత
నిర్ధకులని, స్వార్థకులని
నిన్న మొన్నటి వరకు
అనుకుంటుండే వాణ్ణి

నేటి యువత
చేవచచ్చిన చేతగాని
చైతన్య రహితులని
నిన్న మొన్నటి వరకు
అనుకుంటుండే వాణ్ణి

నేటి యువత
పబ్బులకు క్లబ్బులకు పరిమితమయ్యే
పనికిరాని జులాయిలనీ
నిన్న మొన్నటి వరకు
అనుకుంటుండే వాణ్ణి

ఇప్పుడే తెలిసింది
నా దేశ యువత
మతోన్మాదపు మమకారాలను
అవినీతి అహంకారాల
అధికార పీఠాలను
కూకటి వేళ్ళతో కూల్చగల
చైతన్యపు జెన్‌జీలని

ఇప్పుడిప్పుడే తెలిసింది



నా దేశ యువత
విప్లవాల విస్ఫోటపు
అగ్ని పర్వతాలని
భగభగ మండే
త్యాగాల భగత్‌సింగ్‌లని


**జెన్-జీ యువత నీట్ పేపర్ లీక్‌పై ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నడిపిన ఉద్యమానికి స్పందనగా**

– బొమ్మగాని నాగభూషణం

## జీవన ప్రయాణం

సీతాకోకచిలుకల వెంటపడితే..
అందకుండా పరుగు తీస్తాయి
అందమైన పూదోటను పెంచితే..
వద్దన్నా మన వద్దకు చేరిపోతాయి
కావాలని ఎవరి వెంట పడవద్దు..
నీ ఆకర్షణీయమైన వ్యక్తిత్వమే..
వారిని నీ చెంతకు చేరేలా చేస్తుంది!

నిశ్శబ్దంగా ఉండడం కూడా లాభమే..
నీ వద్ద చెప్పడానికి ఏమీ లేదని కాదు
కొన్ని చోట్ల చెప్పవలసిన అవసరం లేదు
నిశ్శబ్దమే బలమైన సమాధానమవుతుంది
మౌనంతో మహా ఘనకార్యాలు సిద్ధిస్తాయి
నిశ్శబ్దం ఓ పెద్ద విస్ఫోటనమై పేలుతుంది
అపూర్వ విజయాల విందును వడ్డిస్తుంది!




జీవితమో రైలు ప్రయాణం లాంటిదే
కొందరు వస్తారు కొందరు వెళ్తారు
నువ్వు రైలు ఎక్కే టైం కూడా వస్తుంది
అందరూ నీతో ప్రయాణించినా..
నీ కన్న ముందు దిగే పోయే వాళ్లు..
నీ తర్వాత కూడా ప్రయాణించేటోళ్లు..
నీతో దిగే వాళ్ళు కూడా ఉండవచ్చు
ఎవరి ప్రయాణం నీ కోసం మారదు!

– మధుపాలీ

## బ్రాయిలర్ కోడి బాలలు

నేటి శిశువు ఏసి రూంలో జన్మించి..
పుట్టుకతోనే 'ఐక్యూ'ను వెంటేసుకొని..
అమ్మానాన్నల అతి గారాల పట్టిగా..
ఇంటి నాలుగు గోడల జైల్లో..
సమాజానికి బహు దూరంగా..
స్మార్ట్ సోషల్ మాధ్యమాల్లో..
రేయింబవళ్లు మునిగి తేలుతూ..
అదే గదిలో తింటూ, అక్కడే..
మలమూత్ర విసర్జన చేస్తూ..
గొంతెమ్మ కోర్కెలు తీర్చని వేళ..
ఇంటిని యుద్ధ క్షేత్రంగా మార్చుతూ..
పది మందిలో పిల్లిలా మారి..
ఇంట్లో యువరాజు/రాణిగా కాలరెగరేసి..
చిట్టి వైఫల్యానికే తెగ బాధపడుతూ..
ఒంటరితనాన్ని వెంటేసుకొని..



మానసిక రోగిగా మారి పోయి..
మైదాన ఆటలకు మంగళం పలికి..
వీడియో గేమ్స్‌లో కప్పులు గెలుస్తూ..
బంధుమిత్రులకు బహు దూరంగా..
తన చిట్టి గృహ సామ్రాజ్యంలో..
బ్రాయిలర్ కోడి వలె బతుకుతున్న..
నవ సమాజ మెరుగని నేటి పిల్లలు
జీవించే కళ తెలియని డిజిటల్ పిచ్చోళ్లు!

– బిఎంఆర్

# మోదీ ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదు

కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలి

ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా నాలుగోవ మహాసభలో

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు




**ప్రజాపక్షం/రంగారెడ్డి :** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నేతృత్వంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకపోతే కార్మిక, ప్రజల ఆగ్రహానికి గురై ప్రభుత్వ పతనం కాక తప్పదని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు.
ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడలో జరిగిన ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా నాలుగోవ మహాసభలో ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ యూసఫ్,సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్యలతో కలిసి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహాసభ ప్రారంభానికి ముందుగా తుక్కుగూడ పట్టణంలో కార్మికులు, నాయకులు భారీ ర్యాలీ నిర్వహించి, ఆ తరువాత మహాసభ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన అమరవీరుల స్థూపం వద్ద ఇబ్రహీంపట్నం మాజీ ఎంఎల్ఎ కొండిగారి రాములు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆ తరువాత ఎఐటియుసి జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కార్మికుల ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల ద్వారా కార్మికులు దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న హక్కులను పూర్తిగా కాలరాసిందని తీవ్రంగా విమర్శించారు. కార్మికులు, రైతులు, విద్యార్థులు,యువత ప్రయోజనాలకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల కారణంగానే గతంలో రైతులు ఢిల్లీలో చారిత్రాత్మక ఉద్యమం చేపట్టారని, నేడు అదే తరహాలో నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంపై జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించారని సాంబశివరావు గుర్తు చేశారు.ఈ పోరాటాలన్నీ కేంద్ర ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతకు నిదర్శనమని ఆయన చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక, విద్యార్థి, యువజన వ్యతిరేక విధానాలను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం కూడా కార్మికుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు, కనీస వేతనాల అమలు, ఉపాధి భద్రత కల్పించాలని ఆయన కోరారు.

**అసంఘటిత కార్మికుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది –ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం**

ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ,దేశంలో అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులు అత్యంత దయనీయంగా దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారని వాపోయారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను పూర్తిగా కాలరాస్తోందని,కార్మిక చట్టాలను బలహీనపరుస్తూ యజమానులకు అనుకూలంగా విధానాలు అమలు చేస్తున్నారని విమర్శించారు.
కార్మికుల హక్కులను కాపాడుకోవడానికి దేశవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీలు,కార్మిక సంఘాలు, రైతు, విద్యార్థి, యువజన, ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్య శక్తులు ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్మికుల ఐక్యత ద్వారానే వారి హక్కులను సాధించుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు.
సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ కార్మికుల సమస్య పరిష్కారానికి, హక్కుల పరిరక్షణకు ఎఐటియుసి నిరంతరం రాజీలేని సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు.

**మొట్టమొదటి కార్మిక సంఘం తమదే : ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.యూసుఫ్**

ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.యూసుఫ్ మాట్లాడుతూ దేశంలో 1920 అక్టోబర్ 31న ఆవిర్భవించిన మొట్టమొదటి కార్మిక సంఘం ఎఐటియుసి అన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే కార్మిక, ఫ్యాక్టరీల చట్టం, పారిశ్రామిక వివాదా చట్టం, కనీస వేతన చట్టాలను సాధించుకోవడం జరిగిందని గుర్తుచేశారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పనిగంటలు పెంచి కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడుతూ,పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలు సవరిస్తుందని ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు. ఈ మహాసభలో ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పానుగంటి పర్వతాలు,కె రామస్వామి, బి.దత్తు నాయక్, ఎస్.శేఖర్ రెడ్డి చందు యాదవ్, కొమ్మగళ్ళ రాజు,పబ్బతి లక్ష్మణ్, నరసింహారెడ్డి, దేవేంద్ర గౌడ్,బ్రహ్మాచారి, యాదగిరి, ఆర్టీసి వెంకన్న, శివ చంద్రశేఖర్ అనిల్,రవి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఆర్ఐలతో తెలంగాణ టూరిజానికి కొత్త ఊపు

పర్యాటక ప్రాంతాలను దత్తత తీసుకోండి

హైదరాబాద్‌లో రూ.10 కోట్లతో ఎన్ఆర్ఐ భవన్‌కు కృషి : మంత్రి జూపల్లి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ పర్యాటక రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడంలో ప్రవాస భారతీయులు కీలక భాగస్వాములు కావాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. అమెరికాలోని బాల్టిమోర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న 19వ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఎటిఎ) మహాసభల్లో పాల్గొన్న ఆయన, తెలంగాణ పర్యాటక ప్రాంతాలు, వారసత్వ కట్టడాలను ఎటిఎ బృందాలు, ఎన్ఆర్ఐ గ్రూపులు దత్తత తీసుకుని వాటి అభివృద్ధి, పరిరక్షణకు సహకరించాలని కోరారు. తెలంగాణలో అపారమైన పర్యాటక సామర్థ్యం ఉందని, దానిని ప్రపంచానికి పరిచయం చేయడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. అమెరికాలోని తమ మిత్రులు, విదేశీ సహోద్యోగులకు తెలంగాణ పర్యాటక విశిష్టతను పరిచయం చేసి, సెలవుల్లో రాష్ట్రానికి తీసుకువచ్చేలా ఎన్ఆర్ఐలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. అమెరికాలో స్థిరపడిన తెలుగు ప్రజలు అక్కడి ఆర్థిక, సాంకేతిక రంగాల్లో విశేష కృషి చేయడమే కాకుండా, తెలుగు భాష, సాహిత్యం, కళలు, సంస్కృతి పరిరక్షణలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారని జూపల్లి కొనియాడారు. 1990లో స్థాపించబడిన ఎటిఎ తెలుగు వారిని ఒకే వేదికపైకి తీసుకువచ్చి భాషా, సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించడంలో విశేష సేవలు అందిస్తోందని ప్రశంసించారు. తెలంగాణకు వచ్చే ప్రవాస భారతీయులకు అన్ని సేవలు ఒకే చోట లభించేలా హైదరాబాద్‌లో రూ.10కోట్ల వ్యయంతో ఎన్ఆర్ఐ భవన్ నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ భవనం ఎన్ఆర్ఐలకు సమన్వయ కేంద్రంగా ఉపయోగపడుతుందని తెలిపారు. సామాజిక అంశాలపై కూడా మంత్రి స్పందించారు. విద్య, వైద్యం పేరుతో ప్రజలు కార్పొరేట్ సంస్థల్లో అధిక వ్యయం చేయకుండా ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన ప్రభుత్వ విద్య, వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే ఆర్భాటపు పెళ్లిళ్లు, వేడుకల కోసం అప్పుల పాలవకుండా పొదుపు అలవాటు చేసుకోవాలని హితవు పలికారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించిన మంత్రి, సమాజంలో పెరుగుతున్న సామాజిక రుగ్మతల నిర్మూలనకు ప్రజల్లో చైతన్యం కల్పించే లక్ష్యంతో త్వరలోనే 'ప్రభాత భేరి' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఈ సామాజిక ఉద్యమంలోనూ ప్రవాస భారతీయులు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఉద్యమ నిత్య చైతన్య స్ఫూర్తి గద్దర్

కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజా కళాకారుడు గద్దర్ ఉద్యమం నిత్య చైతన్యస్ఫూర్తి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు కొనియాడారు. గద్దర్ 3వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 6వ తేదీన రవీంద్రభారతిలో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న గద్దర్ వర్ధంతి స్మారక సభ వాల్ పోస్టర్‌ను ఆదివారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం, మఖ్దూం భవన్ లో గద్దర్ ఫౌండేషన్ కార్యదర్శి జి.వి.సూర్య కిరణ్ తో కలిసి కూనంనేని సాంబశివరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సందర్భంలో గద్దర్ తన ఆట పాట మాటతో ఉద్యమకారులను చైతన్య పర్చడం ద్వారా ఉద్యమం ఉవ్వేత్తున ఎగిసిపడేందుకు దోహదం చేశారన్నారు.గద్దర్ స్ఫూర్తితో జిల్లాలలో అనేక సాంస్కృతిక దళాలు ఏర్పడి తెలంగాణ ఉద్యమ వ్యాప్తికి దోహదం చేశాయని సాంబశివరావు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టూరిజం కార్పొరేషన్ ఔట్ సోర్సింగ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి పాల్గొన్నారు.

## ప్రవాసుల సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది

మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రవాస తెలుగువారి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. అమెరికాలోని బాల్టిమోర్‌లో జరుగుతున్న అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఎటిఎ) మహాసభల సందర్భంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఎన్ఆర్ఐ కమిటీ సభ్యులతో ముఖాముఖి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విదేశాల్లో నివసిస్తున్న తెలుగు ప్రవాసుల సమస్యలు, సంక్షేమం, తెలంగాణతో వారి అనుబంధాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ఎన్ఆర్ఐలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను కమిటీ సభ్యులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. విదేశాల్లోని తెలుగు సంఘాలతో సమన్వయం, తెలంగాణలో పెట్టుబడుల ప్రోత్సాహం, పర్యాటక రంగ అభివృద్ధి, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ప్రవాస తెలుగువారితో ప్రభుత్వ అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరంపై పలు సూచనలు చేశారు. ఎన్ఆర్ఐలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత శాఖలతో సమన్వయం చేసి పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. తెలంగాణ అభివృద్ధికి, రాష్ట్ర ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో చాటడంలో ప్రవాస తెలుగువారి పాత్ర కీలకమని మంత్రి పేర్కొన్నారు. పెట్టుబడులు, పర్యాటక ప్రోత్సాహం, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక అభివృద్ధి కార్యక్రమాల్లో ఎన్ఆర్ఐల భాగస్వామ్యాన్ని ప్రభుత్వం మరింత ప్రోత్సహిస్తుందని తెలిపారు.

## ప్రశాంతంగా అంబేద్కర్ వర్సిటీ బిఇడి ప్రవేశ పరీక్ష

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఇడి ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగాముగిసినట్టు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వెల్లడించింది. ఈ పరీక్షకు 4017 మంది అభ్యర్థులలో 3335 మంది పరీక్షకు హాజరయ్యారు. 2026 27 విద్యా సంవత్సరానికి బిఇడి (ఒడిఎల్ ప్రోగ్రామ్ ప్రవేశం పరీక్ష రాష్ట్ర వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసినట్టు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ జి. దయాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ఫలితాలు త్వరలోనే విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం యూనివర్సిటీ పోర్టల్ www. braouonline.in లో సంప్రదించాలని సూచించారు.

## 7 రోజుల్లో డబ్బు రెట్టింపు అంటూ రూ.95లక్షల టోకరా

ఇన్‌స్టాగ్రామ్ పెట్టుబడి పేరుతో మోసం..

ముగ్గురిపై కేసు నమోదు చేసిన హైదరాబాద్ పోలీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఏడు నుంచి ఎనిమిది రోజుల్లో పెట్టుబడిపై భారీ లాభాలు వస్తాయని ఆశ చూపించి పలువురి నుంచి దాదాపు రూ.95లక్షలు వసూలు చేసి మోసానికి పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితుడి ఫిర్యాదుతో సిసిఎస్ డిటెక్టివ్ విభాగం ఆర్థిక నేరాల విభాగం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. రాజేంద్రనగర్‌కు చెందిన రవి పంతగాని ఫిర్యాదు మేరకు.. 2025 సెప్టెంబర్‌లో ఇన్‌స్టాగ్రామ్‌లోని పలు పేర్లతో ఉన్న ఖాతాల ద్వారా స్వల్పకాలిక పెట్టుబడులపై భారీ లాభాలు వస్తాయని ప్రచారం చేశారు. రూ.5,500 పెట్టుబడికి రూ.5,000, రూ.10 వేలు పెట్టుబడికి రూ.9,500, రూ.20 వేలు పెట్టుబడికి రూ.22 వేల వరకు లాభం ఇస్తామని నమ్మించారు. ఈ ప్రచారాన్ని నమ్మిన బాధితుడు బతూల్ ఫాతిమాను సంప్రదించగా, అత్తాపూర్‌లోని డి కేఫ్ హోటల్‌లో సమావేశం ఏర్పాటు చేసి, అలీ జాన్ రజ్వీతో కలిసి షేర్లలో పెట్టుబడి పెట్టి రెండు వారాల్లో రూ.10 లక్షలకు బదులుగా రూ.18లక్షలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం 'ఇన్వెస్ట్‌మెంట్ డిస్కషన్స్' పేరుతో వాట్సాప్ గ్రూప్ కూడా ఏర్పాటు చేసి బాధితుడి నుంచి విడతల వారీగా రూ.10 లక్షలు తీసుకున్నట్లు తెలిపారు.
నిర్దేశిత గడువు ముగిసినా డబ్బు చెల్లించకపోవడంతో మరో ఒప్పందం చేసుకుని భద్రతగా ఐదు సంతకం చేసిన చెక్కులు ఇచ్చారని, అయినప్పటికీ డబ్బు తిరిగి ఇవ్వకుండా నిందితులు పరారయ్యారని బాధితుడు ఆరోపించాడు. విచారణలో ఇదే తరహాలో సయ్యద్ ఆసిఫ్ పాషా, సయ్యద్ షాబాజ్, సయ్యద్ అఫ్రోజ్, మహ్మద్ యూసుఫుద్దీన్, సయ్యద్ సర్ఫరాజ్, ఎండి అజర్ ఉద్దీన్, బిబి అష్రఫ్ తదితరులతో పాటు మరికొందరి నుంచి కూడా మొత్తంగా రూ.90 నుంచి రూ.95 లక్షల వరకు వసూలు చేసి మోసానికి పాల్పడినట్లు తెలిసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు ఆధారంగా బతూల్ ఫాతిమా, జకియా ఫాతిమా, అలీ జాన్ రజ్వీలపై సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ టి. అశోక్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయ ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను

# సత్వరమే పరిష్కరించాలి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపాలని స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (ఎస్‌టియు టియస్) రాష్ట్ర అధ్యక్షుడు జి.సదానందం గౌడ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ తరహాలో తెలంగాణలో కూడా ఉపాధ్యాయులకు శాశ్వత ప్రాతిపదికన బదిలీల యాక్ట్ రూపొందించాలన్నారు. హైదరాబాద్‌లోని ఎస్‌టియు రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను సత్వరమే పరిష్కరించాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సందర్భంగా సదానందంగౌడ్ మాట్లాడుతూ విద్యాశాఖలో ఇంటర్ లోకల్ డిప్యూటేషన్లకు సంబంధించిన జీవో 190ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కొత్త పీఆర్సీని ప్రకటించి, ఆరు నెలలలోపు సిఫారసులను అమలు చేస్తామని ఇచ్చిన ఎన్నికల మ్యానిఫెస్టో హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సి.పి.ఎస్. రద్దు, డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆయన కోరారు. పెండింగ్ లో ఉన్న ఐదు డిఏలను సత్వరమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎయిడెడ్, మోడల్, గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులకు 010 ద్వారా వేతనాలు చెల్లించాలని, రేషనలైజేషన్ జీవో 25 ను తక్షణమే సవరించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్, 27న సంఘ 80 వసంతాల ఆవిర్భావ దినోత్సవ వేడుకలు రాష్ట్ర స్థాయిలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్, ఆర్థిక కార్యదర్శి సయ్యద్ సాబేర్ అలి సంఘ నివేదికలు ప్రవేశ పెట్టగా, సభ్యులు చర్చించి పలు తీర్మానాలను ఆమోదించారు. ఈసమావేశంలో ఎస్‌టియు రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఎం. పర్వత్ రెడ్డి, నాయకులు కరుణాకర్ రెడ్డి, ఎ.వి.సుధాకర్, రాధా జయలక్ష్మి, కృష్ణా రెడ్డి, వీర రాఘవులు, పరమేశ, 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు, గురువులకు, ఇంజినీర్లకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యువత విషయంలో కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ చేసే ప్రసంగాలకు భిన్నంగా సిఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ విద్యార్థులను, ఇంజనీర్లను, టీచర్లను క్రిమినల్ వేస్ట్ అంటున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన సిఎం చేసిన ఈ వ్యాఖ్యలకు విద్యార్థులకు, గురువులకు, ఇంజనీర్లకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాహుల్‌గాంధీకి కెటిఆర్ ఆదివారం బహిరంగ లేఖ రాశారు. దేశ ప్రగతికి పాటుపడుతున్న ఇంజనీర్లు క్రిమినల్ వేస్ట్ అనడమే కాంగ్రెస్ పార్టీ విధానమా?అని ప్రశ్నించారు. ఇంజనీరింగ్ విద్యార్థులతో పాటు ఇంజనీరింగ్ టీచర్ల పట్ల సిఎం రేవంత్ రెడ్డి తప్పుగా మాట్లాడారని, యువతపైన, విద్యార్థులపైన అడ్డగోలుగా నోరు పారేసుకోవడం రేవంత్ రెడ్డికి అలవాటుగా మారిందన్నారు. ఇప్పటికైనా సిఎం రేవంత్ రెడ్డి వెంటనే విద్యార్థులకు, గురువులకు క్షమాపణ చెప్పాలన్నారు. ఒకవైపు భారతదేశ ఇంజనీర్లు ప్రపంచ కంపెనీలను నడుపుతున్నారని, అంతరిక్షంలోకి రాకెట్లను పంపుతున్నారని, అలాంటి వారి పట్ల 'క్రిమినల్ వేస్ట్' ఎలా అంటారని ప్రశ్నించారు. ఇప్పటి వరకు సిఎం రేవంత్ రెడ్డితో క్షమాపణ చెప్పించకుండా రాహుల్ గాంధీ మౌనంగా ఉండడమంటే రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను సమర్థించినట్టేనని కెటిఆర్ పేర్కొన్నారు.

## టిజి పిఒసెట్ తొలి విడత సీట్ల కేటాయింపు

1106 మందికి సీట్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో బిపిఎడ్ , యుజిడిపిఎడ్ కోర్సులల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన టీజీ పీఈసెట్ 2026 మొదటి విడత కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయినట్టు సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఐ. పాండురంగారెడ్డి తెలిపారు. కన్వీనర్ కోటా కింద అందుబాటులో ఉన్న మొత్తం 1,743 సీట్లకు గానూ 1,400 మంది విద్యార్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకున్నారని, అర్హత పొందిన 1,106 మంది విద్యార్థులకు తొలి విడతలో సీట్లను కేటాయించామని వివరించారు. సీటు పొందిన విద్యార్థులు తమ ట్యూషన్ ఫీజును క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించాలని, ఫీజు చెల్లించిన అనంతరం వెబ్‌సైట్ నుంచి 'ట్యూషన్ ఫీజు రసీదు' జాయినింగ్ రిపోర్ట్ ప్రింట్ తీసుకోవాలని సూచించారు. ఈనెల 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు తమకు కేటాయించిన కళాశాలల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఫీజు రసీదు, జాయినింగ్ రిపోర్ట్‌తో నేరుగా హాజరవ్వాలని సూచించారు.

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు

# 1వ తేదీనే వేతనాలు చెల్లించడం పట్ల హర్షం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆగస్టు 1న వేతనాలను చెల్లించడం పట్ల తెలంగాణ రాష్ట్ర ఒకేషనల్ క్వాలిఫైడ్ కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ హర్శం వ్యక్తం చేసింది. చాలీచాలని జీతాలతో, వచ్చే ఆ జీతాలు కూడా ఎప్పుడు వస్తాయో కూడా తెలియని అయోమయంతో సుమారు రెండు దశాబ్దాలకు పైబడి కష్టాలను అనుభవించామని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల రవిశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంట్రాక్ట్ ,ఔట్ సోర్సింగ్ వ్యవస్థలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఏ ఉద్యోగి కూడా ప్రతినెలా ఒకవ తేదీన జీతాలు అందుకోలేదన్నారు. వేతనాల విషయంలో సిఎం రేవంత్ రెడ్డి సాహసోపేత నిర్ణయం తీసుకున్నారన్నారు. గత ప్రభుత్వం హయాంలో ప్రతినెలా 15 లేదా 18వ తేదీలలో రెగ్యులర్ ఉద్యోగులకు జీతాలు ఇచ్చి, తమకు మాత్రం మూడు, నాలుగు నెలలకు ఒక సారి వేతనాలను విడుదల చేసేదన్నారు. ఆగస్టు ఒకటవ తేదీనే జీతాలు చెల్లించిన సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, విద్యాశాఖ కార్యదర్శి,ఇంటర్ విద్య కమిషనర్ తదితరులకు ఆకుల రవిశంకర్ కృతజ్ఞతలు తెలిపారు.

**ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయండి**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ,కార్యదర్శులు డాక్టర్ వస్కుల శ్రీనివాస్, డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ కోరారు. ఈ విషయమై ఇంటర్ బోర్డు కార్యదర్శి అభిలాష అభినయ్‌కి ఆన్‌లైన్ ద్వారా వినతిపత్రం పంపించినట్టు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత సంవత్సరం పనిచేసిన గెస్ట్ ఫ్యాకల్టీ వాళ్ళను మాత్రమే రెన్యువల్ చేశారని, ఈ మధ్యకాలంలో జూనియర్ లెక్చరర్స్ నుంచి ప్రిన్సిపాల్స్ పదోన్నతులు రావడం, కొంతమంది జూనియర్ లెక్చరర్స్ రిటైర్‌మెంట్ కావడంతో సుమారు రాష్ట్ర వ్యాప్తంగా 300 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ఇంటర్ బోర్డ్ జోక్యం చేసుకుని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

# హైదరాబాద్‌లో రూ.25 కోట్ల 'రియల్' ఎస్టేట్ స్కామ్

యజమానికి తెలియకుండానే బ్యాంక్ రుణం

డిఎన్‌సి ఇన్‌ఫ్రా ఎండితో పాటు బ్యాంక్ అధికారులపై కేసు నమోదు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అపార్ట్‌మెంట్ యజమానికి తెలియకుండానే ఓ రియల్టర్ బ్యాంక్ నుంచి రూ.25కోట్లు రుణం తీసుకుని మోసగించాడు. మలక్‌పేటలోని రూ.17.10కోట్ల విలువైన కమర్షియల్ భవన విక్రయానికి సంబంధించి బ్యాంక్ అధికారులతో కుమ్మక్కైన రియల్టర్ రూ.25కోట్ల కుంభకోణానికి పాల్పడినట్లు సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. డిఎన్‌సి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ దరిశాల నరేష్ చౌదరి, పంజాబ్ నేషనల్ బ్యాంకు అధికారులతో కుమ్మక్కై తనను మోసం చేశారని వ్యాపారవేత్త వేముల సత్యమూర్తి ఫిర్యాదు చేశారు. పోలీసు కథనం ప్రకారం, మలక్‌పేట నల్గొండ క్రాస్‌రోడ్స్‌లోని 'శ్రీహర్ష కాంప్లెక్స్'ను రూ.17.10కోట్లకు విక్రయించేందుకు 2024 నవంబర్‌లో ఒప్పందం కుదిరింది. కొనుగోలుదారు దరిశాల నరేష్ చౌదరి పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి రూ.25కోట్ల రుణం మంజూరైనట్లు లేఖ చూపించడంతో, పూర్తి చెల్లింపు అందకముందే రిజిస్టర్డ్ సేల్ డీడ్ చేయించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం రూ.17.10 కోట్లకు ఇచ్చిన నాలుగు చెక్కులను బ్యాంకులో సమర్పించవద్దని కోరుతూ రుణం విడుదలైన వెంటనే మొత్తం చెల్లిస్తానని నమ్మబలికాడని, ఆ చెక్కుల గడువు ముగిసిన తర్వాత కొత్త చెక్కులు ఇచ్చినా అవి కూడా 'సరిపడా నిధులు లేవు' అనే కారణంతో బౌన్స్ అయ్యాయని ఆరోపించారు. ఈలోగా తన భవనాన్ని తన అనుమతి లేకుండా తాకట్టు పెట్టి పంజాబ్ నేషనల్ బ్యాంకు ఎంసిసి బ్రాంచ్ నుంచి రూ.25కోట్ల రుణం పొందినట్లు తెలిసిందని, దీనిపై సివిల్ కోర్టులో సేల్‌డీడ్ రద్దు, తాకట్టు పత్రాలను చెల్లనివిగా ప్రకటించాలని దావా దాఖలు చేసినట్లు ఫిర్యాదుదారు పేర్కొన్నారు. బ్యాంకు బ్రాంచ్ హెడ్ రమేష్ బాబు, సర్కిల్ హెడ్ అరవింద్ కొర్రా, చీఫ్ మేనేజర్ సందీప్ కచ్చి తదితర అధికారులు నిబంధనలను ఉల్లంఘించి, సరైన భౌతిక పరిశీలన, విలువ నిర్ధారణ, న్యాయపరమైన తనిఖీలు లేకుండానే రూ.25 కోట్ల రుణం మంజూరు చేశారని ఆరోపించారు. అనంతరం నరేష్ చౌదరి రూ.2.10 కోట్లు మాత్రమే చెల్లించడం ద్వారా మిగిలిన సేల్ కన్సిడరేషన్ బకాయి ఉన్న విషయాన్ని అంగీకరించినట్లేనని ఫిర్యాదులో పేర్కొన్నారు.
దరిశాల నరేష్ చౌదరిపై గతంలో హైదరాబాద్, సైబరాబాద్, రాజస్థాన్ ప్రాంతాల్లో మోసం, నమ్మకద్రోహం తదితర కేసులు నమోదయ్యాయని కూడా ఫిర్యాదులో ప్రస్తావించారు. ఫిర్యాదు ఆధారంగా సిసిఎస్ ఆర్థిక నేరాల విభాగం ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ దర్యాప్తు చేపట్టారు. నరేష్ చౌదరిపై ఆయా పోలీసు స్టేషన్‌లో ఇప్పటికే పలు చీటింగ్ కేసులు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

## ఉచితంగా చేపల పిల్లల పంపిణీకి రూ.116 కోట్లు నిధులు విడుదల

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ంలోని మత్స్యకారుల జీవనోపాధిని బలోపేతం చేయడంతో పాటు చేపల ఉత్పత్తిని పెంచే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత చేపలు, రొయ్య పిల్లల పంపిణీ పథకానికి గాను రూ.116 కోట్లను మంజూరు చేసింది . ఈ సంవత్సరం ఈ పథకానికీ గాను ప్రభుత్వం మొత్తం రూ.134.94 కోట్ల నిధులను కేటాయించింది. అయితే ఈ నిధులను ఇప్పటికే విడుదల చేయాల్సి ఉండగా ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో వర్ష భావ పరిస్థితుల కారణంగా జలాశయాలు, చెరువులు, కుంటల్లో నీరు లేకపోవడంతో ఆలస్యమైంది. గత వారం రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో పలు జిల్లాలో జలాశయాలు, చెరువులు , కుంటలు నీటితో కళకళలాడుతుండడంతో మొదటి దశగా ప్రభుత్వం రూ.116 కోట్లను విడుదల చేసింది. ఈ పథకం అమలులో భాగంగా టెండర్ల ప్రక్రియ పూర్తైన వెంటనే జిల్లాల వారీగా చేపలు, రొయ్య పిల్లల సరఫరా ప్రారంభం కానుంది. అనంతరం మత్స్యశాఖ అధికారులు, జిల్లా యంత్రాంగం సమక్షంలో చెరువుల్లో చేపల పిల్లలను విడుదల చేయనున్నారు.

## కడియం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్:** చిల్పూర్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన సుమారు 50మంది యువకులు, ముదిరాజ్ కులస్తులు, బిఆర్ఎస్ కార్యకర్తలు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హన్మకొండ కనకదుర్గ కాలనిలోని ఎమ్మెల్యే నివాసంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జక్కుల వీరయ్య, చొక్కం సంపత్, చొక్కం రమేష్, రాజు, నాగరాజు, అజయ్, లింగనబోయిన రమేష్, ఇట్టబోయిన రాజశేఖర్, రాయగిరి సత్యం, పెద్ద వీరయ్య, మోతే రాహుల్, రంజిత్ తో పాటు మరో 30మంది ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరడానికి అన్ని వర్గాల ప్రజలు ఆకర్షితులు అవుతున్నారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ సంక్షేమ పథకం పేద ప్రజలకు ఉపయోగపడుతుందని అనడానికి కాంగ్రెస్ పార్టీలోకి జరుగుతున్న చేరికలే నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిర్ర నాగరాజు, మాజీ ఎంపిపి బాలరాజు, కొండాపూర్ గ్రామ ఉప సర్పంచ్ నరేష్, వివిధ గ్రామాల సర్పంచులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## కాళేశ్వరం వద్ద గోదావరి నీటి ప్రవాహంలో గల్లంతైన వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/కాళేశ్వరం:** భార్య కళ్ళెదుటే నీటి ప్రవాహంలో భర్త గల్లంతైన విషాదకర ఘటన కాళేశ్వరం గోదావరి తీరం వద్ద ఆదివారం చోటు చేసుకుంది.జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం ఆలయ దర్శనానికి వచ్చిన హన్మకొండలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన బొబ్బల శ్రీనివాస్ రెడ్డి,సుధ దంపతులు పుణ్యస్నానాలు చేసేందుకు గోదావరి నదికి వెళ్ళారు.ప్రధాన పుష్కర ఘాట్ తీరం వద్ద గోదావరి నదిలో పుణ్యస్నానం చేస్తూ బొబ్బల శ్రీనివాస రెడ్డి(52) ప్రమాదవశాత్తు లోతు ప్రవాహంలో మునిగి గల్లంతయ్యాడు.నీటి ప్రవాహంలో మునిగిపోతున్న భర్తను గమనించిన భార్య సుధ అరుపులు,కేకలు వేయడంతో తీరం పరిసరాలలో ఉన్నకొంతమంది స్థానిక యువకులు నది ప్రవాహంలోకి దూకి అతడిని ఒడ్డుకు చేర్చారు.అప్పటికే నీళ్ళు మింగి ఉండటంతో ఎంత ప్రయత్నించిన ఆయనను కాపాడలేక పోయారు.దాంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహాదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మృతునికి భార్య,ఒక కొడుకు ఉన్నారు.భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.తన కళ్ళెదుటే తనభర్త మృతిని జీర్ణించుకోలేని భార్య సుధ రోదనలు ఆకాశాన్నంటాయి.

## రాజ్యాంగ స్ఫూర్తితో సామాజిక సమస్యల విశ్లేషణ



**ప్రజాపక్షం/హనుమకొండ :** రాజ్యాంగ స్ఫూర్తితో సామాజిక సమస్యల విశ్లేషణను జీవన్ కుమార్ చేపట్టారని ప్రముఖ రాజ్యాంగ విశ్లేషకులు కల్పనా కన్నబిరాన్ అన్నారు. ఆదివారం హనుమకొండలోని ప్రెస్ క్లబ్ సెమినార్ హాల్లో జరిగిన పుస్తకావిష్కరణ సభలో మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు ఎస్ జీవన్ కుమార్ రచించిన వీధి బతుకులు విస్థాపనలు, సజీవ స్మృతులు అనే పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధాన వక్త కల్పనా కన్నబిరాన్ పాల్గొని జీవన్ కుమార్ రచించిన రెండు పుస్తకాల్లోని హక్కుల సమస్యలన్నీ రాజ్యాంగ స్ఫూర్తి ని విస్తృత పరిధిలో వ్యాఖ్యానించినట్టుగా ఉన్నాయని అన్నారు. గత దశాబ్ద కాలంగా దేశంలో రాజ్యాంగ సంస్థలన్నీ తమ స్వతంత్రతను కోల్పోతున్నాయని అన్నారు. విశ్వవిద్యాలయాల్లో కూడా కేంద్ర ప్రభుత్వం ఒక పథకం ప్రకారం కుల సమస్య, సామాజిక అణచివేత, స్త్రీ పురుష వివక్ష, మైనార్టీ మతస్థుల సమస్యలు మొదలు అంశాల పైన పరిశోధనలకు అనుమతులు ఇవ్వడం లేదని, కేవలం హిందూ రాజుల, హిందూ మతం యొక్క గొప్పతనంపై మాత్రమే పరిశోధనలు కొనసాగాలని ఆంక్షలు విధిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత మాట్లాడుతూ జీవన్ కుమార్ తన 30 ఏళ్ల మానవ హక్కుల కార్యచరణలో భాగంగా రాసిన సమస్యలు ఇప్పటికైనా పరిష్కారమైతే బాగుండునని అన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్, సూరేపల్లి సుజాత, డాక్టర్ తిరుపతయ్యలు ఇతర వక్తలుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వేమన వసంతలక్ష్మి , కాత్యాయని విద్మహే, దేవులపల్లి అమర్, కవయిత్రి విమల, మెట్టు రవీందర్లు, కె అనురాధ పాల్గొన్నారు.

## ఏజెన్సీ చట్టాల అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చిన్నచూపు



**ప్రజాపక్షం/నూగురు /వెంకటాపురం :** ఆగస్ట్9 ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని నిరసన కార్యక్రమాలు చేపడతామని,ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ పేర్కొన్నారు. ఆదివారం ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆదివాసి సంఘాల నాయకులు హాజరై బ్లాక్ డే గా నిర్వహించాలని ముక్తకంఠంతో తీర్మానం చేయడం జరిగింది. సమావేశంలో తుడుందెబ్బ జాతీయ నాయకులు యసం రాజు, గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి పూనెం సాయి, ఆదివాసీ నవ నిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు కోర్స నర్సింహామూర్తి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీ ప్రాంత చట్టాలు అమలు విషయలో సవితి తల్లి ప్రేమ కనబరుస్తుఇ 1/70 చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయకుండా అడ్డుపడుతున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏజెన్సీ ప్రాంతాలకు వలసలుగా గిరిజనేతరులు వస్తు ఏజెన్సీ చట్టాలను తొలగించాలని, 1700 మంది గిరిజనేతరులు కోర్టుని ఆశ్రయించడం అందులో ప్రదాన పాత్రలో వెంకటాపురం మండలానికి చెందిన అధికార పార్టీ వ్యక్తి ఉండడం విడ్డూరం అని అన్నారు. అలాగే ఆగస్ట్9 న జరగబొయె ప్రపంచ ఆదివాసి దినోత్సవానికి యువతీ, యువకులు, ఆదివాసి సంఘాలు, మహిళ సంఘాలు, ఆదివాసి పెద్దలు ఆదిక సంఖ్యలో పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీఎస్పీ జిల్లా ఆధ్యక్షులు ప్రతాప్, మహేష్, సోమరాజు, ఆదివాసి భూమిపుత్ర సంఘం నాయకులు, పాల్గొన్నారు.

## విద్య, వైద్యం, విద్యుత్ రంగాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సిపిఐ ఉద్యమం

సిపిఐ వరంగల్ జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతకింది కుమారస్వామి



**ప్రజాపక్షం/నల్లబెల్లి:** విద్యా వైద్యం విద్యుత్ రంగాల ప్రైవేటీకరణ, రైతు పంటలు కొనుగోలుపై 35 శాతం పరిమితి, ఉపాధిహామీ పథకంపై ఆంక్షలు, అధికధరలపై సిపిఐ దేశవ్యాప్తంగా పాద యాత్రలు, ప్రజల సంతకాల సేకరణ వంటి ఉద్యమాన్ని సిపిఐ పార్టీ చేపట్టనున్నదనీ వరంగల్ జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతకింది కుమారస్వామి అన్నారు. కొనకటి రమేష్ అధ్యక్షతన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న కుమారస్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నేడు అన్ని రంగాలను ప్రైవేటుపరం చేస్తూ అధిక ధరలు పెంచుతూ పేద మధ్యతరగతి ప్రజల బతుకులను ఛిద్రం చేస్తున్నదన్నారు . విద్యా వైద్యం ప్రైవేటీకరణ మూలంగా పేద మధ్యతరగతి ప్రజలు చదువును ఆరోగ్యాన్ని కొనలేక పోతున్నారన్నారు. అడ్మిషన్ లు డొనేషన్లు కోచింగ్ ల పేరుతో ప్రైవేటు విద్యా సంస్థలు లక్షలాది రూపాయలను ప్రజలనుంచి గుంజుతుండటం ఒకవైపు, ప్రశ్నాపత్రాలు లీకులు మరోవైపు, లక్షలాది ప్రభుత్వ పోస్టులున్నా భర్తీ చేయకపోవడంతో ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు .వ్యవసాయ రంగాన్ని దివాళా తీసే విధంగా కల్తీ విత్తనాలు ఎరువులు పురుగుమందులకు తోడు మార్కెట్ సౌకర్యాలు , పంటలు కొనుగోలు చేయకపోవడంతో పాటు 35 శాతం మించి పంటలను కొనుగోలు చేయమంటూనే అమెరికా ట్రేడ్ డీల్ తో స్వదేశీ రైతాంగాన్ని నట్టేట ముంచే విధానాలు చేపట్టడంతో రైతాంగం దివాళతీస్తారన్నారు.వ్యవసాయకూలీలకు ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చి రాష్ట్రాలపై 40శాతం భారం మోపడంతో రాష్ట్రాలపై అధిక భారాలు పడీ రాష్ట్రాల వాటా జమచేయకపోతే కేంద్రం ఇచ్చే 60 శాతం నిధులు కూడా నిలాపేస్తామనడం తో ఉపాధి హామీ పథకం నిర్వీర్యం అవుతుందన్నారు.ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఐ జాతీయ పార్టీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఆగస్టు 4 నుంచి 10 వరకు ప్రజల దగ్గరకు సిపిఐ వెళుతందన్నారు.అనంతరం మండల కార్యదర్శి బట్టు సాంబయ్యను వ్యక్తిగత కారణాలతో తగ్గించి నూతన మండల కార్యదర్శిగా పరికి కోర్నేలు సహాయ కార్యదర్శులుగా కడియాల క్రాంతి కుమార్ మామిండ్ల పెద్ద ఐలయ్యను సమావేశం నిర్ణయించిందన్నారు.ఈ సమావేశంలో మర్రి రమేష్ అనుమాండ్ల కొంరెల్లి రవి తదితరులు పాల్గొన్నారు .

## కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక ఫాసిస్టు విధానాలపై పోరుకు సిద్ధం కండి

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య, రాజ్యాంగ, సెక్యులరిజం వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, బికేఎంయు జాతీయ సమితి సభ్యులు మోతె లింగారెడ్డి అన్నారు. ఆదివారం రోజున హసన్ పర్తి మండల కేంద్రంలో సిపిఐ పాదయాత్ర గోడపత్రికలను విడుదల చేసిన అనంతరం వారు మాట్లాడుతూ నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, విద్య,వైద్యం పేద ప్రజలకు దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు చట్టసభలలో తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు . పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని, ఆదివాసి దళితులను ఆదుకోవాలని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, బ్యాలెట్ పేపర్ తో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగు ధర్నాను, ఆగస్టు 6 నుంచి 14 వరకు నిర్వహించే పాదయాత్రలకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నేదునూరి రాజమౌళి, మండల కార్యదర్శి మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి,నాంపల్లి లక్ష్మ య్య, రేణికుంట్ల రాజయ్య, షేక్ బాబు, నేదునూరి రవికుమార్, వెలిసోజు వెంకటేశ్వర్లు, లింగాల రాజు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** ప్రజల సమస్యల పరిష్కార మార్గమే లక్ష్యంగా పని చేస్తామని65వ డివిజన్ అధ్యక్షులు నేదునూరి సునీల్ తెలిపారు.గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 65వ డివిజన్ దేవన్న పేట గ్రామంలో ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు డివిజన్ అధ్యక్షులు నేదునూరి సునీల్ ఆధ్వర్యంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు సహకారంతోగ్రామంలో కొత్త ఎల్ఈడీ వీధి దీపాలను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు సునీల్ మాట్లాడుతూ గ్రామంలో రాత్రి సమయంలో చీకటి కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులు మా దృష్టికి రాగ ఈ వీధి దీపాలను ఏర్పాటుచేశామని తెలిపారు.అలాగే ప్రజల సమస్యల పరిష్కార మార్గమేలక్ష్యంగా పనిచేస్తామని గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగాసునీల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, డీసీసీ ఉపాధ్యక్షులు అయ్యల రామ్ రెడ్డి, గ్రామ అధ్యక్షులు మల్లేష్, సీనియర్ నాయకులు నందిపాక భాస్కర్, కోర్నెలు బాపురెడ్డి, నాగరాజు, సర్వేష్ కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## విద్యుత్, బీటి రోడ్డు పనులు వేగవంతం: ఎమ్మెల్యే కడియం



**పజాపక్షం/రఘునాథపల్లి :** మండలంలోని లక్ష్మీ తండా విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు అదే విధంగా నిడిగొండ నుండి ఖిలాషాపూర్ వెళ్లే బీటీ రోడ్డు పనులను వేగవంతం చేయాల ని అధికారులను, కాంట్రాక్టర్‌ను మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశించారు. ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా కలిసి మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని హనుమకొండలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ నిడిగొండ ఖిలాషాపూర్ బీటీ రోడ్డు నిర్మాణం అదేవిధంగా లక్ష్మీ తండాలో నిర్మాణంలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ పనులు, ఖిలాషాపూర్ లో నెలకొన్న విద్యుత్ సమస్యలు, లక్ష్మీ తండా ఫతేశాపూర్ ఇబ్రహీంపూర్ లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై ఎమ్మెల్యేతో వారు చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి వారితో మాట్లా డుతూ త్వరలోనే వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యల న్నిటిని పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి విద్యుత్ ఎస్ఈ సంపత్ రెడ్డితో అలాగే రోడ్డు పనుల పై కాంట్రాక్టర్ లింగాల వంశీ రెడ్డితో ఫోన్ లైన్ లో మాట్లాడుతూ వెంటనే ఆయా పనులను వేగవంతం చేయాలని అయన వారిని ఆదేశించారు.అదేవిధంగా రైతులు కరెంటు పోల్ పనులకు సహకరించాలని ఆయన కోరారు.ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్య క్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాదే మహేందర్ రెడ్డి, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గాజుల పార్టీ వీరోజీ తదితరులు ఉన్నారు.

## నేలకొరిగిన చెట్ల పరిశీలన



**ప్రజాపక్షం/మంగపేట :** ములుగు జిల్లా మంగపేట మండలం కోమటిపల్లి శాంతినగర్ మధ్య జులై 28న మంగళవారం సాయంత్రం వేగవంతమైన సుడిగాలు ద్వారా వల్ల నేలకొరిగిన చెట్లను పరీక్షించడానికి పర్యావరణ, వృక్ష శాస్త్రవేత్త డాక్టర్ సుతార్ సతీష్ కాకతీయ విశ్వవిద్యాలయం పరిశోధక బృందంతో పరిశీలించారు. పరిశీలన అనంతరం సుతార్ సతీష్ మాట్లాడుతూ, సారవంతమైన నేలలు మొక్క యొక్క వేర్లు నేలపై భాగంలోనే విస్తరించే ఉండడం మూలాన బలమైన సుడిగాలుల ద్వారా సుమారు రెండు వందల పైన మొక్కలు నేల మీద పడటడం జరిగిందని తెలిపారు. భూమి ఉపరితలంపై ఉన్న వేడి, తేమ గల గాలి వేగంగాపైకి లేవడం వలన బలమైన నిలువు గాలి ప్రవాహాలు (ఆఫ్ డ్రాఫ్టు) ఏర్పడి ఎత్తు పెరిగినా, దిశ మారినా మీసోసైక్లోన్ లాగ ఏర్పడి వాతావరణ అస్థిరత వలన సుడిగుండంలా వేగంగా గాలి పీడనంలోని తేడా వలన ముందుకు కదులుతూ, ఆ మార్గంలో ఉన్న చెట్లను, ఇళ్లను కబలించి తీవ్ర నష్టాన్ని కలుగ జేస్తుంది. ఫలితంగా సుమారు లక్షా యాభై వేల ఎత్తైన చెట్లు ఏటూరునాగారం అభయారణ్యంలో నేలకొరిగాయి. స్వార్థ ప్రయోజనాల కోసం అనాలోచితంగా చెట్లను నరకడం, మట్టిని తవ్వి నెల గుల్ల చేయడం, గుట్టలను తవ్వి నామరూపాలు లేకుండా చేయడం, వీటన్నింటికి ముఖ్యకారణం. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుతారి సతీష్, అనిల్ కుమార్, జానకి రాముడు, వర్ష, ఇందు, సందీప్, సాయికుమార్ పాల్గొన్నారు.

## ఆరోగ్య కార్యక్రమాల అమలులో సూపర్ వైజర్లు కీలకం

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య




**ప్రజాపక్షం/హనుమకొండటౌన్:** సీజనల్ వ్యాధుల నియంత్రణ, ఆరోగ్య కార్యక్రమాల అమలులో హెల్త్ సూపర్ వైజర్ల పర్యవేక్షణ మరింత మెరుగ్గా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ. అప్పయ్య అన్నారు. జిల్లాలోని పీహెచ్‌సీలలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, హెల్త్ ఎక్స్‌టెన్షన్ అధికారులు,పబ్లిక్ హెల్త్ నర్సులు, హెల్త్ సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్ లతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పిహెచ్‌సీల వారీగా సీజనల్ వ్యాధుల నియంత్రణ లో భాగంగా తీసుకుంటున్న చర్యలు, వైద్య శిబిరాలు, టీబీ, మాతా శిశు సంక్షేమం, అసంక్రమిత వ్యాధుల కార్యక్రమాల గురించి సమీక్షించారు.ఈ సందర్భంగా డీయంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ సూపర్వైజర్లు తమ పరిధిలో ఏఎన్‌యం లు, ఆశాల పనితీరును పర్యవేక్షిస్తూనే వారికి క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను, సమస్యలను పరిష్కరించడంలో వారికి సహాయం అందించాలని, ఎప్పటికప్పుడు ప్రోగ్రామ్‌ల వారీగా వారి నైపుణ్యాన్ని మెరుగుపరచడంలో, ఆన్ లైన్ రిపోర్టుల తయారీలో అవసరమైన సహాయం అందించాలని సూచించారు. ఇంటింటి సర్వేలో ఆరోగ్య సమస్యలను గుర్తించడంతో పాటుగా అవగాహన కలిగించాలన్నారు. మంగళవారం శుక్రవారం డ్రై డే నిర్వహిస్తూ ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. 30 సంవత్సరాలు పైబడిన వారిని అందరినీ స్క్రీనింగ్ పూర్తి చేయాలన్నారు. అలాగే గర్భాశయ క్యాన్సర్ నివారణకు హెచ్ పీవి వాక్సిన్ బాలికలకు తప్పకుండా ఇప్పించాలన్నారు. హెల్త్ అసిస్టెంట్‌లు మలేరియా, డెంగ్యు నియంత్రణ చర్యల్లో తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ మదన్మోహన్ రావు 2025–2026 లో మలేరియా కేసులు నమోదు కాలేదని, 2025లో 191 డెంగ్యు కేసులు నమోదు కాగా 2026లో 21 నమోదయ్యాయని తెలిపారు. ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రజిత మాట్లాడుతూ మాతాశిశు సంక్షేమ కార్యక్రమ సమ్మీక్షిస్తూ మొదటి 3 నెలల్లోనే 100 శాతం నమోదు చేయాలని, హై రిస్క్ గర్భిణి లను గుర్తించి ఫాలోఅప్ సేవలందించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవానికి ప్రోత్సహించాలన్నారు.డాక్టర్ ఏ శ్రీకృష్ణ రావు ఇమ్యునైజేషన్, డాక్టర్ ప్రదీప్ రెడ్డి టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని సమీక్షించారు. అడ్మినిస్ట్రేటివ్ అధికారి కోల రాజేష్, డెమో అశోక్ రెడ్డి,స్టాటిస్టికల్ అధికారి విజయలక్ష్మి సంబంధిత అంశాలను సమీక్షించారు.

## 4,5 తేదీలలో ఎఐటియుసి వరంగల్ జిల్లా మహాసభలు

సివిల్ సప్లై రాష్ట్ర అధ్యక్షుడు గూంపల్లి మునీశ్వరుడు




**ప్రజాపక్షం/నర్సంపేట :** ఈనెల 4, 5 తేదీలలో నెక్కొండ మండల కేంద్రం వాసవి కళ్యాణ మండపంలో నిర్వహించే ఏఐటియుసి వరంగల్ జిల్లా నాలుగో మహాసభలను జయప్రదం చేయాలని సివిల్ సప్లై హమాలి కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుంపల్లి మునీశ్వరుడు పిలుపునిచ్చారు. నర్సంపేటలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక హక్కుల కోసం అహర్నిశలు శ్రమిస్తున్నటువంటి ఏఐటీయూసీ నాలుగవ జిల్లా మహాసభలను హమాలి, ఆటో, భవన నిర్మాణ, ఆశ, అంగన్వాడి, మధ్యాహ్నం భోజనం స్కావెంజర్స్, గుమస్తాలు, ప్రతి ఒక్కరూ ఈ జిల్లా మహాసభలకు హాజరై కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమించేందుకు ప్రతి ఒక్కరూ తోడ్పాటునందియాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికుల కష్టాల్లో రెపరెపలాడే ఎర్రజెండా ఎఐటియుసి అని కార్మికుల చెమట చుక్కలను దోచుకుంటున్నటువంటి కార్పొరేట్ శక్తుల గుండెల్లో గడగడలాడించే గుణపమే ఏఐటీయూసి అని గుంపల్లి మునీశ్వరుడు అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అక్క పెల్లి రమేష్, ఇల్లందుల సాంబయ్య, ఎడ్ల నాగులు, ఓదెల కనకమల్లు, చీకటి నాగరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీల హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలి

తుడుం దెబ్బ ఆదివాసీ ఉద్యోగ సంఘాల పిలుపు



**ప్రజాపక్షం/గూడూరు:** ప్రపంచ ఆదివాసీల హక్కులు సంస్కృతి సంప్రదాయాలు అస్తిత్వ పరిరక్షణ కోసం పోరాట స్పూర్తిని చాటే రోజుగా ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించుకోవాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడం దెబ్బ ఆదివాసీ ఉద్యోగ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.గూడూరు కోత్తగూడ మండలంలోని ప్రతి ఆదివాసీ గూడెంలో దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించి ఆదివాసీల ఐక్యతను చాటాలని కోరారు.కోత్తగూడ మండల కేంద్రంలోని కోమురం భీం విగ్రహం వద్ద తుడుం దెబ్బ ఆదివాసీ ఉద్యోగ సంఘాల నాయకులు సమాదేశమై ప్రపంచ ఆదివాసీ దినోత్సవ నిర్వహణపై చర్చించారు.ఆగస్టు 9న తుడుం దెబ్బ ఆవిర్భావ దినోత్సవం ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రతి గూడెంలో నిర్వహించాలని నిర్ణయించారు.అనంతరం కొత్తగూడ మండల కేంద్రంలో నిర్వహించున్న భారీ ప్రపంచ ఆదివాసీ దినోత్సవకార్యక్రమానికి ఆదివాసీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈసందర్బంగా తుడుం దెబ్బ మండల అధ్యక్షలు పూనేం సందీప్ కుమార్ మాట్లాడుతూ ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం కేవలం వేడుకలకే పరిమితం కాకుండా ఆదివాసీల హక్కుల చట్టాలు అటవీ వనరులపై హక్కులు జల్ జంగల్ జమీన్ పరిరక్షణపై చైతన్యం కల్పించే రోజుగా జరుపుకోవాలని అన్నారు. ఆదిసీల సంస్కృతి సంప్రదాయాలు ఆచారాలు భాషను కాపాడుకోవడంతో పాటు భవిష్యత్ తరాలకు వాటిని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఉమ్మడి కొత్తగూడ మండంలోని ప్రతి ఆదివాసీ గూడెంలో ఆదివాసీ జెండాను ఎగురవేసి ఐక్యతను చాటాలని వారు కోరారు. ఈసమావేశంలో తుడుం దెబ్బ మండల ప్రధాన కార్యధర్శి మల్లెల సారయ్య ఆదివాసీ ఉద్యోగ సంఘాల నాయకలు చుంచ సారయ్య వట్టం సాయిలు ఏంపల్లి సమ్మయ్య పెనక లక్ష్మ య్య సువర్ణపాక సమ్మయ్య తదితరులు పాల్గోన్నారు.

## సమస్యలకు నిలయంగా జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

జిల్లా ఆసుపత్రిని రిఫరల్ సెంటర్‌గా మార్చారని మాజీ ఎమ్మెల్యే గండ్ర ఆగ్రహం

**ప్రజాపక్షం/భూపాలపల్లి:** జిల్లా ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించాల్సిన జిల్లా జనరల్ ఆసుపత్రి నేడు సమస్యల నిలయంగా మారిందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ, చిన్న సమస్య వచ్చినా ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇది జిల్లా జనరల్ ఆసుపత్రా లేక రిఫరల్ సెంటరా? అని ప్రశ్నించారు. ఆదివారం వస్తే పూర్తి స్థాయి వైద్య సేవలు అందుబాటులో ఉండవా? అత్యవసర పరిస్థితుల్లో వచ్చే పేద ప్రజలకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు.ఆసుపత్రిలో తాగునీటి సమస్య ఐదు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయిందని ,రోగులు బయట నుంచి బాటిళ్లలో నీరు తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టాయిలెట్లు అపరిశుభ్రంగా ఉన్నాయి. కొన్ని టాయిలెట్ గదులకు తాళాలు వేసి ఉన్నాయని ఆసుపత్రి ఆవరణ లోనే కండోమ్స్ దర్శనం ఇచ్చాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన ఎమ్మారై, స్కాన్ సెంటర్ నెల రోజులుగా పని చేయడం లేదని సంబంధిత డాక్టర్లు లేరని తెలిపారు. ఆక్సిజన్ ప్లాంట్ సమస్య, నిరుపయోగంగా పడివున్న ట్రాన్స్‌ఫార్మర్, వైద్యులునర్సింగ్ సిబ్బంది కొరత ఉందన్నారు. ఉన్న రోగం పోతుందని వస్తే, కొత్త రోగాలు వచ్చేలా ఆసుపత్రి తీరు ఉందఅని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి నెల రెండు సార్లు విజిట్ చేసేవారమని, మాజీ మంత్రులు హరీష్ రావు, ఈటెల రాజేందర్ నిత్యం సమీక్షలు నిర్వహించేవారని గుర్తు చేశారు. కరోనా సమయంలో ఈ ఆసుపత్రి ఎంతో మందికి ప్రాణాలు కాపాడిందని పేర్కొన్నారు. జిల్లా ఆసుపత్రి సమస్యలు తరచూ వెలుగులోకి వస్తున్నా *జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, స్థానిక ప్రజాప్రతినిధులు, మంత్రి శ్రీధర్ బాబు ఎవరూ స్పందించడం లేదని విమర్శించారు. ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జిల్లా ఆసుపత్రిని తనిఖీ చేసి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కటకం జనార్ధన్, నాయకులు మాడ హరీష్ రెడ్డి, దార పూలమ్మ, కొల్లజు దిలీప్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల వేడుకలు



**ప్రజాపక్షం/రఘునాథపాలెం:** ఆషాఢమాసం సందర్భంగా పెద్దమ్మతల్లికి బోనాల వేడుకలను మండల పరిధిలోని బూడిదంపాడు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం గ్రామంలోని ముదిరాజుల ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి ఆషాడమాస బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకుని గ్రామంలో ఊరేగింపుగా పెద్దమ్మ తల్లి ఆలయం వరకు వచ్చి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారి ఆశీస్సులతో వర్షాలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలని కోరుకున్నారు. బోనాల సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. డీజె డప్పు వాయిద్యాలు, నృత్యాలతో మహిళలు బోనమెత్తుకుని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కూరపాటి విజయకుమారి, ఆత్మ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, సొసైటీ మాజీ చైర్మన్ తుమ్మలపల్లి మోహన్‌రావు, మాజీ సర్పంచ్ మీరా సాహెబ్, ముదిరాజుల కులపెద్ద పోతనబోయిన బాబు, నాయకులు వెంకన్న, స్థానికులు, మహిళలు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్నస్వీపర్లకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వకుండా వేతనాన్ని వారి అకౌంట్లలో వేయకుండా వెట్టి చాకిరీ చేయించుకుంటున్నదని ఏఐటియుసి మహిళా శ్రామిక ఫోరం జిల్లా నాయకురాలు సీతామహాలక్ష్మి అన్నారు. మండలకేంద్రం కొణిజర్లలో ఆదివారం మండలంలో పనిచేస్తున్న స్వీపర్ల ముఖ్య కార్యకర్తల సమావేశంలో కప్పాల వెంకమ్మ అధ్యక్షతన జరిగిన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యాశాఖను చూస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి స్వీపర్ల పట్ల చిన్న చూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వీపర్లకు వచ్చే జీతంపైనే కుటుంబపోషణ ఆధారపడి ఉన్నదని తెలిపారు. తక్షణమే స్వీపర్లకు గుర్తింపు ఇచ్చి వారి జీతాన్ని వారి వ్యక్తిగత ఎకౌంట్లలో జమచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమలమ్మ,ఉమా, లింగమ్మ, నోకియా, రేణుకా తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా ఆషాఢం బోనాలు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 30వ వార్డులో గల శ్రీసాయి బృందావన్‌కాలనీలో ఆదివారం ఆషాఢం మైసమ్మ బోనాల మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకుని, శివసత్తుల విన్యాసాలు, డప్పు వాయిద్యాల నడుమ నిర్వహించిన భారీ ఊరేగింపు కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పింది. అనంతరం కాలనీ ప్రవేశద్వారం వద్ద వెలసిన మైసమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు బోనాలు సమర్పించారు. ఈ బోనాల వేడుకల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ సతీసమేతంగా ముఖ్య అతిథిగా పాల్గొని మైసమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సిపిఐ కౌన్సిలర్ దండి శ్రీలతోకేష్ బోనం ఎత్తుకొని మహిళలతో కలిసి ఊరేగింపులో పాల్గొని అమ్మవారికి బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు గుగులోతు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సాయికృష్ణ, గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు వెంకటరెడ్డి, శ్రీనివాసచారి, జంపాల కిరణ్, మహిళలు, యువకులు, చిన్నారులు, సిపిఐ నాయకులు, పాల్గొన్నారు.

## గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి: మేయర్ మూడ్ గణేష్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** ప్రభుత్వం అన్ని రకాల వసతులతో సమకూర్చిన గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల అభ్యర్థులు జీవితాల్లో స్థిరపడాలని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. ఆదివారం కొల్లి ఫౌండేషన్ వ్యవస్థాపకులు కల్వకొలను సహకారంతో జిల్లా కోఆర్డినేటర్ రుప్తా నాయక్ జిల్లా కేంద్ర గ్రంథాలయానికి రూ.7వేల విలువ చేసే పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందజేశారు. గ్రంథాలయ చైర్మన్ వీరబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మేయర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ విద్యార్థులభవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని గ్రంథాలయానికి పుస్తకాలను అందజేసిన కొల్లి ఫౌండేషన్ సభ్యులకు అభినందనలు తెలిపారు. జీవితాలను మలుపు తిప్పేది చదువే అని, అలాంటి చదువును నిర్లక్ష్యం చేయకుండా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకురాలు సదేపల్లి లలితకుమారి జి మణిమద్దల విద్యార్థినీవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ద్వారకానగర్‌లో ఘనంగా బోనాలు

**ప్రజాపక్షం/వైరా:** వైరా పట్టణంలోని ద్వారకానగర్ శ్రీకృష్ణపోల పోచమ్మ తల్లి దేవాలయంలో ఆదివారం బోనాల జాతర వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బోర్ల గంగారావు అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వైరా పట్టణంలోని మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బోనాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. భక్తుల జైజై ధ్వానాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ ఆషాడ మాసంలో పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించడం శుభప్రదమని, వైరా నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

# నాటుడే... సంరక్షణేది...?

• నాడు హరితహారం....నేడు వన మహోత్సవం • అపహాస్యం అవుతున్న మొక్కల పెంపకం • కోట్లాది రూపాయలు వృధా

**ప్రజాపక్షం/ఖమ్మం:** వర్షాకాలం ప్రారంభం కాగానే ప్రభుత్వ హడావుడి మొదలవుతుంది. ప్రతి యేటా జూన్, జులై మాసాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారు. ఇందు కొరకు జిల్లాల వారీగా లక్ష్యాలను ఇచ్చి మొక్కలు నాటించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయిస్తుంది. గత ప్రభుత్వం హరితహారం పథకం ద్వారా మొక్కలు నాటిస్తే ప్రస్తుత ప్రభుత్వం వన మహోత్సవాల పేరిట మొక్కలు నాటిస్తుంది. కానీ ఈ మొక్కలు నాటే కార్యక్రమం అపహాస్యం పాలవుతుంది. గత ప్రభుత్వంలో హరితహారం ద్వారా ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ లెక్కల ప్రకారమే 10 నుంచి 14.34 కోట్ల మొక్కలు నాటినట్లు సమాచారం. ఈ ప్రభుత్వం కూడా వన మహోత్సవాల పేరిట ఈ ఏడాది 31.30 లక్షల మొక్కలు నాటాలని అధికారులకు లక్ష్యాన్ని విధించింది. మొక్కలు నాటే క్రమంలోనే అపశృతి మొదలవుతుంది. మొక్కలు వచ్చాయి కాబట్టి ఎక్కడో ఒక చోట నాటించే పని కొందరు చేస్తుండగా మరి కొందరి నిర్లక్ష్యం కారణంగా వేలాదిమొక్కలు నర్సరీలోనే ఎండిపోతున్నాయి. ప్రభుత్వం ఒక్కో మొక్కను మొక్కల రకాలు, వయస్సును బట్టి ధర నిర్ణయించి కొనుగోలు చేస్తుంది. మొక్కలు నాటేందుకు, వాటి సంరక్షణకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తుంది. మంత్రులు, ఉన్నతాధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు వచ్చిన సమయంలో హడావుడిగా మొక్కలు నాటడం వాటి గురించి పట్టించుకోకపోవడంతో ఈ మొక్కలు నాటే కార్యక్రమం అపహాస్యం అవుతుంది. ప్రభుత్వ లెక్కల ప్రకారమే గత ప్రభుత్వంలో



14కోట్ల మొక్కలు నాటి ఉంటే అవి ఎదిగి మానులుగా తయారైతే పచ్చదనం ఎంతగా విస్తరించేదో ఆలోచించుకోవచ్చు. అధికారులు, గ్రామ పంచాయతీలు, వివిధ ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు, అటవీ అధికారులకు మొక్కలు నాటడం, వాటి సంరక్షణ బాధ్యతలను అప్పగిస్తున్నారు. వాటి సంరక్షణకు రోజు నీళ్లు పోసేందుకు కూడా నిధులు ఇస్తున్న సమయంలో మొక్కల సంరక్షణ వాటి లోపంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అవగతం కావడం లేదు. ఇది ఒక తంతుగా మారుతుంది. నర్సరీలకు తీసుకు వచ్చే మొక్కలు కొన్ని నర్సరీలలోనే పాడవుతున్నాయి. కొన్ని నాటేందుకు తీసుకెళ్లి పాడేస్తున్నారు. నాటిన మొక్కలను పట్టించుకోకుండా పాడేస్తున్నారు. ప్రధాన రహదారుల వెంట ప్రతి యేటా వన మహోత్సవాలను లేదా హరితహారం కార్యక్రమాలను నిర్వహించడం చేస్తుంటారు. నిరుడు నాటిన మొక్కలు ఏమయ్యాయని ఏ అధికారి ఏ ప్రజాప్రతినిధి ప్రశ్నించడు. ఉదాహరణకు వైరా మండలం తాటిపుడి ప్రాథమికోన్నత పాఠశాలలో అది హరితహారమైనా వన మహోత్సవమైనా ఇక్కడే కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు సైతం పాల్గొంటారు. గతంలో మంత్రులు సైతం పాల్గొన్నారు. మనకు అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ఇప్పటి వరకు ఆ పాఠశాలలో కొన్ని వేల మొక్కలు నాటారు. కానీ ఇప్పుడు ఆ పాఠశాలలో చెట్లు లేవు, మొక్కలు లేవు. ఈ కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా అక్కడే నిర్వహిస్తారేమో తెలియదు మరీ. ఇది కేవలం ఒక ఉదాహరణ మాత్రమే. ప్రభుత్వ కార్యాలయాలు, రహదారులు, కొన్ని అటవీ ప్రాంతాల్లో సైతం ఈవిధంగానే జరుగుతుంది. నిర్దేశిత లక్ష్యాలు ఇచ్చి మొక్కలు నాటిన తర్వాత వదిలివేయకుండా నాటిన ప్రతి మొక్కను సంరక్షించేవిధంగా అధికారులు తగు చర్యలు తీసుకోవాలి. మొక్కలు నాటే కార్యక్రమం కొందరికి వ్యాపారంగా మారింది, మరి కొందరికి ఆదాయ వనరుగా ఉంది. ఇప్పటికైనా మొక్కలు నాటేందుకు కాకుండా వాటి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తే పచ్చదనంతో పాటు కోట్లాది రూపాయలు వృధా కాకుండా ఉంటాయి. త ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడినవారమవుతాం. ఆవిధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఎంబిఎలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/ఖమ్మంఎడ్యుకేషన్:** మాస్టర్‌ఆఫ్ బిజినెస్ మెనేజ్‌మెంట్ అండ్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబిఎ) కోర్సులో ప్రవేశాలకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక కాకతీయ యూనివర్శిటీ పిజి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి గోపి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 202627 విద్యాసంవత్సరానికి గాను నిర్వహించిన ఐసెట్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు అగస్టు ఒకటవ తేదీ నుంచి కౌన్సిలింగ్ ప్రారంభంమైందని 3వ తేదీ సోమవారం నుంచి ప్రారంభం కానున్న వెబ్‌ఆప్షన్‌లో తమ కళాశాల కోడ్ 'కెయూకెహెచ్ ఎస్‌ఎఫ్'ను తొలి ప్రాధాన్యతగా ఎంచుకుని సీటు పొందాలని అర్హులైన విద్యార్థులకు సూచించారు. వివరాలకు సెల్ నంబర్లు 94406 52571, 99122 63863ను సంప్రదించాలని పేర్కొన్నారు.

## పేదలకు దుస్తులు పంపిణీ

**ప్రజాపక్షం/మధిర:** సహాయం చేయాలి అని మనసు ఉంటే చాలు ఏదోరకంగా ఎదుటి వ్యక్తికి ఉపయోగపడదాం అంటారు ప్రముఖ సంఘ సేవలకులు లంకా కొండయ్య. సామాజిక సేవలో భాగంగా మధిర టౌన్ చుట్టుప్రక్కల గ్రామాల నుండి వచ్చిన నిరుపేద వృద్ధులకు దుస్తులు పంపిణీ, మానసికంగా సరిగా లేని వారికి భోజనం మంచి నీళ్లు, బట్టలు లంకా కొండయ్య చేతుల మీదుగా అందజేసి మానవత్వం చాటుకున్నారు. ధాతలు ఇచ్చిన దుస్తులు నిరుపేదలకు అందిస్తున్న విషయం మధిర ప్రాంతం ప్రజలకు తెలుసు.

## కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడండి

• ధరల పెరుగుదలను అరికట్టాలి
• సెప్టెంబర్ 1న, చలో ఢిల్లీని విజయవంతం చేయాలి
• సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం



**ప్రజాపక్షం/పాల్వంచ:** కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్రమోడి నేతృత్వంలోని బిజేపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయం చంద్రా రాజేశ్వరరావు భవన్‌లో సిపిఐ మండల కౌన్సిల్ సభ్యులు, ప్రజా సంఘాల బాధ్యుల సమావేశం కోటి తిరుపతయ్య అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా విశ్వనాథం మాట్లాడుతూ సీతారామ, సీతమ్మధార ప్రాజెక్టుల నుండి మండల రైతాంగానికి సాగునీరందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలను అరికట్టాలన్నారు. ప్రాజెక్టులకు భూములిచ్చిన నిర్వాసితులకు నష్ట పరిహారం చెల్లించకుండా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నదని మండిపడ్డారు. ఏండ్లు గడుస్తున్నా పోడు రైతులకు పట్టాలు మంజూరు చేయకుండా కాలయాపన చేయడం తగదన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలాలతో పాటుగా ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. పాల్వంచలో మరో రెండు 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు విద్యుత్ ప్లాంట్లను తక్షణమే చేపట్టాలని, ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, స్కీం వర్కర్ల జీవితాలతో ఆటలాడకుండా ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలను అమలయ్యేలా చూడాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను నిర్లక్ష్యం వహించకుండా భర్తీ చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, జిల్లా కౌన్సిల్, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంజినీరింగ్ విద్యార్థులను కించపరిచేలా సిఎం వ్యాఖ్యలు..

ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్‌ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులతో వంశీ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి మొన్న జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఇంజనీరింగ్ విద్యార్థులపై చేసిన వ్యాఖ్యలను అఖిలభారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్‌ఎఫ్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి తీవ్రంగా ఖండిస్తుంది అన్నారు. దేశ రాష్ట్ర నిర్మాణంలో అత్యంత కీలక పాత్ర చేస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థులకు కించపరిచేలా సీఎం మాట్లాడడం అత్యంత బాధాకరమైన విషయం అన్నారు. ఒకవైపు వేదికలపై మాట్లాడేటప్పుడు జెన్ జీ యువతకు గౌరవం ఇవ్వాలి వారి శక్తి సామర్థ్యాలను ఉపయోగించుకోవాలని చెబుతూనే కావున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే తన వ్యాఖ్యాలను ఉపసంహరించుకొని వారికి మెరుగైన విద్య ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం రేవంత్ రెడ్డి కృషి చేయాలని వంశీ ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

-ఆత్మహత్యయత్నానికి పాల్పడిన యువకుడిని పరామర్శించిన మాజీ మంత్రి పువ్వాడ, ఎంఎల్‌సి తాత, మాజీ ఎంపి నామ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి తదితర హామీలను అమలు చేయకుండా నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో మనస్తాపానికి గురై ఆత్మహత్య యత్నానికి పాల్పడి ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గడ్డం వేణును ఆదివారం మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంఎల్‌సి తాతా మధుసూదన్, మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు లు పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి వేణు ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనో ధైర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. ఇందుకు ఉదాహరణే వేణు ఆత్మహత్య ప్రయత్నమన్నారు. వేణు ఆత్మహత్య యత్నానికి ముందు ఓ లేఖ రాశారన్నారు. గత కొద్ది సంవత్సరాలుగా వేణు గ్రూప్స్‌కు సిద్ధమవుతున్నారని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక గ్రూప్ నోటిఫికేషన్ కూడా విడుదల చేయకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడని తెలిపారు. వేణు తల్లి మానసిక వికలాంగురాలని, తండ్రి గీత కార్మికుడని యంయస్సి చదివిన వేణు ఉద్యోగం లేక మనో వేదనకు గురయ్యాడన్నారు. వేణు కుటుంబానికి సొంత ఇల్లు కూడా లేదన్నారు. నిరుద్యోగ యువకులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని వారు ఆరోపించారు. ఉద్యోగాల నోటిఫికేషన్, నిరుద్యోగ భృతి వంటి హామీలను విస్మరించిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ గుండాల కృష్ణ, నాయకులు ఉప్పల వెంకటరమణ, బచ్చు విజయ్ కుమార్, పగడాల నాగరాజు, వీరు నాయక్, బత్తుల మురళీ, సామినేని హరిప్రసాద్, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

# సామినేని హత్య కేసులో కదలిక

• కుటుంబ సభ్యులు సహా 32 మందికి నోటీసులు • తెల్దారుపల్లికి చెందిన నలుగురికి
• నేటి నుంచి విచారణ- హాజరుకానున్న ఫోరెన్సిక్ నిపుణుల బృందం

**ప్రజాపక్షం/ఖమ్మం:** సిపిఎం రాష్ట్ర నాయకుడు, మాజీ సర్పంచ్ సామినేని రామారావు హత్య కేసులో మళ్లీ కదలిక మొదలైంది. గతేడాది అక్టోబర్ 31న ఉదయం ఐదు గంటల సమయంలో చింతకాని మండలం పాతర్లపాడు గ్రామంలో సామినేని రామారావు తన ఇంటి వద్దనే దారుణ హత్యకు గురయ్యాడు. ఆయనను కత్తులతో పొడిచి హత్య చేశారు. సంఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయిన రామారావు హత్యకు సంబంధించి కుటుంబ సభ్యులు గ్రామానికి చెందిన కొందరు కాంగ్రెస్ నాయకుల పై ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి నేటి వరకు రామారావును హత్య చేసిన హంతకులు ఎవరో పోలీసులు తేల్చలేదు. దీనికి సంబంధించి సిపిఎం వివిధ రూపాలలో పలు ఆందోళనలు నిర్వహించింది. ముఖ్యమంత్రిని కలిసి దోషులు ఎవరో తేల్చాలని కోరింది. దాదాపు తొమ్మిది మాసాలు గడిచిన తర్వాత ఈ హత్య కేసులో మరల కదలిక ప్రారంభమైంది. దాదాపు 32 మందికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఇందులో రామారావు సతీమణి స్వరాజ్యంతో పాటు కుమారునికి, కుమార్తె, అల్లునితో పాటు కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం నాయకులకు నోటీసులు జారీ చేశారు. వీరంతా ఈ నెల మూడు నుంచి ఖమ్మం సిటిసి పోలీ స్ స్టేషన్ వద్ద హాజరు కావాలని నోటీసు ల్లో పేర్కొన్నారు. హత్య కేసు సందర్భం లో సిపిఎం నాయకులు నిందితులుగా ఆరోపిస్తూ ఫిర్యాదు చేసిన బొర్రా ప్రసాద్, కంచుమర్తి రామకృష్ణ, మద్దినేని నాగేశ్వరరావు, కాండ్ర పిచ్చయ్య, కొత్తపల్లి వెంకటేశ్వర్లకు నోటీసులు జారీ చేశారు. ఇందులో కొంత మందికి గతంలో బెంగళూరులో వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. అప్పట్లో కొందరు ఈ పరీక్షకు వెళ్లేందుకు నిరాకరించారు.

**సామినేని కుటుంబ సభ్యులకు నోటీసు :** సామినేని రామారావు హత్య కేసుకు సంబంధించి పోలీసులు ఆయన కుటుంబ సభ్యులకు పదే పదే నోటీసులు ఇవ్వడాన్ని సిపిఎం నిరసిస్తుంది. ఏ విచారణకైనా సిద్ధమని చెప్పినా పోలీసులు తగు రీతిలో స్పందించడం లేదని నోటీసుల పేరుతో బదనాం చేస్తున్నారన్న ఆరోపణ సిపిఎం నుంచి వినవస్తుంది. ఈ క్రమంలోనే సామినేని కుటుంబ సభ్యులు నలుగురితో పాటు ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లిలో హత్యకు గురికాబడ్డ తమ్మినేని కృష్ణయ్య హత్య కేసులోని నలుగురు ముద్దాయిలకు కూడా నోటీసులు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతుంది. ఈ విచారణకు గుజరాత్‌లోని నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ (ఎన్‌ఎఫ్‌ఎస్‌యు)కు చెందిన తొమ్మిది మంది నిపుణుల బృందం నోటీసులు విచారించనుంది.

# 'పోలవరం' ఎవరికి వరం?

భద్రాచలం భవిష్యత్తు ప్రశ్నార్థకమేనా?




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గోదావరిపై నిర్మితమవుతున్న దేశంలోనే అతిపెద్ద బహుళ ప్రయోజన జాతీయ ప్రాజెక్టుల్లో ఒకటైన పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు సాగునీరు, తాగు నీరు, విద్యుత్ ఉత్పత్తి పరంగా కీలకం. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలకు మాత్రం ఇది ఆందోళనకు కారణమవుతోంది. ముఖ్యంగా గోదావరి తీరం వెంబడి ఉన్న భద్రాచలం రెవెన్యూ డివిజన్ ప్రజలు పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై ఎన్నో సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి జలాశయ మట్టం (FRL) 45.72 మీటర్ల (150 అడుగులు) వద్ద రూపొందించబడింది. అధికారిక పునరావాస అంచనాల ప్రకారం 222 రెవెన్యూ గ్రామాలు, 373 నివాస ప్రాంతాలు, సుమారు 1.06 లక్షల కుటుంబాలు ప్రభావితమతాయని అంచనా. వీరిలో 56 వేలకుపైగా గిరిజన కుటుంబాలు ఉండటం ఈ ప్రాజెక్టు సామాజిక ప్రభావాన్ని స్పష్టం చేస్తోంది. భద్రాచలానికి గోదావరి వరదలు కొత్తేమీ కాదు. 1953 వరదల నుండి మొదలుకుని 1986,1991 వంటి భయానక వరదలు ఇక్కడ వచ్చాయి. ఆతర్వాత 2022లో వచ్చిన గోదావరి వరద 71 అడుగులకు పైగా చేరి గత శతాబ్దంలోనే అత్యంత తీవ్రమైన వరదల్లో ఒకటిగా నిలిచింది. వందలాది గ్రామాలు నీట మునిగాయి. వేలాది కుటుంబాలు పునరావాస కేంద్రాలకు తరలించారు. ప్రభుత్వం కార్యాలయాలు, విద్యాసంస్థలు, రహదారులు, విద్యుత్ వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇక మారుమూల గిరిజన గ్రామాల పరిస్థితి అత్యంత దయనీంగా మారింది. అయితే 'పోలవరం పూర్తయితే భద్రాచలం పూర్తిగా మునిగిపోతుంది' అనే నిర్ధారణను అధికారిక నివేదికలు శాస్త్రీయంగా స్పష్టతను ఇవ్వడం లేదు. వాస్తవాలను ప్రభుత్వాలు దాచిపెడుతున్నాయనే అనుమానాలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. కానీ వరదల సమయంలో బ్యాక్‌బాటర్ ప్రభావం, ఉపనదుల్లో నీటి నిల్వ, డ్రైనేజ్ సమస్యలు పెరిగే అవకాశంపై తెలంగాణ ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు, నిపుణులు పలుమార్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై తాజా హైడ్రాలజీ అధ్యయానాలు, శాస్త్రీయ విశ్లేషణలు పూర్తి కావాల్సి ఉంది. ఇదిలా ఉండగా ఈ ఏడాది జూలై నెల 9వ తేదిన నదీ జలాల ఇంజనీరింగ్ నిపుణులు భద్రాచలంలో పర్యటించారు. ఈ సందర్భంగా రామాలయం సమీపంలోని విస్తా కాంప్లెక్స్, కొత్తకాలనీ వద్ద ఉన్న స్లూయిస్‌లను పరిశీలించి వాటిపరిస్థత భద్రతపై ఆరా తీశారు. ప్రాజెక్టు పూర్తయినప్పటికీ గేట్లు తెరిచే ఉంటాయని నీరు దిగువకు విడుదలై వెళ్లిపోతుందని వారు సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడదల చేసినా సహజ సిద్ధంగా ప్రవాహం క్రిందికి వెళ్లే దానికి ప్రాజెక్టు నుండి దిగువకు విడుదలయ్యే దానికి చాలా తేడా ఉంటుంది.ఇలాంటి సమయాల్లో బ్యాక్ వాటర్ ప్రభావం తప్పదని, దీనిని బట్టి చూస్తే భద్రాచలం ప్రాంత మనుగడ ప్రశ్నార్థకంగా మారడం ఖాయమని పలువురు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం పలు మార్లు కేంద్రం దృష్టికి బ్యాక్‌వాటర్, డ్రైనేజ్ సమస్యలను తీసుకెళ్లినా, భద్రాచలం కోసం శాశ్వత వరద రక్షణ గోడలు, సమగ్ర రక్షణ ప్రణాళిక, ప్రభావిత గ్రామాల తాజా జాబితా, పరిశ్రమల భద్రతపై స్పష్టమైన కార్యాచరణ ఇంకా ప్రజల ముందుకు రాలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఆంధ్రప్రదేశ్‌కు బహుళ ప్రయోజనాలు చేకూర్చే ఈ పోలవరం జాతీయ ప్రాజెక్టు ఆ రాష్ట్రానికి వరం అని, తెలంగాణ రాష్ట్రంలోని గోదావరిపరివాహన ప్రాంత ప్రజలకు మాత్రం ముమ్మాటికీ శాపమే అనే వాదనం బలంగా వినిపిస్తోంది.

## సిపిఐ ప్రజా చైతన్య యాత్రలు



సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి

**ప్రజాపక్షం/మణుగూరు:** 6వ తేదీ నుండి ప్రారంభం అయ్యే సిపిఐ ప్రజా చైతన్య యాత్రలను జయప్రదం చేయాలని, దీని కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఐ పార్టీ కార్యాలయం లో సిపిఐ మణుగూరు పట్టణ కార్యవర్గ సభ్యులు సమావేశం జరిగింది. ఈసమావేశం కు ఎస్‌కె సర్వర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా సరెడ్డి పుల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ కే ంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు, పెరుగుతున్న ధరలు, నిరుద్యో గం, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ,రైతు, కార్మిక సమస్యలు ,వి ్య_ వైద్య రంగాల సంక్షోభం ,మహిళల భద్రత, దళితులపై ఆదివాసులపై జరుగుతున్న దాడులు, రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న ప్రజా సమస్యలు, ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని లౌకిక విలువలను కాపాడు కునేందుకు, ప్ర జల హక్కులను సాధించేందుకు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈనె ల 6వ తేదీ నుండి 12వ తేదీ వరకు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో జాతీయ పార్టీ పిలుపు మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం బ య్యారం నుండి ప్రజా చైతన్య యాత్ర ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని. ఈ సమావేశంలో మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి, మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్ రా వు, ఎడారి రమేష్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, మండల సహాయ కార్యదర్శి వేర్పుల నరేష్, పట్టణ సహాయ కార్యదర్శిలు తోట రమేష్, చింతల దశరథం, కార్యవర్గ పాల్గొన్నారు. అనంతర ం ప్రజా చైతన్య యాత్ర ల వాల్ పోస్టర్‌ను నాయకులు విడుదల చేశారు.

## అఖిల వైద్య విద్యకు హరీష్ రావు అభయం



**ప్రజాపక్షం/సిద్దిపేట :** ఆపదలో ఆదుకునే ఆపద్బాంధవుడు..అన్నలా ఆత్మీయత నిచ్చే నాయకుడు..అభివృద్ధికి నిలువుటద్దం..కష్టం వచ్చిందంటే నేనున్నానని భరోసానిచ్చే నేత..సిద్దిపేట కుటుంబ సభ్యుడిగా నిత్యం ప్రజల కష్టాలు,భాధలు తీర్చే ప్రజా నాయకుడు హరీష్ రావు తన కుతానే నిదర్శనంగా ఎన్నోసార్లు నిరూపించుకున్నారు.నేడు మరోమారు తన మానవత్వాన్ని చాటుకున్నారు.చదువులో సర్వస్వం కాని కుటుంబానికి లక్ష్మీ దేవి అడ్డు అన్నట్లుగా ఆందోళనలో ఉన్న పేద కుటుంబానికి చెందిన అఖిల వైద్య విద్యకు హరీష్ రావు అభయం ఇచ్చారు.నువ్వు డాక్టర్ అయ్యేంత వరకు నా భాధ్యతనే సీటు సాధించు విద్యకు అయ్యే ఖర్చు నేను భరిస్తా నిన్ను చదివించే భాధ్యత నాదంటూ భరోసా ఇచ్చి తన మానవత్వాన్ని చాటుకున్నారు.

## దొంగ అరెస్టు... సొత్తు స్వాధీనం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** తాళం వేసి ఉన్న ఇంటిలో దొంగతనం చేసిన దొంగను సిసి ఫుటేజ్ ఆధారంగా కేసును చేదించి దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు పెద్దపల్లి ఎసిపి కృష్ణ తెలిపారు. ఆదివారం రోజున దొంగను అరెస్ట్ చేసిన అనంతరం ఎసిపి నరేష్ మాట్లాడుతూ మే 27న హనుమాన్ నగర్ లోనిరాయిని అర్జున్ పని నిమిత్తం ఇంటికి తాళం వేసి సుల్తానాబాద్ కి వెళ్లి సాయంత్రం తిరిగి గార్ గుర్తుతే ఇంటి తాళం పగలగొట్టబడి ఇంటిలోని గల బీరువాలో నుండి 5 గ్రాముల ఒకజత బంగారు చెవి కమ్మలు,10 గ్రాముల రెండు బంగారు ఉంగరాలు,ఒక జత వెండి కాళ్ళ పట్టీలను దొంగిలించు కొని వెళ్లినారని మే 30న ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన అనంతరం ఆదివారం రోజున ఫ్లూమ్ నగర్ లో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడైన మిర్యాల రంజిత్ రెడ్డిని అరెస్ట్ చేసి దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకొని రిమాండ్ చేసినట్లు తెలిపారు.కాగా నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న కానిస్టేబుళ్లు ప్రభాకర్, సతీష్ లను ఎసిపి అభినందించారు.

## సమరకేతన్‌కు ఎఐటియుసి నాయకుల నివాళి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సిపిఎం నాయకులు కామ్రేడ్ యాకయ్య కుమారుడు సమరకేతన్ అనారోగ్యంతో బాధపడుతూ నిన్న హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.గోదావరిఖని లో యాకయ్య ఇంటి వద్ద సమరకేతన్ పార్థివ దేహం పై గుర్తింపు సంఘం ఎఐటియుసి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమరకేతన్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ,వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.నివాళులు అర్పించిన వారిలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి కామ్రేడ్ కవ్వంపల్లి స్వామి,బ్రాంచి కార్యదర్శి కామ్రేడ్ రంగు శ్రీను, కోశాధికారి కామ్రేడ్ ఎస్ వెంకట్ రెడ్డి,ఆఫీస్ కార్యదర్శి కామ్రేడ్ తొడుపునూరి రమేష్, కుమార్ లు ఉన్నారు.

## ప్రధాన రహదారిపై ప్రమాదకర గుంత



**ప్రజాపక్షం/బెజ్జంకి :** మండల పరిధిలోని ముత్తన్నపేట స్టేజ్ వద్ద ప్రధాన రహదారి పై గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారి ప్రమాదాలు సంభవించిన పట్టించుకునే నాథుడే లేడని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ అవసరాలకు వెళ్లాలంటే ప్రజలు నిత్యం ఇదే రహదారి వెంట ప్రయాణం కొనసాగించాలని అందుకు ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెళ్ళవలసి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రమాదాలు సంభవించి ప్రజలకు తీవ్రనష్టం వాటిల్లిన అధికారులు మాత్రం పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చి ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## 4న యాదవ సంఘాల సంయుక్త సమావేశం

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లోని యాదవ చారిటబుల్ ట్రస్ట్ కేంద్ర కార్యాలయంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు అఖిల భారత యాదవ మహాసభ మరియు యాదవ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో అత్యవసర ముఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘాల అధ్యక్షులు మేకల మల్లేశం యాదవ్,మారం తిరుపతి యాదవ్ తెలిపారు.యాదవభవిష్యత్ తరాల విద్యార్థుల సౌలభ్యం కోసం చేపట్టబోయే ఈ బృహత్కర నిర్మాణ యాత్రకు తగిన కార్యాచరణను రూపొందించేందుకు ఈ సమావేశం కీలకం కానుందని వారు పేర్కొన్నారు.ఈ సమావేశంలో యాత్ర నిర్వహణ,స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక తయారీ, నిధుల సమీకరణకు అనుసరించాల్సిన సులభతర విధానాలు,జిల్లాలోని మండలాలు, గ్రామాల వారీగా నాయకులకు బాధ్యతల కేటాయింపు,విస్తృత ప్రచార కార్యక్రమాలు,సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేయడం తదితర ముఖ్యాంశాలపై సమగ్రంగా చర్చించి తుది నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న యాదవ సంఘాల నాయకులు,అఖిల భారత యాదవ మహాసభ పదాధికారులు,యాదవ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు,యువజన,మహిళా నాయకులు,ప్రజాప్రతినిధులు, మేధావులు,యాదవ సమాజ ప్రముఖులందరూ ఈ సమావేశానికి పెద్ద సంఖ్యలో హాజరై,తమ విలువైన సూచనలు,సలహాలు అందించి విద్యార్థి వసతి గృహ నిర్మాణ నిధుల సమీకరణ యాత్రను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యాదవ చారిటబుల్ ట్రస్ట్ వర్కింగ్ ప్రెసిడెంట్ సందనవేణి రాజేందర్ యాదవ్,గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం అధ్యక్షులు సలేంద్ర రాములు యాదవ్,అఖిల భారత యాదవ మహాసభ యువజన విభాగం అధ్యక్షుడు అట్ల సాగర్ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై
# సిపిఐ ప్రచార యాత్ర

### సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్



**ప్రజాపక్షం/చిగురుమామిడి :** సోషల్ మీడియా ద్వారా అబద్దపు ప్రచారాలు చేసి ప్రజలను నమ్మించి కేంద్రంలో బిజేపి ప్రభుత్వం గద్దెనెక్కిందని రానున్న రోజుల్లో అదే సోషల్ మీడియా ద్వారా ప్రజలు వాస్తవాలను గమనించి బిజెపిని గద్దె దించక తప్పదని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం చిగురుమామిడిలోని ముస్కు రాజిరెడ్డి స్మారకభవన్‌లో సిపిఐ చిగురుమామిడి మండల కౌన్సిల్ సమావేశం సహాయ కార్యదర్శి బూడిద సదాశివ అధ్యక్షతన జరిగింది. కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ సిపిఐ జాతీయ సమితి పిలుపుమేరకు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజేపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను గ్రామ గ్రామాన ప్రజలకు వివరించడానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రచార యాత్రలు, పాదయాత్రలు ఈనెల 6 నుంచి 14 వరకు నిర్వహించబడుతున్నాయని జిల్లావ్యాప్తంగా జరిగే ప్రచార యాత్రను విజయవంతం చేయడం కోసం సిపిఐ కార్యకర్తలు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బిజేపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందని ప్రైవేట్ రంగానికి ఆస్తులు దారాదత్తం చేస్తుందని, దేశ అభివృద్ధి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు, ప్రజలకు కావాల్సిన కనీస మౌళిక సదుపాయాలు, సంక్షేమ పథకాలు, దేశానికి సుపరిపాలన అందిస్తామని ఎన్నికలకు ముందు వాగ్దానం చేసిన బిజెపి ఒక్కటి కూడా అమలు చేయలేదని ఆరోపించారు. సామాన్య ప్రజల నడ్డి విరిచేలా నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజీల్, వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెంచుతుందని మండిపడ్డారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆశచూపి వారి ఓట్లు కొల్లగొట్టారని అవన్నీ అబద్ధపు ప్రచారాలని ఇప్పుడిప్పుడే యువత తెలుసుకుంటుందన్నారు. వారి భవిష్యత్ కోసం మార్పు కోరుకుంటున్నారని రానున్న రోజుల్లో సోషల్ మీడియా వేదికగా బిజేపికి గుణపాఠం తప్పదని శ్రీనివాస్ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, మహిళా రిజర్వేషన్‌ను తక్షణమే అమలు చేయాలని, ధరల పెరుగుదలను నియంత్రించాలని, ప్రతి నిరుద్యోగికి ఉద్యోగ అవకాశం కల్పించాలని, కార్మిక హక్కులను, చట్టాలను పరిరక్షించాలని, దళిత, ఆదివాసీలపై దాడులను నిలిపివేయాలని, బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలు పునరుద్ధరించడంతోపాటు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలనే ప్రధాన డిమాండ్లతో సిపిఐ ప్రచార యాత్ర నిర్వహిస్తుందన్నారు. సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి మాట్లాడుతూ మండలంలో ఈనెల 8, 9 తేదీలలో సిపిఐ ప్రచార యాత్ర జరుగుతుందని దానిని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్తపై ఉందన్నారు. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని విస్మరించి ప్రజలను మోసం చేస్తున్నాయని అన్నారు. అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు, సాగునీరు, వ్యవసాయ కూలీలకు తగిన పని, కార్మికులకు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా కాలయాపన చేయడంతో పాటు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని మండిపడ్డారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యురాలు గూడెం లక్ష్మి, జిల్లా కౌన్సిల్ సభ్యులు చాడ శ్రీధర్ రెడ్డి, అందె చిన్న స్వామి, బోయిన వల్లభాయ్ పటేల్, మావురపు రాజు, మండల సహాయ కార్యదర్శి బూడిద సదాశివ, సీతారాంపూర్ మాజీ సర్పంచ్ గోలి బాపురెడ్డి, మండల కౌన్సిల్ సభ్యులు ఎం.డి.ఉస్మాన్ పాషా, ఎలగందుల రాజు, మంద ఎల్లయ్య, కాత మల్లయ్య, అనవోజు జనార్ధన్, తమ్మిశెట్టి రవీందర్, విలాసాగరం అంజయ్య, కయ్యం వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం నుండి నిధులు రాబట్టేందుకు యత్నం

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/కరీంనగర్:** అభివృద్ధిలో కరీంనగర్ కార్పొరేషన్‌ను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలబెట్టాలన్న దానిపైనే దృష్టిని కేంద్రీకరించినట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. అందులో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్రం నుండి పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. కరీంనగర్ లోని 24వ డివిజన్ లోని ఆదివారం బ్యాంక్ కాలనీలో రూ.50 లక్షల విలువైన యుఐడిఎఫ్ నిధులతో చేపట్టిన సిసి రోడ్డు, డ్రెయిన్ పనులకు కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ ఒంటెల సత్యనారాయణరెడ్డితో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు. అక్కడి నుండి కిసాన్ నగర్ వెళ్లిన బండి సంజయ్ పోచమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. బోనాలంటేనే భక్తి, వీరత్వానికి ప్రతీక. బోనాలంటే కేవలం ఒక జాతర కాదని, తెలంగాణ సంస్కృతికి జీవం, భక్తి–శక్తి–సంప్రదాయాల కలయిక.. లక్షలాది భక్తుల విశ్వాసానికి ప్రతీక.. ప్రతి ఏటా ఆషాఢ మాసంలో జరిగే ఈ ఉత్సవాలు కరీంనగర్ ను ఆధ్యాత్మిక సాగరంలో ముంచెత్తుతాయని పేర్కొన్నారు.

## 'బిల్డ్ ఎక్స్‌పో-2026' విజయవంతం

### ఆధునిక నిర్మాణ సాంకేతికతకు విశేష స్పందన



**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్:** కరీంనగర్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన 6వ బిల్డ్ ఎక్స్‌పో2026 విజయవంతంగా ముగిసిందని అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ ఇండియా (ఎసిసిఇఐ) కరీంనగర్ సెంటర్ ప్రతినిధులు తెలిపారు. ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ ప్రదర్శనకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు వరంగల్, మంచిర్యాల, సిద్ధిపేట, మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచి సివిల్ ఇంజనీర్లు, ఆర్కిటెక్లు, బిల్డర్లు, కాంట్రాక్టర్లు, విద్యార్థులు, గృహ నిర్మాణదారులు, సామాన్య ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై ఆధునిక నిర్మాణ ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎసిసిఇఐ ప్రదినిధులు, ఎసిసిఇఐ కరీంనగర్ సెంటర్ చైర్మన్ నల్ల లక్ష్మయ్య, సెక్రటరీ సబ్బని శ్రీనివాస్, ట్రెజరర్ వేణుమాధవ్, కన్వీర్ పాత పవనక్రిష్ణ, కోఆర్డిఏటర్ జి.వెంకటకిషన్‌లు మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో వస్తున్న నూతన సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక ఉత్పత్తులను ఒకే వేదికపై ప్రజలకు పరిచయం చేయాలనే లక్ష్యంతో ఈ ఎక్స్‌పోను నిర్వహించినట్లు తెలిపారు. ఫౌండేషన్ నుంచి ఇంటీరియర్ వరకు అవసరమైన స్టీల్, సిమెంట్, పెయింట్స్, హార్డ్వేర్, ప్లైవుడ్, లామినేట్స్, లిఫ్టు, వాటర్ ప్రూఫింగ్ కెమికల్స్, ఎలక్ట్రికల్, శానిటరీ ఉత్పత్తులు, యుపివిసి విండోస్, పీటీ స్లాబ్ టెక్నాలజీ వంటి అనేక ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. రెండు రోజులపాటు జరిగన ఎక్స్‌పోకు విశేష స్పందన లభించిందని పాల్గొన్న సంస్థలు, సందర్శకులు, స్పాన్సర్లు, సహకరించిన ప్రతి ఒక్కరికీ ఎసిసిఇఐ కరీంనగర్ సెంటర్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. సభ్యులు గొల్లపల్లి వెంకట్, అనిల్, ప్రశాంత్, పెద్ది ప్రమోద్, ఫణి, అసోసియేషన్ ప్రతినిధులు, బిల్డర్లు పాల్గొన్నారు.

## రోడ్డుపై ప్రమాదకర బుంగ

### అధికారులు వెంటనే స్పందించాలి



**ప్రజా పక్షం/ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రం నుంచి 63వ జాతీయ రహదారికి వెళ్లే ప్రధాన రహదారిపై మిచ్చమ్మ ఆశ్రమం సమీపంలో ప్రమాదకర బుంగ ఏర్పడింది. తోటల నీటి ప్రవాహం కోసం రోడ్డు కింద వేసిన భారీ సిమెంట్ పైపు పైన రోడ్డు కుంగిపోవడంతో భారీ బుంగ ఏర్పడి ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి.ఈ మార్గంలో ప్రతిరోజూ ఆర్టీసీ బస్సులు,భారీ వాహనాలు,కార్లు,ద్విచక్ర వాహనాలతో పాటు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. బుంగ చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కల కారణంగా రాత్రి వేళల్లో అది స్పష్టంగా కనిపించక ప్రమాదాలకు అవకాశం ఉంది.పెద్ద ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు వెంటనే బుంగను మరమ్మతు చేసి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ప్రజా పక్షం రిపోర్టర్ సంబంధిత ఆర్ అండ్ బి ఏ ఈ మహమ్మద్ ఫైజాన్‌ను ఫోను ద్వారా సంప్రదించగా గత సంవత్సరం ప్రజా పక్షం దినపత్రిక దీనిపై వార్త ప్రచురించగా ఆ పేపర్ కటింగ్ క్లిప్పును తీసుకొని ఫైల్ చేసి ప్రపోజల్ కు అధికారులకు పంపడం జరిగిందని, త్వరలోనే ప్రపోజల్ వస్తుందని,వచ్చిన తర్వాత నూతన కల్వర్టు నిర్మాణం చేపడతామని ఆర్ అండ్ బి ఏఈ మహమ్మద్ ఫైజాన్ వివరణ ఇచ్చారు.

## అన్యాయాన్ని నివారించకుంటే ఆందోళనకు సిద్ధం

### మాల సంఘాల జెఎసి నేతల ఆగ్రహం



**ప్రజాపక్షం/గజ్వేల్:** ఎస్‌సివర్గీకరణ, రోస్టర్ పాయింట్లలో మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం నివారించాలని మాల సంఘాల జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం గజ్వేల్ లో మాల సంఘాల జేఏసీ వైస్ చైర్మన్ తుమ్మ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించగా, మాల సంఘాల జెఎసిచైర్మన్ మందాల భాస్కర్, గౌరవ చైర్మన్ చెరుకు రాంచంద్రం, వైస్ చైర్మన్ తుమ్మ శ్రీనివాస్, వైస్ చైర్మన్ సేపూరి ప్రణయ్, గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ బేర బాలకిషన్, మాల స్టూడెంట్ జెఏసి చైర్మన్ మాదాసు రాహుల్ రావు, వైస్ చైర్మన్ పండగ భానుతేజ, ఒయు అంసా అధ్యక్షులు నామ సైదులు పాల్గొని మాట్లాడారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణ పేరుతో మాలల గొంతు కోసిందని విమర్శించారు. వర్గీకరణ పేరుతో మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని ఆపి, మాలలకు కేటాయింపులను 8 శాతం పెంచాలని డిమాండ్ చేశారు. రోస్టర్ పాయింట్లలో మార్పులు చేసి, మొదటి 20 పాయింట్లలో కనీసం రెండు పాయింట్లను మాలలకే కేటాయించాలని, మాల సామాజిక వర్గం ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం ప్రత్యేకంగా మాల కార్పొరేషన్ ఏర్పాటు చేసి హైదరాబాద్‌లో మాల భవన్ నిర్మించాలని, మాల విద్యార్థుల పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని, రెండు ఏండ్లుగా 15 నోటిఫికేషన్లలో మాలల వాటా సున్నా అని, విద్య, ఉద్యోగ రంగాల్లో మాలల భవిష్యత్తును ప్రభుత్వం అంధకారంలోకి నెట్టిందని ఆరోపించారు. మాలల పేరుతో గెలిచి, పదవులు అనుభవిస్తూ జాతికి జరుగుతున్న అన్యాయంపై నోరు మెదపని ప్రజాప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించకపోతే, వారిని సామాజికంగా బహిష్కరించడమే కాకుండా, వారి క్యాంపు కార్యాలయాలు, ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ నడిబొడ్డున 10 వేల మంది విద్యార్థులు, నిరుద్యోగులతో భారీ కవాతు నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి వారి ఆందోళనకు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో గాలెంక నర్సింలు, బండారు దేవేందర్, చిప్పల యాదగిరి, నీరుడి స్వామి, బైరం శివకుమార్, మన్నే కృపానందం, కప్పభాస్కర్, పుట్ట రాజు, గాజులపల్లి ప్రేమ్, కాసమోల్ల శ్రీనివాస్, శ్రీనివాస్, దేవి నర్సింలు, శివలింగం, రాజు, చందు, నానం గిరి, స్వామి, మల్లేశం, యాదగిరి, రమేష్, ఎడ్ల బాబు, బండి నరేష్, సొక్కం శ్రీనివాస్, సంబగ యాదగిరి, కప్ప యాదగిరి, చిప్పల యాదగిరి, చిప్పల మల్లేశం, పోస్ట్ మెన్ మల్లెశం, మంతుర్తి స్వామి, పరశురాములు, సొక్కం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నరకప్రాయంగా అడవి శ్రీరాంపూర్ రోడ్లు

### బురదగుంటలతో పొంచి ఉన్న రోగాల ముప్పు!



**ప్రజాపక్షం/ముత్తారం :** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామ రోడ్లు పూర్తిగా బురదమయంగా మారాయి.గ్రామంలోని పలు వీధులు కుంటలను తలపిస్తూ, ప్రమాదకరమైన బురదగుంటలుగా దర్శనమిస్తున్నాయి. నిలిచిన నీటితో దోమలు,కీటకాలు విపరీతంగా పెరిగిపోతుండటంతో ఎక్కడ సీజనల్ వ్యాధులు ప్రబలి ప్రాణాల మీదకు వస్తుందోనని గ్రామ ప్రజలు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.అధికారుల తీరును చూస్తుంటే మాకు ఈ బురద కష్టాలు తప్పవా? అంటూ స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్లపైనడవాలన్నా నరకమే..రోడ్లపై భారీగా బురద పేరుకుపోవడంతో గ్రామస్తులు కనీసం నడిచేందుకు కూడా వీలు లేకుండా పోయింది. పాఠశాలలకు వెళ్లే చిన్న పిల్లలు,వృద్ధులు నిత్యం ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. అత్యవసర సమయాల్లో వాహనాలు వెళ్లే పరిస్థితి కూడా లేదు.పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులుఈ తీవ్రమైన సమస్యపై అనేకమార్లు స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా ఫలితం శూన్యమని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనాగ్రామంలో హెల్త్ ఎమర్జెన్సీ రాకముందే సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని అడవి శ్రీరాంపూర్ గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. వెంటనే రోడ్లపై ఉన్న బురదగుంటలను పూడ్చి వేసి,బ్లీచింగ్ పౌడర్ చల్లించి,దోమల నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.తమకు సీజనల్ వ్యాధులు రాకుండా కాపాడి,గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని రక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## 5లోపు మండల కమిటీలు

### ఆగస్టు 15లోపు గ్రామ కమిటీలు పూర్తి
### డిసిసి అధ్యక్షురాలు తూముకుంట ఆంక్ష రెడ్డి



**ప్రజాపక్షం/కొమురవెల్లి:** కొమురవెల్లి మండల కేంద్రంలో ఆదివారం రోజు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశంలో కొమురవెల్లి, చేర్యాల, చేర్యాల టౌన్, దూల్మిట్ట, మద్దూరు మండలాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, సిద్ధిపేట జిల్లా ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్ధిపేట జిల్లా డిసిసిఅధ్యక్షురాలు తూమ్ముంట ఆంక్ష రెడ్డి మాట్లాడుతూ, పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడానికి ప్రతి నాయకుడు, కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఆగస్టు 5వ తేదీలోపు మండల కమిటీలను, అలాగే ఆగస్టు 15వ తేదీలోపు గ్రామ కమిటీలను పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా, పార్టీ కోసం నిజాయితీగా, కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకే సంస్థాగతంగా ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. కార్యదర్శి స్థాయిలో ఉన్న నాయకుడు సమర్థవంతంగా పనిచేస్తే ఆయనకు వైస్ ప్రెసిడెంట్‌గా పదోన్నతి కల్పిస్తామని, అలాగే వైస్ ప్రెసిడెంట్ హోదాలో ఉన్న వారు పార్టీ కోసం ఆశించిన స్థాయిలో పనిచేయకపోతే వారిని తిరిగి కార్యదర్శి పదవికి డిమోషన్ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. పార్టీ పదవులు కేవలం హోదాల కోసం కాకుండా బాధ్యతగా భావించి పనిచేయాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని, ప్రజలకు వాటిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను విస్తృతంగా ప్రజల్లో ప్రచారం చేయాలనినాయకులకు దిశానిర్దేశం చేశారు. కొమురవెల్లి, చేర్యాల, చేర్యాల టౌన్, దూల్మిట్ట, మద్దూరు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సిద్ధిపేట జిల్లా ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## కదిలిన యంత్రాంగం... రోడ్డు సమస్యకు తెర

### నూతన సిసి రోడ్డుకు అధికారుల హామీ

ప్రజాపక్షం
ఎఫెక్ట్

**ప్రజాపక్షం/ముత్తారం :** ప్రజాపక్షం దినపత్రికలో వచ్చిన వరుస కథనాలకు అధికారులు,గ్రామ సర్పంచ్ చోప్పరి సంపత్ తక్షణమే స్పందించారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పారుపల్లి గ్రామ ప్రధాన పాత సీసీ రోడ్డు బురదమయంగా మారి, గ్రామస్థులు పడుతున్న తీవ్ర ఇబ్బందులపై పత్రికలో ప్రచురితమైన ప్రత్యేక కథనం యంత్రాంగంలో కదలిక తెచ్చింది. అధికారులు క్షేత్రస్థాయికి చేరుకుని తక్షణ నివారణ చర్యలు చేపట్టారు.

**ప్రజాపక్షం పత్రికా కథనాల ఎఫెక్ట్ :** సుమారు 20 ఏళ్ల క్రితం వేసిన ఈ సీసీ రోడ్డు పూర్తిగా గుంతలమయమై, వర్షపు నీరు నిలిచి నరకంగా మారిన పరిస్థితిని ప్రజాపక్షం పత్రిక ఎండగట్టింది. దీనికి తోడు రోడ్డు మరమ్మతుల పేరుతో గుంతల్లో మట్టి పోయించడంతో,అది కాస్తా బురదగా మారి ప్రజలు అడుగు తీసి అడుగు వేయలేని స్థితికి చేరిన విషయాన్ని వెలుగులోకి తెచ్చింది. తాత్కాలికంగా కంకర చిప్స్ వేయాల్సింది పోయి మట్టి పోయడంపై గ్రామస్థుల నుంచి వ్యక్తమైన తీవ్ర నిరసనను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో యంత్రాంగం దిగి వచ్చింది.క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన..పత్రికలో వచ్చిన వార్తలకు స్పందించిన పంచాయతీ రాజ్, స్థానిక మండల అధికారులు, సర్పంచ్ తక్షణమే బురదమయంగా మారిన సీసీ రోడ్డును సందర్శించి పరిశీలించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా రోడ్డుపై పేరుకుపోయిన బురదను,తొలగించి కంకర చిప్స్ పోయించారు.

**కొత్త రోడ్డు నిర్మాణానికి హామీ..:** గ్రామస్థుల డిమాండ్ మేరకు కేవలం తాత్కాలిక పనులతో సరిపెట్టకుండా,ఈ దెబ్బతిన్న పాత రోడ్డు స్థానంలో సరికొత్త సీసీ రోడ్డు నిర్మాణానికి తగిన నిధులు మంజూరు చేస్తామని అధికారులు ప్రకటించారు.త్వరలోనే నూతన రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. తమ సమస్యపై స్పందించి వార్తలు రాసిన ప్రజాపక్షం పత్రికకు, తక్షణమే స్పందించిన అధికారులకు,సర్పంచ్ కి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## లోటు వర్షపాతంతో పెరిగిన

# 'పెట్రో' విక్రయాలు




**న్యూఢిల్లీ :** భారత్‌లో నెలకొన్న ఎల్‌నినో ప్రభావంతో జులై మాసంలో లోటు వర్షా పాతం నమోదైంది. ఈ నేపథ్యంలో రైతులు, వాహనదారుల నుంచి ఇంధన డిమాండ్ విపరీతంగా పెరిగింది. భారతదేశంలోని మూడు ప్రభుత్వ రంగ ఇంధన రిటైలర్ల పెట్రోల్, డీజిల్ అమ్మకాలు జులైలో గణనీయంగా పెరిగాయని ప్రాథమిక పరిశ్రమ అమ్మకాల గణాంకాలు వెల్లడించాయి. గత ఏడాది ఇదే కాలంలోని 3.14 మిలియన్ టన్నులతో పోలిస్తే, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసి), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పిసిఎల్)ల పెట్రోల్ అమ్మకాలు జులైలో 9.7 శాతం పెరిగి 3.45 మిలియన్ టన్నులకు చేరుకున్నాయి. ఈ పరిమాణం, జులై 2024లో అమ్ముడైన 2.99 మిలియన్ టన్నుల కంటే 15.1 శాతం, 2023లో ఇదే కాలంలో నమోదైన స్థాయి కంటే 36.1 శాతం అధికంగా ఉంది. అయితే, జూన్‌తో పోలిస్తే, పెట్రోల్ అమ్మకాలు 3.48 మిలియన్ టన్నుల నుండి 1.1 శాతం తగ్గాయి. భారతదేశ ఆర్థిక కార్యకలాపాలకు కీలక సూచిక అయిన డీజిల్ అమ్మకాలు, గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 10.7 శాతం పెరిగి జులైలో 7.12 మిలియన్ టన్నులకు చేరుకున్నాయి. భారతదేశంలో సరుకు రవాణా, వ్యవసాయ యంత్రాలు, నీటిపారుదల కోసం డీజిల్‌ను అత్యంత విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవ్వడం వల్ల, విత్తనాలు నాటే కీలక సమయంలో నీటిపారుదలకు డిమాండ్‌ను పెంచింది. జులైలో అమ్ముడైన పరిమాణం, 2024లోని ఇదే కాలంతో పోలిస్తే 11.5 శాతం, జులై 2023 వినియోగం కంటే 12.7 శాతం అధికంగా ఉంది. నెలవారీగా చూస్తే, జూన్‌లోని 7.85 మిలియన్ టన్నులతో పోలిస్తే డీజిల్ అమ్మకాలు 9.2 శాతం తగ్గాయి. సాధారణంగా రుతుపవనాల రాకతో ఇంధన అమ్మకాలు తగ్గుతాయి. దీనివల్ల వ్యవసాయ నీటిపారుదల పంపులను నడపాల్సిన అవసరం తగ్గడంతో పాటు వాహనాల రాకపోకలు కూడా నెమ్మదిస్తాయి. కానీ ఈ ఏడాది రుతుపవన వర్షాలు ఆలస్యంగా రావడంతో, రైతులు తమ పొలాలకు నీరందించడానికి పంపులను నడపడానికి డీజిల్‌ను ఉపయోగించాల్సి వచ్చింది. నెలవారీగా చూస్తే, జులైలో అమ్మకాలు తక్కువగా ఉంటాయి, ఎందుకంటే పాఠశాల, కళాశాల సెలవుల కారణంగా జూన్‌లో విహారయాత్రలు పెరుగుతాయి. జులైలో జెట్ ఇంధనం (ఎటిఎఫ్) అమ్మకాలు 2.9 శాతం పెరిగి 6,59,900 టన్నులకు చేరుకున్నాయి; ఈ పరిమాణం జులై 2024 నాటి వినియోగం (6,41,300 టన్నులు) కంటే 2.3 శాతం, జూలై 2023 నాటి వినియోగం (5,66,600 టన్నులు) కంటే 16.5 శాతం ఎక్కువ. నెలవారీ ప్రాతిపదికన చూస్తే, జూన్ నెలలోని 6,91,700 టన్నుల వినియోగంతో పోలిస్తే ఇది 4.6 శాతం తగ్గింది. లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పిజి) అమ్మకాలు తగ్గుముఖం పట్టడం కొనసాగింది, ఇవి 17.4 శాతం తగ్గి 2.37 మిలియన్ టన్నులకు పడిపోయాయి. పశ్చిమ ఆసియా సంక్షోభం కారణంగా కొంత వినియోగం పైప్డ్ నేచురల్ గ్యాస్ (పిఎన్‌జి) వైపు మళ్లడమే దీనికి ప్రధాన కారణమని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

# కుల్గాం దాడి తీవ్రవాదుల వివరాలు వెల్లడించండి..

### కేంద్రానికి ఫరూక్ అబ్దుల్లా డిమాండ్




**శ్రీనగర్ :** రెండు రోజులక్రితం జమ్ముకశ్మీర్‌లోని కుల్గాంతోపాటు అనంత్‌నాగ్‌లో ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో దాడికి పాల్పడిన తీవ్రవాదుల వివరాల్ని వెల్లడించాలని, వారి గుర్తింపును బహిరంగపరచాలని నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా డిమాండ్ చేశారు. ఇన్ని భద్రతా చర్యలు తీసుకుంటున్నా అసలు తీవ్రవాదులు ఎక్కడినుంచి వస్తున్నారు అంటూ ఫరూక్ ప్రశ్నించారు. తాజా ఘటనల నేపథ్యంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వంపై విమర్శలు చేశారు. రెండు రోజుల క్రితం కుల్గాంలో ఉగ్రవాదులు దాడి చేసి, ఇద్దరు వలస కార్మికుల్ని కాల్చి చంపారు.అలాగే, అనంత్‌నాగ్‌లో కూడా ఒక పోలీసు అధికారికి కాల్చి వేశారు. ఈ నేపథ్యంలో మరోసారి జమ్ముకశ్మీర్‌లో ఉగ్రదాడి జరగడంతో ఆందోళన నెలకొంది. దీనిపై ఫరూక్ మాట్లాడారు. ''ఈ హత్యలు ఎవరు చేస్తున్నారో ప్రభుత్వం ప్రజలకు వెల్లడించాలి. వాళ్లను ఉగ్రవాదులు చంపారని మాత్రమే చెప్పారు. సరిహద్దులు మూసి ఉన్నా సరే అసలు తీవ్రవాదులు దేశంలోకి ఎలా ప్రవేశిస్తున్నారు అనేదే అసలైన ప్రశ్న. కశ్మీర్ లోయలో ఉగ్రవాదం అంతమైందని చెప్పిన లెఫ్టినెంట్ గవర్నర్ వ్యాఖ్యలు తప్పని చూపించడానికి హంతకుల నిజస్వరూపాల్ని బయటపెట్టడం అవసరం. మనమే కాదు.. ప్రపంచం అంతా ఉగ్రవాదుల్ని చూడాలి. తీవ్రవాదం అంతమైందా..? పరిస్థితులు ఎలా మారాయో చూడండి'' అంటూ ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. మరోవైపు 2019లో కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేసి జమ్ముకశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక హోదాను తొలగించిన సంగతి తెలిసిందే. రాష్ట్ర హోదాను తొలగించి, కేంద్ర పాలిత ప్రాంతంగా విభజించింది. జమ్ముకశ్మీర్‌తోపాటు, లదాక్ అనే రెండు కేంద్ర పాలిత ప్రాంతాలను ఏర్పాటు చేసింది. దీనిపై కూడా ఫరూక్ అబ్దుల్లా అభ్యంతరం వ్యక్తం చేశారు. జమ్ముకశ్మీర్‌కు కేంద్రం రాష్ట్ర హోదాను తిరిగి పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, పాక్ ఆక్రమిత జమ్ముకశ్మీర్ (పిఒక)లో జరుగుతున్న మారణహోమాన్ని కూడా ఫరూక్ వ్యతిరేకించారు. పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అక్కడ ఆందోళన చేపట్టిన వారిపై పాక్ ప్రభుత్వం కాల్పులు జరపడంతో గత వారం 50 మందికిపైగా మరణించారు. దీనిపై ఫరూక్ మాట్లాడుతూ.. ''పిఒకెలో ఉన్నది మన సోదరులే. వాళ్లు ఎదుర్కొంటున్న పరిస్థితుల్ని చూస్తే బాధ కలుగుతుంది. ఐక్యరాజ్యసమితికి మానవ హక్కుల సంఘం ఉంది. వారు ఒక బృందాన్ని పంపి అక్కడ ఏం జరుగుతుందో చూడాలి. ఈ విషయంలో ప్రపంచం అంతా మౌనంగా ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. మన దేశం కూడా దీని గురించి ఏమీ చెప్పడం లేదు'' అంటూ ఫరూక్ వ్యాఖ్యానించారు.

## భవిష్యత్ కార్యాచరణపై 5న సిజెపి చర్చ



**ఛత్రపతి సంభాజీనగర్ :** 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) కీలక సభ్యులు తమ భవిష్యత్తు కార్యాచరణపై చర్చించేందుకు 5న మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో సమావేశం కానున్నారని ఆ సంస్థ వర్గాలు ఆదివారం తెలిపాయి.
ఈ సమావేశం సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే నివాసంలో జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గత నెలలో నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై నెల రోజుల పాటు సాగిన ఆందోళనల తర్వాత సిజెపి కార్యకర్తలు, వలంటీర్లు తమ కుటుంబాలతో కొంత సమయం గడపాలని సూచించినట్లు సమాచారం. అలాగే, వలంటీర్లు, విద్యార్థులతో మాట్లాడి, వారి అభిప్రాయాలు, సూచనలతో సమావేశానికి రావాలని సిజెపి కీలక సభ్యులకు చెప్పినట్లు ఆ వర్గాలు తెలిపాయి. ఈనెల 5న జరిగే సమావేశం తర్వాత ఆ సంస్థ విలేకరుల సమావేశాన్ని నిర్వహించి, భవిష్యత్తు కార్యాచరణకు సంబంధించిన నిర్ణయాలను ప్రకటించనుందని సమాచారం. ఇదిలావుండగా, దీప్కే తన నివాసంలో విద్యార్థులు, స్థానికులు, పొరుగు జిల్లాల నుండి వచ్చిన సందర్శకులను కలిశారు, అలాగే పిల్లలతో కలిసి 'ఫ్రెండ్‌షిప్ డే' (స్నేహితుల దినోత్సవం) జరుపుకున్నారు. నీట్ పేపర్ లీక్ కుంభకోణంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సిజెపి నేతృత్వంలో జరిగిన నిరసనలకు దేశవ్యాప్తంగా ఉన్న జెన్ జీ నుండి విశేష స్పందన లభించింది; దీని ఫలితంగా గత వారం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది.

# కేరళలో జనజీవనం అస్తవ్యస్తం

- వర్షం సంబంధిత ఘటనలకు 8 మంది మృతి, మరో 8 మంది గల్లంతు , 13 మందికి గాయాలు
- 27 ఇళ్లు పూర్తిగా ధ్వంసం 209 సహాయక శిబిరాలకు 5,792 మంది తరలింపు : సిఎం సతీశన్ వెల్లడి



**తిరువనంతపురం :** కేరళలో అనేక ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడటం, నీరు నిలిచిపోవడం, ఆస్తి నష్టం వంటి ఘటనలు సంభవించాయి. ఈ ఘటనల్లో ఎనిమిది మంది మరణించారని, మరో ఎనిమిది మంది గల్లంతయ్యారని, 13 మంది గాయపడ్డారని కేరళ ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ ఆదివారం తెలిపారు. తన కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో, 27 ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని, 196 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 209 సహాయక శిబిరాలకు 5,792 మందిని తరలించామని సతీశన్ పేర్కొన్నారు. మరణించిన వారి కుటుంబాలకు, అలాగే తమ ఇళ్లు, జీవనోపాధిని కోల్పోయిన వారికి ప్రభుత్వం తప్పక సహాయం అందిస్తుందని ఆయన తెలిపారు. గత రోజుతో పోలిస్తే వర్షం తగ్గుముఖం పట్టినప్పటికీ, ప్రజలు, ముఖ్యంగా కొండ ప్రాంతాల్లో నివసించేవారు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద కార్యకర్తలు సహాయక చర్యల్లో చురుకుగా పాల్గొంటున్నారని ఆయన చెప్పారు. వర్ష సంబంధిత సహాయక చర్యలకు సంబంధించి రెవెన్యూ మంత్రి ఎ.పి. అనిల్ కుమార్, వివిధ జిల్లాలకు కేటాయించిన ఇతర మంత్రులు, స్థానిక యంత్రాంగంతో తాను నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు సతీశన్ తెలిపారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వర్షం తగ్గడం ఊరటనిచ్చే అంశమని, వరదలు లేదా నీరు నిలిచిన ప్రాంతాల్లో శుభ్రత పనులు ప్రారంభమయ్యాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇక్కడ విలేకరులతో మాట్లాడిన అనిల్ కుమార్, రాష్ట్రంలో భారీ వర్షాల వల్ల విస్తృత నష్టం, నీటి నిల్వ సమస్యలు తలెత్తినప్పటికీ, ప్రస్తుతం పరిస్థితి మెరుగుపడుతోందని, అదుపులో ఉందని తెలిపారు. అనేక చోట్ల దెబ్బతిన్న రోడ్లను ప్రయాణానికి అనుకూలంగా పునరుద్ధరించామని, అయితే కొన్ని ప్రాంతాల్లో వాహనాల రాకపోకలపై ఇంకా ఆంక్షలు ఉన్నాయని మంత్రి చెప్పారు. భారీ వర్షాల దృష్ట్యా అనేక జిల్లాల్లో ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశామని, వాటిని ఎదుర్కోవడానికి తగిన ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు. కేరళ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ (కెఎస్‌డిఎంఎ) ప్రకారం, శనివారం రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో 320 మి.మీ వరకు వర్షపాతం నమోదైంది, దీనివల్ల రోడ్లు, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. కన్నూర్ జిల్లాలోని అయ్యన్‌కున్ను ప్రాంతంలో అత్యధికంగా 320 మి.మీ వర్షపాతం నమోదైందని, అదే సమయంలో ఉత్తర మలబార్ ప్రాంతంలోని అనేక ఇతర ప్రాంతాల్లో శనివారం తెల్లవారుజామున 3 గంటల నుండి అర్ధరాత్రి వరకు 90 మి.మీ నుండి 180 మి.మీ మధ్య వర్షం కురిసిందని సమాచారం. ఈ వర్షాల కారణంగా రాష్ట్రంలోని అనేక లోతట్టు, నదీ తీర ప్రాంతాలు నీట మునిగాయి. ముఖ్యంగా పతనంతిట్ట, ఇడుక్కి, వయనాడ్ కొట్టాయం, కోజిడ్, కన్నూర్ జిల్లాల్లోని ఇళ్లలోకి కూడా నీరు చేరినట్లు టీవీ ఛానెళ్లలో కనిపించిన దృశ్యాలు వెల్లడించాయి. భారత వాతావరణ శాఖ (ఐఎండి) కేరళలోని 12 జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్', తిరువనంతపురం, కొల్లం జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' జారీ చేసింది. గంటకు 60 కి.మీ వేగంతో బలమైన గాలులు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున, ఆది, సోమవారాల్లో కేరళ–కర్ణాటక–లక్షద్వీప్ తీర ప్రాంతాల్లో చేపల వేట కార్యకలాపాలు చేపట్టవద్దని ఐఎండి హెచ్చరించింది. ఉత్తర కేరళ తీరం వెంబడి 2.7 నుండి 3.5 మీటర్ల ఎత్తు వరకు భారీ అలలు వచ్చే అవకాశం ఉందని 'ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్' హెచ్చరించింది; అలాగే మత్స్యకారులు మరియు తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఆదివారం ఉదయానికి వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటికీ, రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో— ముఖ్యంగా పతనంతిట్ట జిల్లాలోని రాన్ని, అలప్పుజ జిల్లాలోని కుట్టనాడ్ ప్రాంతాల్లో— వరద నీరు ఇంకా తగ్గలేదు; దీంతో ప్రజలు చిన్న పడవల ద్వారా ప్రయాణించడం కనిపించింది.

# చందా చోరులందరూ బిజెపిలోనే..

- అయోధ్యలో రామమందిరం నిర్మాంచాలని బిజెపి ఎప్పుడూ భావించలేదు
- ఈ అంశాన్ని సజీవంగా ఉండాలనే చూసింది : కాంగ్రెస్ నేత తివారీ



**న్యూఢిల్లీ :** ఆయోధ్యలోని రామాలయంలో విరాళాల చోరీకి సంబంధించి బిజెపిపై కాంగ్రెస్ తీవ్రస్థాయి విమర్శలు గుప్పించింది. బిజెపిలో ఉన్నవారందరూ 'చందా దొంగలు' కాదని, కానీ 'చందా దొంగలందరూ' అధికార పార్టీలోనే ఉన్నారని పేర్కొంది. రామమందిరంలో జరిగిన 'చోరీ' కేవలం విరాళాలకు మాత్రమే పరిమితం కాలేదని, అది 'శిలా పూజ' సమయం నుండే మొదలైందని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ప్రమోద్ తివారీ ఆరోపించారు. 'నేను స్వయంగా అవధ్ ప్రాంతానికి చెందినవాడిని. 1985 నుండి 1990 వరకు యుపి ప్రభుత్వంలో పర్యాటక శాఖ మంత్రిగా పనిచేశాను. రామ జన్మభూమి ఉద్యమాన్ని చాలా దగ్గరుండి చూశాను' అని తివారీ ఆదివారం ఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో అన్నారు. బిజెపిలో ఉన్నవారందరూ చందా దొంగలు' అని అనడం లేదు, కానీ 'చందా దొంగలందరూ' బిజెపిలోనే ఉన్నారని ఆ కాంగ్రెస్ నాయకుడు అన్నారు. రామమందిర నిర్మాణం కోసం ఉద్యమం జరుగుతున్నప్పుడు, 'రామ్ లల్లా హమ్ ఆయేంగే; మందిర్ వహీం బనాయేంగే' (రామలల్లా, మేము వస్తాం; అక్కడే మందిరాన్ని నిర్మిస్తాం) అనేది నినాదంగా ఉండేది. ఆ తర్వాత, ఉత్తరప్రదేశ్‌లో బిజెపి ప్రభుత్వం ఏర్పడినప్పుడు, మందిరాన్ని ఎప్పుడు నిర్మిస్తారని అడిగాను. దానికి కేంద్రంలో కూడా బిజెపి అధికారంలోకి వచ్చినప్పుడు అని సమాధానం వచ్చింది' అని ఆయన చెప్పారు. కేంద్రంలో అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం ఏర్పడినప్పుడు, మళ్లీ అదే ప్రశ్న అడిగాను. అప్పుడు ప్రస్తుతానికి వేచి చూడండి అని సమాధానం వచ్చిందని, అసలు నిజం ఏమిటంటే అయోధ్యలో రామమందిరం నిర్మించాలని బిజెపి ఎప్పుడూ కోరుకోలేదు; కేవలం రామమందిర సమస్యను సజీవంగా ఉంచాలని మాత్రమే భావించిందని ఆరోపించారు. కేవలం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రామాలయం నిర్మించబడిందని తివారీ అన్నారు. రామమందిర నిర్మాణ సమయంలోనే లోక్‌సభ ఎన్నికలు జరిగాయని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మందిరం కంటే ఎన్నికలే ముఖ్యమయ్యాయని, అందుకే ఆయన అసంపూర్తిగా ఉన్న మందిరానికి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారని, ఇది అశుభకరమైన చర్య అని తివారీ పేర్కొన్నారు. ఆలయ ట్రస్ట్‌లోని ప్రతి సభ్యుడూ ఆయన వ్యక్తిగత ఎంపిక మేరకే నియమించబడ్డారని తివారీ ఆరోపించారు. దీనికి సంబంధించిన ఘనతను మోదీజీ తన ఖాతాలో వేసుకున్నప్పుడు, ఆయన ఎవరికైతే బాధ్యతలు అప్పగించారో వారు చేసిన పాపాల నుండి ఆయన ఎలా తప్పించుకోగలరని తివారీ ప్రశ్నించారు. చంపత్ రాయ్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సమయంలో విరాళాలు, కానుకల చోరీ ఒక వ్యవస్థీకృత విధానంగా మారిందని, తద్వారా కోట్ల రూపాయలు పక్కదారి పట్టాయని ఆయన ఆరోపించారు. నిందితులను గుర్తించామని, చోరీకి గురైన నిధుల వివరాలు తేలాయని, ఈ దోపిడీకి సంబంధించి తగినన్ని ఆధారాలు ఉన్నాయని తివారీ చెప్పారు. 'దేశంలోని 140 కోట్ల మంది ప్రజలకు సమాధానం చెప్పాల్సిందే. కానుకలు, విరాళాలకు సంబంధించిన ఈ అంశాన్ని ప్రజల ముందుకు తీసుకెళ్తాము, దోషులు శిక్షించబడే వరకు పోరాటం కొనసాగిస్తాము. సోమవారం నాడు సభలో ఈ విషయాన్ని మళ్లీ లేవనెత్తుతాము'అని రాజ్యసభలో కాంగ్రెస్ ఉప నాయకుడు అన్నారు.

## సముద్రంలో భారీ ఈదురుగాలులు..

### మునిగిపోయిన మత్స్యకారుల పడవ

**తూత్తుకూడి :** తమిళనాడులోని తూత్తుకూడి తీరంలో భారీ ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఈ గాలుల ధాటికి మత్స్యకారుల పడవ మునిగిపోయింది. అయితే ఈ ఘటనలో ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా బయటపడ్డారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సుగిర్థన్ అనే వ్యక్తి మరో ఆరుగురితో రెండ్రోజుల క్రితం చేపల వేటకు వెళ్లారు. ఆదివారం బలమైన గాలులు వీయడంతో వారి పడవ మునిగిపోయింది. ప్రమాదాన్ని ముందే గుర్తించిన మత్స్యకారులు సముద్రంలోకి దూకి సమీపంలోని ట్రావెలర్ పడవను గట్టిగా పట్టుకున్నారు. అదే సమయంలో చేపల వేటకు వచ్చిన మరో బోటు సిబ్బంది వారిని గమనించి తమ పడవలోకి ఎక్కించుకున్నారు. దాంతో మత్స్యకారులకు ప్రాణాపాయం తప్పింది.

# జంతర్ మంతర్‌లో పోలీసు క్రూరత్వంపై సిట్ దర్యాప్తు!

### నేడు సుప్రీంకోర్టు విచారణ



**న్యూఢిల్లీ:** కాక్రోచ్ జనతాపార్టీ (సిజెపి) నాయకత్వంలో జులై 20వ తేదీన జంతర్ మంతర్ వద్ద జరిపిన నిరసనలో వేలాది మంది ప్రదర్శకులపట్ల క్రూరంగా ప్రవర్తించిన పోలీసు చర్యలకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం (ఆగస్టు 3) విచారణ చేపడుతుంది. పరీక్షల్లో అవకతవకలు, నీట్ ప్రశ్నాపత్రాల లీక్‌ను ప్రశ్నించిన విద్యార్థిలోకం ఆన్‌లైన్ ద్వారా ఏకమై చేసిన చరిత్రాత్మక పోరాటం సందర్భంగా జరిగిన పోలీసు చర్యలు ప్రపంచం దృష్టిని ఆకర్షించడంతో ఈ కేసులో సుప్రీంకోర్టు విచారణ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్యబాగ్చి,వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ విచారణ చేపడుతుంది. నిరసన ప్రదర్శన సందర్భంగా విద్యార్థులే పోలీస్‌లపై దాడి చేశారా? కొందరు దుండగులు దాడులు చేశారా? అనే విషయంలో నిజాల నిగ్గు తేల్చేందుకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి సారథ్యంలో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ద్వారా నిష్పక్షపాత విచారణ జరిపించే అవకాశం ఉందని న్యాయస్థానం సూచనాప్రాయంగా తెలియజేసింది. ఈ కేసులో ఎలాంటి రహస్యాలకు తావు లేకుండా న్యాయబద్ధంగా స్వతంత్ర దర్యాప్తు జరిపే విషయంపై సుప్రీంకోర్టు తీవ్రంగా ఆలోచిస్తోంది.
పెల్లెట్‌గన్స్ బాధితులు, నిరసన ప్రదర్శకులు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లలో పోలీసు క్రూరత్వంపై ఫిర్యాదులు చేశారు. విద్యార్థులపై ఎలాంటి ఒత్తిడి చేయవద్దని,ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రదర్శకులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా సహనం పాటించాలని, అదేవిధంగా ఇంతకు ముందు ఎలాంటి నేర చరిత్రాలేని 18 ఏళ్ళ లోపు వయసుగల విద్యార్థులను విడుదల చేయాలని జులై 28న సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. నేర చరిత్రగల విద్యార్థులకు ఈ విధమైన రక్షణ చర్యలు అమలు చేయాల్సిన అవసరం లేదని కూడా స్పష్టం చేసింది. రాష్ట్రాలు ఎలాంటి చర్యలు తీసుకోకుండా అడ్డుపడింది. ఈ విషయంలో వచ్చిన అన్ని ఆరోపణలపై ఒక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి సమగ్రంగా, చాలా న్యాయబద్ధంగా, బాహాటపద్ధతులలో స్వతంత్ర విచారణ చేయాల్సిన అవసరం ఉందని ఆలోచిస్తున్నట్లు న్యాయస్థానం పేర్కొంది. పిలిషనర్లు చేసిన ఆరోపణలు,ప్రాథమికంగా వెల్లడైన విషయాలు చూస్తే ఈ హింసాత్మక ఘటనలపై నిష్పక్షపాతంగా,స్వతంత్ర దర్యాప్తు జరపాల్సిన అనివార్య అవసరం కనిపిస్తోందని, ఈ విచారణ ద్వారా పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలను, అదేవిధంగా భారత సొలిసిటర్ జనరల్ లేవనెత్తిన సమస్యలన్నిటినీ కూడా పరిష్కరిస్తుందని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ విషయంలో ఒక సమగ్ర ప్రత్యేక దర్యాప్తునకు ఆదేశించేముందుగా కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాలో ప్రభుత్వాల అభిప్రాయాలను కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఉందిగనుక వారికి అవకాశం,తగిన సమయం ఇస్తూ ఈ కేసును తదుపరి తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో మహారాష్ట్ర, బీహార్, అసోం, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్రాలకు సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. ఆయా రాష్ట్రాలకు చెందిన అడ్వకేట్ జనరల్స్ దృశ్యమాధ్యమ పద్ధతులలో తదుపరి నిర్దేశిత తేదీనాటికి విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. అదేవిధంగా వరుసగా అనేక తాత్కాలిక ఆదేశాలను జారీ చేసింది. నిరసన ప్రదర్శనలు జరిగిన రాష్ట్రాలలో సిసి ఫుటేజీలను భద్రపరచాలని, డ్రోన్ రికార్డింగ్స్‌ను భద్రపరచాలని,పోలీసులు తగిలించుకున్న బోడీ కెమేరాలలో సమాచారాన్ని జాగ్రత్తచేయాలని, వైర్‌లెస్ కమ్యూనికేషన్ సమాచారాన్ని రికార్డింగ్స్‌ను,పిసిఆర్ లాగ్స్ ఇతర డిజిటల్ సాక్ష్యాలను సిద్ధం చేయాలని ఆదేశించింది. నిరసనల సందర్భంగా విద్యార్థుల నుండి సేకరించిన వ్యక్తిగత డిజిటల్ రికార్డింగ్ సమాచారాన్ని కూడా భద్రపరచాలని కోరింది. ఈ వివరాలను ఎట్టిపరిస్థితుల్లోనూ ముందుగా బయటకు ప్రచురించవద్దని కూడా తెలియజేసింది.
చట్టాన్ని ఎవరు తమ చేతుల్లోకి తీసుకున్నాగానీ, అణచివేత చర్యలకు పాల్పడినాగానీ వారిని లక్ష్యంగా చేసుకుని న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని కూడా సుప్రీంకోర్టు ముందుగానే స్పష్టం చేసింది. ''ఈ వివాదానికి సంబంధించి కొనసాగుతున్న నిరసన ప్రదర్శనల్లో 18 ఏళ్ళ లోపు వయసు గల పిల్లలను అరెస్టు చేస్తే అన్ని రాష్ట్రాలు వారిని విడుదల చేయాలి, వారిని నేరస్థులుగా ప్రకటిస్తూ ఎలాంటి చర్యలూ తీసుకోవద్దు'' అని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అలాంటి విద్యార్థులను వారి సొంత పూచీకత్తుపైన లేదా వారి కుటుంబ సభ్యుల హామీపైన విడుదల చేయాలని కోరింది. వారిని జామీనులు ఇవ్వాల్సిందిగా ఒత్తిడి చేయవద్దని ఆదేశించింది. పెల్లెట్ గన్స్‌ను విద్యార్థులపై ఉపయోగించారని, ఎలక్ట్రిక్ బటన్ లాఠీలను ఉపయోగించారని పోలీసులపై చేసిన ఆరోపణలను కూడా న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. వాటిపై కూడా సమగ్ర విచారణ చేస్తుంది. పోలీసులు ఈవిధమైన ఆయుధాలు ఉపయోగించడంవల్ల విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయని, కొందరు కంటిచూపును పోగొట్టుకునే పరిస్థితి వచ్చిందని వార్తలు వెలువడ్డాయి. ఎఫ్‌ఐఆర్‌లు దాఖలైతే వాటిపై విచారణ చేయాలని, కానీ నిరసన ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థులకు వ్యతిరేకంగా ఎలాంటి కఠినమైన, ఒత్తిడికి గురిచేసే చర్యలు తీసుకోవద్దని ఢిల్లీ ప్రభుత్వానికి,ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

# రైతులు, ప్రజా ప్రయోజనాలు కాపాడుతాం

### కావేరీ నదీ జలాల వివాదంపై కర్ణాటక సిఎం శివకుమార్ స్పష్టీకరణ

**బెంగళూరు :** కావేరీ నదీ జలాల వివాదంలో రాష్ట్ర రైతులు, ప్రజల ప్రయోజనాలను పరిరక్షించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ ఆదివారం స్పష్టం చేశారు. అదే సమయంలో, రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చిన సంస్థలు తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కావేరీ జల వివాదం నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం చేసిన అభ్యర్థన మేరకు, తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ తన బెంగళూరు పర్యటనను వాయిదా వేసుకోవడానికి అంగీకరించారని ఆయన తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలను కొనసాగించడానికి ఈ చర్య దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. కావేరీ అంశంపై చర్చించేందుకు ఈ ఇద్దరు నేతలు సోమవారం సమావేశం కావాల్సి ఉంది. అయితే, అంతర్రాష్ట్ర వివాదంపై ఈ వారం ప్రారంభంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నందున, మరింత అనుకూలమైన వాతావరణంలో చర్చలు జరిపేందుకు వీలుగా తన పర్యటనను వాయిదా వేయాలని శివకుమార్ విజయ్‌ను కోరారు. తమిళనాడుకు 15 రోజుల పాటు 3,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలన్న కావేరీ జల నియంత్రణ కమిటీ ఆదేశాలను సమర్థిస్తూ కావేరీ జల నిర్వహణ అథారిటీ గురువారం జారీ చేసిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా, కన్నడ అనుకూల సంఘాలు ఆగస్టు 13న కర్ణాటక బంద్‌కు పిలుపునిచ్చాయి. కావేరీ అంశంపై అఖిలపక్ష సమావేశానికి అధ్యక్షత వహించిన అనంతరం ఆదివారం విలేకరులతో మాట్లాడిన శివకుమార్, వర్షాల వల్ల పరిస్థితి మెరుగుపడిందని, అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయని, కాబట్టి నిరసనల అవసరం లేదని, ఇటువంటి బంద్ ఎవరికీ ప్రయోజనం చేకూర్చదని అన్నారు. చట్టపరమైన పరిధిలోనే నిర్ణయాలు తీసుకోవడం, తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వడం, న్యాయ, వ్యవసాయ నిపుణులతో సంప్రదింపులు జరపడం, తదుపరి చర్యలు తీసుకునే ముందు నీటి లభ్యతకు సంబంధించిన పరిస్థితులను నిశితంగా పర్యవేక్షించడం వంటివి ప్రభుత్వం కొనసాగిస్తుందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. 'కావేరీ అంశంలో కర్ణాటక రైతుల ప్రయోజనాలను పరిరక్షించడానికి మా ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది' అని ఆయన అన్నారు. తాను కూడా కావేరీ పరీవాహక ప్రాంతానికి చెందినవాడినని, రైతు బిడ్డనని పేర్కొన్న శివకుమార్, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం చూపే నిబద్ధతపై 7.5 కోట్ల మంది ప్రజలకు ఎలాంటి సందేహం ఉండకూడదని అన్నారు. ఒక ప్రశ్నకు సమాధానంగా, సుప్రీంకోర్టులో జరుగుతున్న విచారణకు సంబంధించి న్యాయ నిపుణుల బృందంతో సంప్రదించిన తర్వాత ప్రభుత్వం తన తదుపరి కార్యాచరణను నిర్ణయిస్తుందని ఆయన చెప్పారు. తమిళనాడులోని ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన డిఎంకె (డిఎంకె) సుప్రీంకోర్టును ఆశ్రయించడంపై స్పందిస్తూ, కర్ణాటక చట్టపరమైన ప్రక్రియ ద్వారానే దీనికి సమాధానం ఇస్తుందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. 'న్యాయపరమైన ప్రక్రియలను ఎదుర్కొనేటప్పుడు సీనియర్ న్యాయ నిపుణుల అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుంటూ చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి' అని శివకుమార్ వివరించారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు ఇప్పటికే తీర్పునిచ్చినందున, మెకెదాటు ప్రాజెక్టు పనులు ముందుకు సాగాలని ఆయన పునరుద్ఘాటించారు. కావేరీ నదిపై మెకెదాటు వద్ద ఒక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను నిర్మించడం ఈ ప్రాజెక్టు ఉద్దేశ్యం; అయితే, ఈ ఆనకట్ట నిర్మాణం జరిగితే తమ ప్రయోజనాలకు భంగం కలుగుతుందని తమిళనాడు దీనిని వ్యతిరేకిస్తోంది.

## పెరూ నాజ్కాలైన్స్‌లో నేలకూలిన విమానం

13 మంది యాత్రికులు దుర్మరణం



**లిమా:** దక్షిణ అమెరికా వాయువ్యప్రాంత దేశం పెరూలో టూరిస్టు విమానం కుప్పకూలింది. ఇందులో ప్రయాణం చేస్తున్న 13 మంది దుర్మరణం చెందారు. సెస్నా కారవాన్ సి–208 చిన్న విమానం నాజ్కాలైన్స్ పురావస్తు మ్యూజియం ప్రాంతం మీదుగా ప్రయాణం చేసి వెళుతుండగా శనివారం రాత్రి కూలిపోయింది. విమానంలో 11 మంది ప్రయాణికులు, ఇద్దరు పైలట్లు ఉన్నారు. మరణించినవారిలో ఇద్దరిని జర్మన్‌వాసులుగా, మరో ఇద్దరిని స్పెయిన్ దేశీయులుగా, మరో ఏడుగురిని ఇటాలియన్లుగా గుర్తించారు. ప్రమాదానికి గల కారణాలు పూర్తిగా తెలియరాలేదు. పెరూ దక్షిణ ప్రాంతంలో ఉన్న నాజ్కాలైన్స్ యునెస్కోవారి ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పర్యాటక ప్రదేశం. ఈ ప్రాంతం నిత్యం యాత్రికులతో రద్దీగా ఉంటుంది. ఇక్కడ ఎడారి ఇసుకలో జంతువుల పురాతన చిత్రాలు ఉంటాయి. ఈ చిత్రాలను గగనతలం నుండి వీక్షించడానికి యాత్రికులు విమానాలలో పర్యటిస్తూ ఉంటారు. నాజ్కా గీతలుగా పిలిచే ఈ భారీ జియోగ్లిఫ్ చిత్రాలను 1600 సంవత్సరాలక్రితంనాటి పెరూ నాజ్కా సంస్కృతికి చెందిన ప్రజలు గీశారు. ఈ చిత్రాలు ప్రపంచ ప్రసిద్ధి గాంచినవి కావడంతో తరచు టూరిస్టులు ఇక్కడ గగనతలం మీదుగా వీటిని వీక్షిస్తూ ఉంటారు. 2010 లో కూడా ఇదేవిధంగా ఈ ప్రాంతంలో ఒక చిన్న విమానం కూలిపోయి ఆరుగురు టూరిస్టులు మరణించగా, 2022లో జరిగిన ప్రమాదంలో ఏడుగురు మరణించారు.

## గాజా అంతటా దాడులు

- ఎనిమిది మంది మృతి
- హమాస్ నిరాయుధీకరణపై నెతన్యాహూ అవిశ్వాసం



**గాజా:** ట్రంప్ ప్రతిపాదించిన నిరాయుధీకరణ ప్రణాళికకు హమాస్ అంగీకరించిందని వార్తలు వెలువడిన తర్వాత గాజాలో పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ సైన్యం ఉద్ధృత దాడులు చేస్తోంది. గాజా నుండి సైన్యాన్ని వెనక్కి తీసుకుంటానని ఇజ్రాయెల్ ఇంతవరకూ ఎలాంటి హామీ ఇవ్వలేదు. గాజా అంతటా ఆదివారం కొనసాగిన దాడులలో ఇద్దరు చిన్నారులు సహా ఎనిమిది మంది మరణించారు. మరో 12 మందిపైగా పాలస్తీనియన్లు గాయపడ్డారని ఆరోగ్యమంత్రిత్వశాఖ ప్రతినిధి చెప్పారు.గడచిన కొద్ది రోజులుగా ఈ ప్రాంతం అంతటా ఇజ్రాయెల్ దాడుల తీవ్రత పెరిగింది. నాజర్ ఆసుపత్రి సమాచారం ప్రకారం ఒక చిన్నారి సహా ఒకే కుటుంబంలో ముగ్గురు ఈ దాడుల్లో మరణించారు. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో కూడా మసీదులను ఇజ్రాయెల్ సేనలు ధ్వంసం చేస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకూ ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో 88 మంది పాలస్తీనియన్లను హతమార్చారు. వీరిలో 30 మంది స్థానిక ఇజ్రాయెల్ వాసులే దాడి చేసి చంపారు. కాగా పాలస్తినా తరపున చర్చల్లో మధ్యవర్తిగా పనిచేసిన ప్రవాసంలో ఉన్న పాలస్తినా నాయకుడు మ హ్మద్ దహ్లాన్ ఒక ప్ర కటన చేస్తూ, హమా స్ నిరాయుధీకరణ ఒప్పందంలో భాగంగా గాజాలో దాడులు నిలిపివేసే విషయం పై ఇజ్రాయెల్ ఇంకా ఎలాంటి హామీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. చర్చలు ఇంకా కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. దాడులు చేయకుం డా, సైన్యాన్ని వెనక్కు మళ్ళించడంలో జారెడ్ కుష్నెర్ ఇజ్రాయెల్‌ను ఒప్పించారని గతంలో దహ్లాన్ చేసిన ప్రకటనను ఆయన వెనక్కు తీసుకున్నారు. కాగా ఇజ్రాయెల్–హమాస్ మధ్య గత ఏడాది అక్టోబరులో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత కూడా ఐడిఎఫ్ చేస్తున్న దాడుల్లో ఇప్పటివరకూ 1,222 మంది పాలస్తీనియన్లు మరణించారు. వీరిలో 260 మంది చిన్నారులు ఉన్నారు.

ఆయుధాలను వదిలిపెట్టేదిలేదని ఇన్నాళ్ళూ భీష్మించుకు కూర్చున్న హమాస్ సంస్థ ట్రంప్ ప్రకటించిన నిరాయుధీకరణ ప్రణాళికను అంగీకరించినప్పటికీ నెతన్యాహూ మాత్రం విశ్వసించడంలేదు. వారు తమను తప్పుతోవ పట్టించి మళ్ళీ సైన్యాన్ని, ఆయుధాలను అభివృద్ధి చేసుకుని విరామం తీసుకున్నాక మళ్ళీ దాడులు చేస్తారని, అందువల్ల పతనావస్థలో ఉన్న హమాస్‌ను ఈ దశలోనే పూర్తిస్థాయిలో నిర్మూలించాలని ఇజ్రాయెల్ భావిస్తున్నది. 2023 అక్టోబరులో గాజాలో మారణహోమం ప్రారంభమైన తర్వాత ఇప్పటివరకూ మరణించిన పాలస్తీనియన్ల సంఖ్య 73,356 కు చేరుకోగా, గాయపడినవారి సంఖ్య 1,74,185 దాటింది.

## యూరప్‌లో మళ్ళీ కార్చిచ్చు



**ఏథెన్స్:** ఫ్రాన్స్, స్పెయిన్ దేశాలు కార్చిచ్చు మంటల బీభత్సంతో అతలాకుతలమై ప్రస్తుతానికి ఒక కొలిక్కి వస్తున్న దశలో ఇప్పుడు గ్రీస్ దేశంలో అటవీ ప్రాంతాలు దావానల దహనంతో భగభగలాడుతున్నాయి. ఫ్రాన్స్‌లో పరిస్థితులు ఒక కొలిక్కి వచ్చినప్పటికీ స్పెయిన్ దేశం ఇప్పటికీ ఇంకా కార్చిచ్చు మంటలు అదుపు చేసేందుకు పోరాటం చేస్తున్న దశలోనే గ్రీస్‌లో పలుచోట్ల దావానలం వ్యాపించింది. వాతావరణ మార్పుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏ ఖండంలోనూ లేనివిధంగా పశ్చిమ యూరప్ ప్రాంతం తీవ్ర ప్రభావానికి గురై శరవేగంగా వేడెక్కుతోందని ఇప్పటికే శాస్త్రవేత్తలు ప్రకటించగా, ఈ ప్రాంతాలు ఆ ఫలితాలను ప్రత్యక్షంగా ఎదుర్కొంటున్నాయి. ఏథెన్స్‌కు వాయువ్యంగా పోర్టో జెర్మెనో ప్రాంతంలో దావానలం వ్యాపించిందని, 100 కి.మీ వేగంతో గాలులు వీస్తున్నాయని గ్రీస్ ప్రధానమంత్రి కిరియాకోస్ మిత్సోటాకిస్ చెప్పారు.

## ఇండోనేసియాలో ఫెర్రీ దగ్ధం

ఐదుగురు మృతి: 41 మంది గల్లంతు




**మకాస్సర్:** ఇండోనేసియా మదురా ద్వీపం సమీపంలో ఒక ఫెర్రీ దగ్ధం కావడంతో మంటలు తీవ్రంగా వ్యాపించాయి. ఐదుగురు ప్రయాణికులు మరణించారు. మంటలు వ్యాపించడంతో భయంతో బయటకు దూకిన ప్రయాణికులలో మరో 41 మంది సముద్ర జలాల్లో జాడ తెలియకుండా పోయారు. 225 మందిని రక్షించారు. సజీవులకోసం సహాయబృందాలు తీవ్ర గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. తూర్పు జావాలోని సురబయి నుండి దక్షిణ సులవేసిలోని మకాస్సర్ వరకూ ఫెర్రీలో ప్రయాణికులు వెళుతుండగా ఆదివారం ఈ ప్రమాద ఘటన జరిగింది. అగ్ని ప్రమాదం సంభవించిన సమయంలో ఫెర్రీలో 275 మంది ప్రయాణం చేస్తున్నారు. ప్రమాద ఘటన తర్వాత అధికారులు,సహాయ బృందాలు 225 మందిని రక్షించాయి. సముద్రం మధ్యలో ఫెర్రీలో మంటలు చెలరేగడంతో దట్టమైన పొగలు ఆకాశంలోకి పైకి లేచాయి. ప్రయాణికులు భయంతో పరుగులు తీసున్నత దృశ్యాలు సోషల్ మీడియా వీడియోలలో కనిపించాయి.

## మహిపూర్‌లో ఎన్ఎస్‌సిఎన్(కె) ఉగ్రవాది అరెస్ట్

**ఇంఫాల్:** మణిపూర్‌లోని తమేంగ్లాంగ్ జిల్లాలో జాతీయ రహదారులపై వసూళ్లకు పాల్పడుతున్న నిషేధిత ఎన్ఎస్‌సిఎన్(కె) ఉగ్రవాద సంస్థకు చెందిన ఒక ఉగ్రవాదిని భద్రతా బలగాలు అరెస్ట్ చేసినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. 32 ఏళ్ల లుంగ్థావుఖోన్ పాన్మీగా గుర్తించిన నిందితుడిని, ఇంఫాల్‌ను సిల్చార్‌తో కలిపే జాతీయ రహదారి37 వెంబడి కైమై పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి పలు బలవంతపు వసూళ్ల పత్రాలతో పాటు రూ. 2,800 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా, ఆయుధాలు, మందుగుండు సామాగ్రి మరియు పేలుడు పదార్థాల అక్రమ కొనుగోలు, అమ్మకాలతో సంబంధం ఉన్న మరో వ్యక్తిని కూడా భద్రతా బలగాలు శనివారం అరెస్ట్ చేశాయి. ఇంఫాల్ ఈస్ట్ జిల్లాలోని కొంగ్మాన్ జోన్III ప్రాంతానికి చెందిన లైశ్రమ్ లక్పతి సింగ్ (56) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని, 10 రౌండ్ల 9ఎంఎం తూటాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

## లెబనాన్‌లో విధ్వంసాలపై రోమ్‌లో చర్చలు



**టెహ్రాన్:** కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్నప్పటికీ లెబనాన్‌లో ఇటీవలికాలంలో ఇజ్రాయెల్ సృష్టిస్తున్న విధ్వంసాలపై ఐక్యరాజ్య సమితి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఐక్యరాజ్యసమితి ప్రత్యేక సమన్వయకర్త కార్యాలయం ఒక ప్రకటన చేస్తూ, ఇంకా ఏవైనా సమస్యలు మిగిలి ఉంటే వాటిని పరిష్కరించుకోవడానికి దౌత్యమార్గాలను అనుసరించాలని, దాడులు, విధ్వంసాలకు స్వస్తిచెప్పాలని పేర్కొంది.''దక్షిణ లెబనాన్‌లో పేలుళ్ళు,విధ్వంసాలస్థాయి తీవ్ర ఆందోళన కలిగిస్తోంది, పౌర మౌలిక సదుపాయాలు, సాంస్కృతిక వారసత్వ కేంద్రాలపై కూడా తీవ్ర దాడులు జరుగుతున్నాయి,సమాజ సామూహిక సంస్కృతిని ధ్వంసం చేసేరీతిలో ఈ దాడులు తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి, దీనిని అడ్డుకోవాలి'' అని ప్రకటన పేర్కొంది. ఇటీవల దక్షిణ లెబనాన్‌లోని అత్యంత పురాతనమైన యునెస్కో వారసత్వ కేంద్రం గా ప్రకటించిన ప్రాంతాన్ని ఇజ్రాయెల్ సైనిక దళాలు ధ్వంసం చేశాయి.

అమెరికా మధ్యవర్తిత్వం ద్వారా ఇజ్రాయెల్–లెబనాన్ దేశాలు ఈ ఏడాది ఏప్రిల్ 16వ తేదీన కాల్పుల విరమణ ఒప్పందానికి వచ్చాయి. ఇజ్రాయెల్ ప్రభుత్వానికి, హెజ్బొల్లా ఉగ్రవాద సైన్యాలకు మధ్య జరుగుతున్న పోరాటాన్ని నిలిపివేయడమే ఈ కాల్పుల విరమణ ఒప్పంద లక్ష్యం. ఐతే డోనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విధంగా నిర్ణీత ప్రకారం ఆగస్టు నాలుగో తేదీ నుండి ఆరో తేదీ వరకూ లెబనాన్–ఇజ్రాయెల్ ప్రతినిధులమధ్య రోమ్‌లో మరో విడత చర్చలు ప్రారంభం కావాల్సి ఉంది. జూన్ నెలలో ఈ రెండు దేశాల ప్రతినిధులు ఒక ఒప్పందంపై సంతకాలు చేశారు. అంతిమంగా ఒక శాంతి ఒప్పందం చేసుకోవడానికి వీలుగా అంగీకృత నిబంధనలతో కూడిన ప్రణాళికను ముందుకు తీసుకువెళ్ళేందుకు నిర్ణీత ప్రకారం రోమ్‌లో చర్చలు జరగాల్సి ఉంది.

## నీట్ యుజి కౌన్సెలింగ్

(మొదటి పేజీ తరువాయి)

ఆ తర్వాత మూడవ విడత సెప్టెంబర్ 10 నుండి 18 వరకు జరుగుతుంది. స్ట్రే వేకెన్సీ రౌండ్ సెప్టెంబర్ 28 నుండి అక్టోబర్ 3 వరకు జరగనుంది. స్ట్రే వేకెన్సీ రౌండ్ తర్వాత చేరడానికి అక్టోబర్ 10 చివరి తేదీ. స్టేట్ కోటా సీట్ల కోసం, మొదటి విడత కౌన్సెలింగ్ ఆగస్టు 13 నుండి ఆగస్టు 22 వరకు జరుగుతుంది, అభ్యర్థులు ఆగస్టు 28లోగా చేరాల్సి ఉంటుంది. రెండవ విడత ఆగస్టు 31 నుండి సెప్టెంబర్ 8 వరకు, మూడవ విడత సెప్టెంబర్ 16 నుండి సెప్టెంబర్ 26 వరకు జరుగుతుంది. రాష్ట్ర కోటా సీట్ల ఖాళీల కేటాయింపు ప్రక్రియ అక్టోబర్ 3 నుండి అక్టోబర్ 5 వరకు నిర్వహించబడుతుంది. సీట్ల కేటాయింపు ప్రక్రియను సులభతరం చేయడానికి, ప్రతి రౌండ్ తర్వాత మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసిసి), రాష్ట్ర కౌన్సెలింగ్ అధికారులు చేరిన అభ్యర్థులను ధృవీకరించడానికి అవసరమైన కాలపరిమితులను కూడా ఈ షెడ్యూల్ నిర్దేశిస్తుంది. ఎంసిసి పంచుకున్న షెడ్యూల్ ప్రకారం, ఖాళీగా ఉన్న సీట్ల కోసం తదుపరి రౌండ్ల కౌన్సెలింగ్ కొనసాగుతుండగానే, అండర్ గ్రాడ్యుయేట్ వైద్య కోర్సుల విద్యా సంవత్సరం సెప్టెంబర్ 8న ప్రారంభమవుతుంది. పాల్గొంటున్న అన్ని విద్యాసంస్థలు, రాష్ట్ర కౌన్సెలింగ్ అధికారులు, నియమిత ఏజెన్సీలు ఈ షెడ్యూల్‌ను కచ్చితంగా పాటించాలని ఎంసిసి ఆదేశించింది. కౌన్సెలింగ్ ప్రక్రియ సకాలంలో పూర్తయ్యేలా చూడటానికి, శనివారాలు, ఆదివారాలు, గెజిటెడ్ సెలవు దినాలన్నింటినీ పనిదినాలుగా పరిగణించాలని కూడా విద్యాసంస్థలను కోరింది.

## న్యాయమే పునాది

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. తెలంగాణను 2047 నాటికి రూ 3 ట్రిలియన్ డాలర్లు, రాబోయే ఐదేళ్లలో 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యంగా 'తెలంగాణ రైజింగ్ 2047'విజన్‌ను తమ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌కు తోడుగా ముచ్చర్ల ప్రాంతంలో కాలుష్య రహిత నెట్ జీరో ప్రమాణాలతో 'భారత్ ఫ్యూచర్ సిటీ' ని నాలుగో మహానగరంగా నిర్మిస్తున్నామని వివరించారు. రాష్ట్రాన్ని కోర్ అర్బన్ (క్యూర్), పెరిఅర్బన్ (ప్యూర్ ), రూరల్ అగ్రి (రేర్ ) అని మూడు ఆర్థిక మండలాలుగా వర్గీకరించి ,వాటిని వేగంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు.పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని నెలకొల్పామని, ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నామన్నారు.

**ఆక్రమణలకు చెక్‌పెట్టేందుకే హైడ్రా**

టాటా గ్రూప్ భాగస్వామ్యంతో రూ. 2,100 కోట్లతో ప్రభుత్వ ఐటీఐలను హైటెక్ డిజిటల్ శిక్షణా కేంద్రాలుగా మారుస్తున్నామన్నారు. హైదరాబాద్ మహానగరంలో చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలకు చెక్ పెట్టేందుకే 'హైడ్రా' వ్యవస్థను తీసుకొచ్చామని భట్టి విక్రమార్క అన్నారు. ప్రకృతి వనరులను కాపాడేందుకు కఠిన చర్యలు చేపడుతున్నామన్నారు. లండన్ థేమ్స్ నది తరహాలో మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు ద్వారా మూసీ నదిని శుద్ధి చేసి, పర్యాటక, వాణిజ్య కేంద్రంగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని మొదలుపెట్టామని చెప్పారు.

**తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టిన బిఆర్ఎస్...**

గత బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని, తద్వారా ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల 15 నుంచి 25వ తేదీ వరకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉండేదని భట్టి విక్రమార్క వివరించారు. తమ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కఠినమైన ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ, విచ్ఛిన్నమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిందన్నారు. ఇప్పుడు ప్రతి నెలా 1వ తేదీనే ఉద్యోగుల ఖాతాల్లో వేతనాలు జమ చేస్తున్నామని, దేశంలోనే ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వ ఉద్యోగులకు రూ. 1.20 కోట్ల ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన 'ఆరు గ్యారెంటీలను ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో వేగంగా అమలు చేస్తోందని భట్టి విక్రమార్క అన్నారు.

## దాడులు ఆపేశా

(మొదటి పేజీ తరువాయి)

నిలిపివేయాల్సిందిగా సైన్యాధికారులకు ఆదేశం ఇస్తాను'' అని అంతకుముందు ట్రంప్ చెప్పారు. అదేవిధంగా ఇజ్రాయెల్ కూడా కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమలు చేసి యుద్ధాన్ని ముగించాలనే ఒక నిబద్ధతకు చేరువ అవుతోందని ట్రంప్ చెప్పారు. దీనిపై ఇజ్రాయెల్ స్పందించలేదు.

''వారు చేసిన ఈ అభ్యర్థన ఆధారంగా, ప్రపంచ భవిష్యత్ ప్రయోజనంకోసం,విజయవంతమైన,సంపన్నవంతమైన ఇరాన్ మనుగడకోసం వేగంగా ఒక ఒప్పందం చేసుకోగల షరతులకు లోబడి దాడులను రద్దు చేయడానికి నేను అంగీకరించాను, హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరవడం,ఇరాన్ అణు ముప్పును తొలగించడం వంటివన్నీ ఈ ఒప్పందంలో ఉంటాయి, ఈ నిబద్ధతతో ఇజ్రాయెల్ నాతో ఏకీభవిస్తోందిఅందరూ పనిలోకి దిగండి, దీనిని పూర్తి చేయండి'' అని ట్రంప్ సోషల్ మీడియాలో రాశారు.

ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఇరాన్‌పై యుద్ధం ప్రారంభమైన తర్వాత ఇప్పటివరకూ ట్రంప్ అనేకసార్లు ఈ విధమైన ప్రకటనలు చేశారు. పరస్పర దాడులు,వాగ్యుద్ధం పరాకాష్ఠకు చేరిన ప్రతిసారీ ట్రంప్ ఈ విధమైన ప్రకటన చేస్తున్నారు. దీంతో ఆయన ప్రకటనకు విశ్వసనీయత కొరవడింది. ఇంతకుముందు ఏప్రిల్ ఏడో తేదీన కూడా ట్రంప్ ప్రకటన చేస్తూ, శాంతి చర్చలకు ఇరాన్ అంగీకరించకపోతే ఈ రాత్రికి రాత్రే ఇరాన్ పురాతన నాగరికత అంతమైపోతుందని బెదిరించారు. ఐతే తాజా ప్రతిపాదన ద్వారా ఇరుపక్షాలు మధ్యవర్తుల ప్రోత్సాహంతో సత్వరం చర్చలబల్ల వద్దకు వచ్చే అవకాశాలున్నాయి. ప్రాంతీయ అధికారుల సమాచారం ప్రకారం, ట్రంప్ ప్రకటనతో గతంలో చర్చల పురోగతిని అడ్డుకున్న తీవ్రతలను పరిష్కరించుకునేందుకు ఇరుపక్షాలు చర్చలకు వచ్చే అవకాశాలు ఉంటాయి. ఇరాన్ అనుకూల ఉగ్రవాద సైన్యాలు ఎర్ర సముద్రంలో,గల్ఫ్‌దేశాలపై దాడులు నిలిపివేయాల్సి ఉంటుందని మధ్యవర్తి చర్చల్లో పాల్గొంటున్న ఒకరు చెప్పారు. అమెరికా కూడా ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనాన్ని ఎత్తివేసి, చమురు ఎగుమతులకు అనుమతిస్తుందన్నారు.

ట్రంప్ సందేశం నేపథ్యంలో ఇరాన్ విదేశీ మంత్రి అబ్బాస్ అరాఘ్చి ఎక్స్ వేదికగా స్పందిస్తూ, ట్రంప్ ప్రకటన తమకు ఎలాంటి ఆశ్చర్యం కలిగించలేదని పేర్కొన్నారు. అమెరికా నుండి ఎదురవుతున్న కొత్త ముప్పులను ప్రతిఘటించడానికి ఇరాన్ నిత్యం అప్రమత్తంగానే ఉంటోందని పేర్కొన్నారు. అదేవిధంగా ఆయన మరోవైపు పశ్చిమాసియాలో చేయిదాటుతున్న పరిస్థితులపై మిత్రదేశాలు,మధ్యవర్తి దేశాలతో వేరు వేరుగా టెలిఫోన్ సంభాషణలు చేశారు. పాకిస్థాన్ సర్వసైన్యాధిపతి ఆసిఫ్ మునీర్, టర్కీ విదేశాంగమంత్రి హకాన్ ఫిదాన్, సౌదీఅరేబియా విదేశాంగమంత్రి ఫైజల్ బిన్ ఫర్హాన్‌లతో అరాఘ్చి సంభాషణలు చేశారు. యుద్ధంచేసినా, పొత్తులు పెట్టుకున్నా ఇరాన్ అదేస్థాయిలో వెనక్కు తగ్గకుండా స్పందిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఎలాంటి దురాక్రమణ చర్యలకు పాల్పడినా వారే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. అమెరికా,ఇజ్రాయెల్ చేస్తున్న కుట్రలు,దాడుల పన్నాగాలను ఎదుర్కోవడానికి, తాజా పరిణామాలపై అరాఘ్చి చర్చలు జరిపారని ఇరాన్ అధికారిక మీడియా తెలియజేసింది. అమెరికా దాడులు చేస్తే ప్రతిఘటించేందుకు ఇరాన్ సిద్ధంగా ఉందని, దుస్సాహసం చేస్తే ధ్వంసం చేస్తామని ఆయన సంభాషణల సందర్భంగా పేర్కొన్నారు.

హోర్ముజ్ జలసంధిలో హక్కులను కాపాడుకునేందుకు, ఇరాన్ సార్వభౌమాధికారాన్ని రక్షించుకోవడానికి రాజీపడే ప్రశ్నేలేదని,అమెరికాకు సహాయం చేసే దేశాలు అగ్ని జ్వాలల్లో బూడిదైపోతాయని అమెరికాకు దీటుగా ఇప్పటికే ఒక హెచ్చరిక చేశారు.ఐతే ట్రంప్ చెప్పిన శాంతి యత్నాల గురించి ఇరాన్ ఎలాంటి ప్రకటనా చేయలేదు.

చట్టవిరుద్ధమైన దాడులు, బెదిరింపులకు వ్యతిరేకంగా సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవడానికి జరుగుతున్న మహోన్నత పోరాటంలో కావాల్సిన అన్ని మార్గాలను వినియోగించుకుంటామని ఇరాన్ విదేశీమంత్రిత్వశాఖ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేసింది. దేశాన్ని కాపాడటంలో సాయుధ దళాలు గొప్ప కృషి చేస్తున్నాయని ప్రశంసించింది. ఇరాన్ స్వాతంత్ర్యం, దేశ గౌరవంకోసం ప్రాణత్యాగాలు చేసినవారికి నివాళులు అర్పించింది.

ఐతే సౌదీ అరేబియా ప్రెస్ ఏజెన్సీ సమాచారం ప్రకారం, ఆ దేశ వాస్తవ పాలకుడు మహ్మద్ బిన్ సల్మాన్ ఆదివారం ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడిన తర్వాత ఘర్షణలు పెరిగే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. దాడులు ఆపేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆయన ట్రంప్‌ను కోరారు. గల్ఫ్ దేశాలలో ఇంధన సదుపాయాలపై దాడులతో ఇరాన్ స్పందించవచ్చునని ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్‌పై ఎలాంటి కొత్త చర్యలు తీసుకోవాలని ఆలోచిస్తున్నారో చెప్పాలని ట్రంప్‌ను సల్మాన్ కోరినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం.

## ధాన్యం పక్కదారి

(మొదటి పేజీ తరువాయి)

బట్టబయలైంది. సూర్యాపేట జిల్లాలో పనిచేస్తున్న కొంత మంది పౌరసరఫరాల శాఖ అధికారులు మిల్లర్లు చేసే అక్రమాలకు ఇన్ని రోజులు అండగా నిలవడంతోనే ఇంత పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అక్రమాల్లో అధికారులకు కూడా ప్రమేయం ఉందని ప్రచారం సాగుతుంది. స్థానిక అధికారులు ప్రతినెలా మిల్లులను తనిఖీలు చేసి ప్రభుత్వం అప్పగించిన ధాన్యం నిల్వ ఉందా లేదా అన్నది చూస్తూ వస్తున్నారు. కానీ వీరి తనిఖీల్లో బయటపడని మిల్లర్ల అక్రమాల బాగోతం విజిలెన్స్ అధికారులు వరుసగా చేస్తున్న దాడుల్లో పెద్దఎత్తున బయటపడడం గమనార్హం. జిల్లాలోని కొంతమంది మిల్లర్లు గత రెండు, మూడు సంవత్సరాల నుండి పౌరసరఫరాల శాఖ అప్పగించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి (ఎఫ్‌సిఐకి) అప్పగించకుండా పెండింగ్ పెడుతూ వస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు బాకీ పేరుకపోయింది. ప్రభుత్వం అప్పగించిన ధాన్యం మిల్లుల్లో నిల్వ ఉందా లేదా అని తెలుసుకునేందుకు ప్రతినెలా తనిఖీలు చేసిన అధికారులకు వీరి అక్రమాలు ఏవి కనపడకపోవడం ఇందుకు నిదర్శనం. గత 13 రోజుల నుండి వరుసగా జిల్లాలో విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా రైస్‌మిల్లులను తనిఖీలు చేయడంతో కేవలం 9 మిల్లుల్లో రూ.172.84 కోట్ల విలువైన ధాన్యాన్ని పక్కదారి పట్టించినట్లుగా తేలింది. కాగా కొందరు రైస్‌మిల్లర్లు తమ అక్రమాలు బయటపడడంతో కేసులు నమోదు కాకుండా జాగ్రత్తపడి కొంత మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించినట్లు సమాచారం. తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్‌కు చెందిన వజ్రా రైస్ కార్పొరేషన్, వజ్రా వికాస్ రైస్‌మార్ట్‌ల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీ చేయగా ప్రభుత్వం అప్పగించిన ధాన్యంలో మొత్తం 29,187.888 టన్నుల ధాన్యం పక్కదారి పట్టినట్లు గుర్తించారు. దీని విలువ రూ.73కోట్లు ఉంటుందని నిర్ధారించారు. ఇదిలా ఉంటే తుంగతుర్తి నియోజక వర్గంలోని తిరుమలగిరి మండలం అన్నారం గ్రామంలోని ఏఎస్‌ఆర్ రైస్ మిల్లులో తనిఖీలు చేయగా 1,970.566 మెట్రిక్ టన్నుల ధాన్యం పక్కదారి పట్టినట్లుగా అధికారులు తేల్చారు. ఈ ధాన్యం విలువ రూ.46 కోట్లు ఉంటుంది ప్రకటించారు. సూర్యాపేట పట్టణంలోని శివసాయి రైస్ మిల్లులో తనిఖీ చేయగా 2900 మెట్రిక్ టన్నుల ధాన్యం తరుగు ఉన్నట్లు గుర్తించి దీని విలువ రూ.13కోట్లుగా అంచనా వేశారు. రవికృష్ణ రైస్ ఇండస్ట్రీలో తనిఖీలు చేయగా 12వేల టన్నుల ధాన్యం దారి మళ్ళించినట్లు తేలింది. దీని విలువ రూ.11.67కోట్లు. అలాగే కాసరబాద సమీపంలోని శ్రీవేంకటేశ్వర రైస్ మిల్లులో తనిఖీ చేయగా 1.14లక్షల క్వింటాల ధాన్యం తరుగు ఉన్నట్లుగా గుర్తించారు. దీని విలువ రూ.27.3 కోట్లు ఉంటుందని అధికారులు వెల్లడించారు. నవరత్న రైస్ మిల్లులో తనిఖీలు చేయగా 3.653 టన్నుల ధాన్యం తక్కువగా ఉన్నట్లు తేల్చగా దీని విలువ రూ.8.73 కోట్లుగా ఉంది. పెన్‌పహాడ్ మండలంలోని జెపి రైస్ ఇండస్ట్రీలో తనిఖీ చేయగా ఈ రైస్ మిల్లు మూతపడి 3 సంవత్సరాలకు పైనే అయ్యిందని తేలింది. అయినా అధికారులు ఈ మిల్లుకు 2024–25 రబీ సీజన్‌లో 45వేల క్వింటాళ్లు, 2025–26లో 15వేల క్వింటాళ్ళ ధాన్యాన్ని కేటాయించారు. ఈ ధాన్యం విలువ రూ.14.5 కోట్లు ఉందని అధికారులు తేల్చారు. హుజూర్‌నగర్ నియోజక వర్గంలోని చింతలపాలెం మండలం దొండపాడు గ్రామంలో శివసుబ్రహ్మణ్యేశ్వర్ మోడ్రన్ రైస్ మిల్లును అధికారులు తనిఖీ చేయగా 2050 మెట్రిక్ టన్నుల ధాన్యం పక్కదారి పట్టినట్లు తేలింది. దీని విలువ రూ.4.8కోట్లు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. సదరు మిల్లర్లపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపడం జరగగా, ఒక్కరిద్దరు రైస్ మిల్లుల యజమానులు కేసుల బెడద నుండి బయట పడేందుకు వారు పక్కదారి పట్టించిన ధాన్యానికి సంబంధించిన డబ్బును ప్రభుత్వానికి ముట్టజెప్పారు.

**మా మిల్లులపైనే తనిఖీలా...!**
**అధికారులను ప్రశ్నిస్తున్న మిగతా మిల్లర్లు...**

విజిలెన్స్, పౌరసరఫరాల శాఖ అధికారులు మా మిల్లులపైనే తనిఖీలు చేయడమేమిటని మిగతా మిల్లుల సంగతేంటని తనిఖీలు జరిగిన మిల్లుల యజమానులు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో దాదాపు 60 నుండి 70 మిల్లులకు పైగా ప్రభుత్వం కస్టమ్ మిల్లింగ్ రైస్ కోసం ధాన్యాన్ని కేటాయించిందని అందరి మిల్లుల్లో ధాన్యం తక్కువగా ఉందని బల్లాగుద్ది చెబుతున్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులు, ఇతర రాజకీయ పార్టీలకు సంబంధించిన మిల్లర్లు కోట్లాది రూపాయల ధాన్యాన్ని పక్కదారి పట్టించారని ఆ మిల్లుల వైపు అధికారులు కన్నెత్తి చూడడం లేదని బహిరంగంగా ఆరోపిస్తున్నారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజక వర్గ పరిధిలో ఉన్న కొన్ని మిల్లుల్లో ప్రభుత్వం కేటాయించిన ధాన్యం అసలే లేదని చెబుతున్నారు. అలాగే సూర్యాపేట, తుంగతుర్తి నియోజక వర్గ పరిధిలోని ఆత్మకూర్(ఎస్), పెన్‌పహాడ్, తిరుమలగిరి, నూతనకల్ మండలాల్లోని రైస్ మిల్లుల్లో కూడా భారీగా ధాన్యం పక్కదారి పట్టినట్లు ఆరోపణలు చేస్తున్నారు. అధికారులు వారిని వదిలి మా మిల్లులపైనే తనిఖీలు చేయడంపై వజ్రా రైస్ ఇండస్ట్రీస్ యజమాని, తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్‌తోపాటు ఆ పార్టీ నాయకులు మీడియా ముఖంగా తప్పుపడుతున్నారు. అధికారులు ఇతర మిల్లుల్లో తనిఖీలు చేస్తే ఇంకా జిల్లాలో వందల కోట్ల రూపాయల విలువైన ధాన్యం పక్కదారి పట్టించినట్లు తేలే అవకాశం ఉంది. ఇప్పటికైనా స్పందించి అన్ని మిల్లుల్లో తనిఖీలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ ధాన్యం మాయం చేసిన మిల్లర్లు**

ఇటీవల శాయంపేట మండలం గట్లకానిపర్తిలోని రెండు రైస్ మిల్లుల్లో ఏకంగా రూ.9 కోట్లకు పైగా విలువైన ధాన్యం గాల్లో కలిసిపోయినట్లు తేలడం, యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు కావడం ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ఉన్న మిల్లర్లలో గుబులు రేపింది. మరోవైపు, సిఎంఆర్ బకాయిపడ్డ మిల్లర్ల ఆస్తులను రెవెన్యూ రికవరీ (ఆర్ఆర్) యాక్ట్ ద్వారా జప్తు చేయాలని భావిస్తుంటే.. అక్రమార్కులకు కొమ్ము కాస్తూ అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఫోన్ కాల్స్ తో నిఘా అధికారులపై ఒత్తిడి తేవడం, విజిలెన్స్ దాడులకు అడ్డంకిగా మారడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.ప్రధానంగా తొలివిడత పెద్ద మొత్తంలో సీఎంఆర్ బక్తాయి ఉన్నరైస్ మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల క్రితం హనుమకొండ జిల్లా శాయంపేట మండలం గట్లకానిపర్తి గ్రామంలోని వినాయక, లక్ష్మీ నరసింహరైస్ మిల్లుల్లో విజిలెన్స్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లోరూ.9కోట్లకుపైగా విలువచేసే ధాన్యం మాయమైనట్లు గుర్తించారు. పోలీసులు ఈ రెండు రైస్ మిల్లుల యజమానులపై శుక్రవారం క్రిమినల్ కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం పరారీలో ఉన్న వినాయక, లక్ష్మీ నరసింహా రైస్ మిల్లుల యజమానులు లక్ష్మణ్ రావు, కిరణ్ లను అరెస్టు చేసే పనిలో ఉన్నట్లు పోలీసు అధికారులు ప్రకటించారు. తాజాగా జరిగిన ఈ ఉదంతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారీగా సీఎంఆర్ బకాయిపడిన రైస్ మిల్లర్లలో కలకలం సృష్టించింది.తమ రైస్ మిల్లులో కూడా విజిలెన్స్ తనిఖీలు జరగవచ్చనే గుబులు మొదలైంది.

**డిఫాల్ట్ మిల్లర్లపై ఆర్ఆర్ యాక్టు!**

మరోవైపు నిర్దేశితగడువులోపు సిఎంఆర్ బకాయిలను డెలివరీ చేయని రైస్ మిల్లులపై రెవెన్యూ రికవరీ (ఆర్ఆర్) యాక్టును ప్రయోగించాలని ప్రభుత్వం తహసీల్దార్లను ఆదేశిస్తున్నది.శనివారం హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్ రవి సిఎంఆర్ మానిటరింగ్, పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో డిఫాల్ట్ అయిన రైస్ మిల్లర్లపై ఆర్ఆర్ యాక్టుప్రకారం చర్యలు చేపట్టి ప్రభుత్వానికి రావాల్సిన బకాయిల వసూళ్ల కోసం వారి ఆస్తులను జప్తు చేసే ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని తహసీల్దార్లను ఆదేశించారు. దీంతో ప్రతి జిల్లాలో కూడా సిఎంఆర్ డిఫాల్ట్ అయిన రైస్ మిల్లర్ల ఆస్తులను ఆర్ఆర్ యాక్టు ప్రకారం జప్తు చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది.

**రైస్ మిల్లుల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలి**

హనుమకొండ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్లు వెచ్చించి రైతుల దగ్గర నుంచి కనీస మద్దతు ధరకు సేకరించిన వరి ధాన్యాన్ని కొంతమంది రైస్ మిల్లుల యజమానులు వారికి ఉన్న పలుకుబడిని ఆసరా చేసుకుని నొక్కేస్తున్నారని, తక్షణమే జిల్లాలో ఉన్న అన్ని మిల్లులపై విజిలెన్స్ అధికారుల చేత రైడింగ్స్ జరిపించి వరి ధాన్యం నిలువలను ప్రజల ముందు ఉంచాలని సిపిఐ కార్యదర్శి కర్రె బిక్షపతి డిమాండ్ చేశారు. జిల్లాలో 2025–26 ఖరీఫ్ సీజన్‌లో 60 రైస్ మిల్లులు 46వేల 50 మెట్రిక్ టన్నుల విలువైన వరి ధాన్యం సిఎంఆర్ బకాయి ఉన్నారని, రబీ సీజన్లో 45 మిల్లులు 10,6336 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పెండింగ్‌లో ఉందని, ఖరీఫ్లో 31 శాతం, రబీ లో 62 శాతం సీఎంఆర్ బకాయి మిల్లుల్లో ఉందని, ఈ పెండింగ్ బకాయిగా ఉన్న సీఎంఆర్ విలువ సుమారు 360 కోట్లు చేస్తుందని, ఇంత పెద్ద మొత్తంలో జిల్లాలో మిల్లులు ప్రభుత్వానికి అన్యాయం చేస్తుంటే జిల్లా అధికార యంత్రాంగం ఏం చేస్తున్నట్టు అని ప్రశ్నించారు. తక్షణమే బకాయి ఉన్న మిల్లులన్నింటిని తనిఖీ చేసి రికవరీ చేయాలని, వరి ధాన్యాన్ని అమ్ముకున్న నెల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అమ్ముకున్న ధాన్యానికి ఖరీదు కట్టి వసూలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## శ్రీలంక పర్యటనకు బుమ్రా దూరం



ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025–27లో కీలకమైన పర్యటనకు ముందే భారత జట్టుకు బిగ్ షాక్. శ్రీలంక పర్యటనకు ఎంపికైన జస్ప్రీత్ బుమ్రా టెస్టు సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. ఫిట్‌నెస్ టెస్టులో పాస్సైన బుమ్రా.. మోకాలి గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడమే అందుకు కారణం. దాంతో, లంకతో రెండు టెస్టుల సిరీస్‌కు యార్కర్ కింగ్ అందుబాటులో ఉండడని ఆదివారం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) వెల్లడించింది. శ్రీలంక పర్యటనకు స్క్వాడ్‌లో కలుపుకున్నప్పటికీ జస్ప్రీత్ బుమ్రా సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. రెండు రోజుల క్రితమే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫిట్‌నెస్ సాధించిన అతడు.. మోకాలి గాయం నుంచి పూర్తిగా కోలుకోలేదు. కాబట్టి.. లంకతో రెండు టెస్టుల సిరీస్‌కు ఎంపికైన బుమ్రాను స్క్వాడ్ నుంచి తప్పించారు. ఇంగ్లండ్ పర్యటనలో రెండో వన్డేలో గాయపడిన యార్కర్ కింగ్.. అఫ్ఘనిస్థాన్‌తో ఏకైక టెస్టు ఆడలేదు. సీఓఈలో ఫిట్‌నెస్‌పై దృష్టి సారించిన అతడు.. శ్రీలంక పర్యటనకు సిద్ధంగా ఉంటాడని బిసిసిఐ ఆశించింది. కానీ, అతడు వంద శాతం కోలుకోలేదు. దాంతో.. బుమ్రా గైర్హాజరీలో భారత పేస్ దళానికి అనుభవజ్ఞుడైన సిరాజ్ నాయకత్వం వహించనున్నాడు. అయితే.. బుమ్రా స్థానంలో మరొకరిని ఇంకా స్క్వాడ్‌లోకి తీసుకోలేదు. భారత జట్టు ఆగస్టు 4వ తేదీన శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది. షెడ్యూల్ ప్రకారం గాలెలో ఆగస్టు 15వ తేదీన తొలి టెస్టుకు ముందు శుభ్‌మన్ గిల్ సేన నాలుగు రోజులు ప్రాక్టీస్ మ్యాచ్ ఆడాల్సి ఉంది. అయితే.. అనుకోని కారణాల వల్ల షెడ్యూల్ మారింది. నాలుగు రోజుల వామప్ మ్యాచ్‌ను కాస్త మూడు రోజులకు కుదించారు. ఇందుకు కారణం ఏంటనేది మాత్రం తెలియాల్సి ఉంది. గాలే టెస్టు అనంతరం ఆగస్టు 23న కొలంబోలో రెండో టెస్టులో ఇరు జట్లు తలపడనున్నాయి. ప్రస్తుతం ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ర్యాంకింగ్స్‌లో 5వ స్థానంలో ఉన్న గిల్ సేన.. ఈ రెండు మ్యాచుల్లో గెలిచినా టాప్2లోకి వచ్చే అవకాశాలు తక్కువే.

**భారత టెస్టు స్క్వాడ్ :** శుభ్‌మన్ గిల్(కెప్టెన్), కేఎల్ రాహుల్(వైస్ కెప్టెన్), యశస్వీ జైస్వాల్, రిషభ్ పంత్(వికెట్ కీపర్), సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్(వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, దేవ్‌దత్ పడిక్కల్, సరన్ష్ జైన్.

## రహానేకు 'ఫిక్స్‌డ్ పింఛన్'



అంతర్జాతీయ క్రికెట్ సహా ఫ్రాంచైజీ టోర్నీలకు సైతం వీడ్కోలు పలికిన అజింక్యా రహానేకు భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆర్థికంగా అండగా నిలువనుంది. మిడిలార్డర్ బ్యాటర్‌గా, వైస్ కెప్టెన్‌గా సుదీర్ఘ కాలం భారత జట్టుకు సేవలందించిన అతడికి ప్రతినెలా ఫిక్స్‌డ్ పింఛను ఇవ్వనుంది. అందరూ మాజీ ఆటగాళ్ల మాదిరిగానే అతడికి కూడా పెద్ద మొత్తంలో ముట్టజెప్పనుంది బిసిసిఐ. ఇకనుంచి నెల నెలా రూ.70వే లు పింఛను రూపంలో రహానే అందుకోనున్నాడు. ఈ విషయాన్ని బిసిసిఐ ధ్రువీకరించింది. పునరాగమనం కోసం నిరీక్షించి.. సెలెక్టర్ల వైఖరితో వీడ్కోలు పలికిన అజింక్యా రహానే ఇకపై కూడా బిసిసిఐ నుంచి ఆదాయం అందుకోనున్నాడు. రిటైర్మెంట్ అనంతరం మాజీలకు ఆనవాయితీగా ఇచ్చే మంత్లీ పింఛన్ ఇప్పుడు రహానేకు దక్కనుంది. టీమిండియా తరఫున 85 టెస్టులు, 90 వన్డేలు, 20 టీ20లు ఆడిన ఈ వెటరన్ బిసిసిఐ ఫిక్స్‌డ్ పింఛనుకు అర్హత సాధించాడు. 80కి పైగా టెస్టులు ఆడినందున ఇక నుంచి భారత బోర్డు ప్రతి నెలా అతడికి రూ.70 వేలు చెల్లించనుంది.

### గంగూలీ హయాంలో..

మొదట్లో రహానే అంత అనుభమున్న మాజీ ఆటగాళ్లకు నెలకు రూ.50 వేలు మాత్రమే ఇచ్చేవారు. కానీ, నాలుగేళ్ల క్రితం సౌరవ్ గంగూలీ బిసిసిఐ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఈ మొత్తాన్ని మరో 20 వేలకు పెంచారు. దాంతో.. అప్పటి నుంచి వీడ్కోలు పలికిన భారత ఆటగాళ్లకు ప్రతినెలా ఫిక్స్‌డ్ పింఛనుగా రూ.70లు బిసిసిఐ అందిస్తోంది .


## 25 సిక్సర్లు, 15 ఫోర్లతో అభిషేక్ ఊచకోత!



టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ దేశీయ క్రికెట్‌లో విధ్వంసం సృష్టించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. అభిషేక్ శర్మ బ్యాట్‌తో విరుచుకుపడి బౌలర్లను కేవలం ప్రేక్షకులుగా మార్చేశాడు. ఇటీవల టీమిండియా తరఫున టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో పెద్దగా స్కోర్లు చేయలేక పోయిన అభిషేక్ శర్మ.. దేశీయ క్రికెట్‌లో తన పాత ఫామ్‌ను ప్రదర్శించాడు. 2026–27 పంజాబ్ రాష్ట్ర అంతర్‌జిల్లా సీనియర్ వన్డే పరిమిత ఓవర్ల టోర్నమెంట్‌లో అమృత్‌సర్ సీనియర్ జట్టు తరఫున ఆడిన అభిషేక్ శర్మ, కేవలం 91 బంతుల్లో 233 పరుగులు చేసి తార్న్ తారన్ జట్టుపై సీనియర్ బౌలర్లను చితకబాదాడు. ఈ మ్యాచ్ ఆదివారం అమృత్‌సర్‌లోని గాంధీ గ్రౌండ్స్‌లో జరిగింది. అభిషేక్ శర్మ ఇన్నింగ్స్ అత్యంత విధ్వంసకరంగా సాగింది. అభిషేక్ తన 233 పరుగుల ఇన్నింగ్స్‌లో 25 సిక్సర్లు, 15 ఫోర్లు బాదాడు. అంటే కేవలం ఫోర్లు, సిక్సర్ల ద్వారానే 210 పరుగులు సాధించాడు. ఈ సమయంలో అభిషేక్ స్ట్రైక్ రేట్ 256.04గా ఉంది. ఇన్నింగ్స్ ప్రారంభం నుంచే దూకుడుగా ఆడి, ప్రత్యర్థి బౌలర్లెవరినీ ఫామ్‌లోకి రానివ్వలేదు. అభిషేక్ శర్మ ముందు తార్న్ తారన్ బౌలర్లు పూర్తిగా నిస్సహాయుల య్యా రు. ఫాస్ట్ బౌలర్లైనా, స్పిన్నర్లైనా సరే అభిషేక్ శర్మ తనదైన స్టైల్లో వీరవిహారం చేశాడు. అభిషేక్ శర్మ మైదానం నలువైపులా కొట్టిన భారీ సిక్సర్లు ప్రేక్షకులను ఎంతగానో అలరించా యి. అభిషేక్ శర్మ విధ్వంసకర బ్యాటింగ్ పుణ్యమా అని, అమృత్‌సర్ సీనియర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 533 పరుగుల భారీ స్కోరును సాధించింది. అభిషేక్ శర్మతో పాటు ఓపెనర్ అభయ్ చౌదరి 85 బంతుల్లో 93 పరుగులు, అభినవ్ శర్మ 33 బంతుల్లో 51 పరుగులు, సాహిల్ శర్మ 20 బంతుల్లో 37 పరుగులు చేశారు. వరీందర్ సింగ్ లోహ్రా 36 పరుగులతో కీలక సహకారం అందించగా.. సలీల్ అరోరా 29 పరుగులు చేశాడు.

## ఆందోళన కలిగిస్తున్న మానసిక ఆరోగ్య సమస్యలు

గత మూడు దశాబ్దాల్లో ప్రపంచవ్యాప్తంగా మానసిక ఆరోగ్య సమస్యలు గణనీయంగా పెరిగి, ఇప్పుడు ప్రజారోగ్య రంగంలో అత్యంత కీలకమైన సవాళ్లలో ఒకటిగా మారాయి. ఒకప్పుడు వ్యక్తిగత సమస్యగా భావించిన మానసిక రుగ్మతలు నేడు కుటుంబాలు, విద్యా వ్యవస్థ, ఉద్యోగ రంగం, దేశాల ఆర్థికాభివృద్ధిపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య పరిస్థితులను సమగ్రంగా విశ్లేషించే 'గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీస్' (జిబిడి) అధ్యయనం ఆధారంగా రూపొందించిన తాజా పరిశోధన ఈ ఆందోళనకర వాస్తవాన్ని వెలుగులోకి తెచ్చింది. ఈ అధ్యయనం 'ది లాన్సెట్' వైద్య పత్రికలో ప్రచురితమైంది. తాజా పరిశోధన ప్రకారం 1990లో ప్రపంచవ్యాప్తంగా సుమారు 60 కోట్ల మంది ఏదో ఒక మానసిక రుగ్మతతో జీవించగా, 2023 నాటికి ఆ సంఖ్య దాదాపు 117 కోట్లకు చేరుకుంది. అంటే మూడు దశాబ్దాల్లో మానసిక రుగ్మతలతో జీవిస్తున్న వారి సంఖ్య సుమారు 95 శాతం పెరిగింది. ఈ పెరుగుదలకు జనాభా పెరుగుదల ఒక కారణమైనప్పటికీ, సమాజంలో మానసిక ఒత్తిళ్లు పెరగడం, జీవనశైలిలో వచ్చిన మార్పులు, సంక్షోభ పరిస్థితులు కూడా ప్రధాన పాత్ర పోషించాయని పరిశోధకులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వైకల్యంతో గడిచే జీవితకాలానికి మానసిక రుగ్మతలే ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. గుండె జబ్బులు లేదా ఇతర దీర్ఘకాలిక వ్యాధులు మరణాలకు దారితీసినా, మానసిక రుగ్మతలు లక్షలాది మందిలో జీవన నాణ్యతను దెబ్బతీస్తున్నాయి. ఆరోగ్యంగా జీవించాల్సిన అనేక సంవత్సరాలు ఈ సమస్యల కారణంగా కోల్పోతున్నారని అధ్యయనం వెల్లడించింది. 2023లో మాత్రమే ప్రపంచవ్యాప్తంగా దాదాపు 171 మిలియన్ సంవత్సరాల ఆరోగ్యవంతమైన జీవితం మానసిక రుగ్మతల వల్ల వైకల్యంతో గడిచినట్లు అంచనా వేసింది. ఈ పరిస్థితికి పరస్పర ఆధారిత సంబంధిత కారణాలు అనేకం ఉన్నాయి. మానసిక ఆరోగ్యంపై అవగాహన పెరగడంతో గతంలో గుర్తించని అనేక కేసులు ఇప్పుడు వైద్యుల దృష్టికి వస్తున్నాయి. అదే సమయంలో కోవిడ్–19 మహమ్మారి తర్వాత పెరిగిన ఒంటరితనం, ఆర్థిక అస్థిరత, నిరుద్యోగం, యుద్ధాలు, బలవంతపు వలసలు, సామాజిక ఘర్షణలు, వేగంగా మారుతున్న డిజిటల్ జీవనశైలి, సామాజిక మాధ్యమాల ప్రభావం వంటి అంశాలు మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ అధ్యయనం ప్రకారం అత్యంత వేగంగా పెరుగుతున్న సమస్యల్లో ఆందోళన రుగ్మతలు, తీవ్ర నిరాశ ప్రధానమైనవి. 1990తో పోలిస్తే ఆందోళన రుగ్మతలు సుమారు 158 శాతం, తీవ్రమైన నిరాశ కేసులు 131 శాతం పెరిగాయి. ఈ సమస్యలు వ్యక్తిగత జీవితానికే పరిమితం కావు. కుటుంబ సంబంధాలు, విద్యాభ్యాసం, ఉద్యోగ సామర్థ్యం, సామాజిక సంబంధాలు, ఆర్థిక స్థిరత్వం వంటి అనేక రంగాలపై దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతాయి. కాగా, యువత పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉందని అధ్యయనం స్పష్టం చేసింది. ముఖ్యంగా 15 నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సు గలవారిలో మానసిక సమస్యల భారం అధికంగా కనిపిస్తోంది. పరీక్షల ఒత్తిడి, ఉపాధిపై అనిశ్చితి, భవిష్యత్తుపై భయం, కుటుంబ సమస్యలు, సామాజిక మాధ్యమాల ప్రభావం, తోటి విద్యార్థులతో పోలికలు వంటి అంశాలు యువత మానసిక ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ఈ దశలో సరైన వైద్య సహాయం, కౌన్సెలింగ్ అందకపోతే సమస్యలు దీర్ఘకాలం కొనసాగి జీవిత నాణ్యతను ప్రభావితం చేసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతేకాదు, మానసిక రుగ్మతలపై సమాజంలో ఇప్పటికీ అపోహలు, వివక్ష కొనసాగుతుండటంతో చాలామంది చికిత్స కోసం ముందుకు రావడం లేదు. ఈ పరిస్థితిని మార్చడానికి ప్రభుత్వాలు మానసిక ఆరోగ్యాన్ని ప్రాథమిక ఆరోగ్య సేవల్లో భాగం చేయడం, పాఠశాలలు, కళాశాలల్లో కౌన్సెలింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో కూడా నిపుణుల సేవలను అందుబాటులోకి తీసుకురావడం, అవసరమైన మందులు సులభంగా లభించేలా చూడడం అత్యవసరం. మానసిక ఆరోగ్య సమస్యలను ఇతర వ్యాధుల మాదిరిగానే సాధారణ వైద్య పరిస్థితులుగా సమాజం గుర్తించే వాతావరణం ఏర్పడాలి. ముందస్తు గుర్తింపు, సమయానికి చికిత్స, ప్రజల్లో అవగాహన, అందుబాటులో ఉన్న సేవలు విస్తరించినప్పుడే ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఈ మానసిక ఆరోగ్య సంక్షోభాన్ని సమర్థంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుంది.




## ఆరోగ్యం



## డబ్ల్యుహెచ్ఒ కొత్త మార్గదర్శకాలు

ప్రపంచంలోని అనేక ప్రాంతాలు రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) వేడి వాతావరణం వల్ల కలిగే ఆరోగ్య ప్రమాదాలపై కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మార్గదర్శకాల ప్రకారం తీవ్రమైన ఎండలు, అధిక ఉష్ణోగ్రతలు ప్రజలకు అనేక రకాలుగా అసౌకర్యాన్ని కలిగిస్తాయి. అవి ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పుగా మారుతున్నాయి. శరీర ఉష్ణోగ్రతను నియంత్రించే సామర్థ్యం తగ్గిపోవడంతో డీహైడ్రేషన్, గుండె సంబంధిత వ్యాధులు, మూత్రపిండాల పనితీరు దెబ్బతినడం, ప్రాణాపాయ స్థితికి దారితీసే హీట్ స్ట్రోక్ వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం పెరుగుతుందని డబ్ల్యుహెచ్ఒ హెచ్చరించింది. వృద్ధులు, చిన్నారులు, నిర్మాణ రంగం, వ్యవసాయం వంటి బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు, అలాగే మధుమేహం, గుండె జబ్బులు, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఎండ తీవ్రంగా ఉన్న సమయంలో అనవసరంగా బయటకు వెళ్లకుండా ఉండటం, తగినంత నీరు తరచూ తాగడం, తేలికపాటి దుస్తులు ధరించడం, నీడ లేదా చల్లని ప్రదేశాల్లో విశ్రాంతి తీసుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని డబ్ల్యుహెచ్ఒ పేర్కొంది. వాతావరణ మార్పుల కారణంగా తీవ్ర ఉష్ణ తరంగాలు మరింత తరచుగా, ఎక్కువ కాలం కొనసాగుతున్నాయని గుర్తుచేసిన డబ్ల్యుహెచ్ఒ, ప్రభుత్వాలు ఈ ఉష్ణ సంబంధిత హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేయాలని, ఆసుపత్రులు ముందస్తు సన్నాహాలు చేపట్టాలని, ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించింది. వ్యక్తిగత జాగ్రత్తలతో పాటు సమర్థవంతమైన ప్రజారోగ్య చర్యలు కూడా వేడి సంబంధిత మరణాలు, అనారోగ్యాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని స్పష్టం చేసింది.

## సమస్యల పరిష్కారం, హక్కుల సాధనే సిపిఐ రాజకీయ ప్రధాన లక్ష్యం

కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజల సమస్యల పరిష్కారం, హక్కుల సాధనే సిపిఐ రాజకీయ ప్రధాన లక్ష్యమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. ఆదివారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో సత్యప్రసాద్ అధ్యక్షతన సిపిఐ మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1వ తేదీన చేపట్టనున్న ఛలో ఢిల్లీ కార్యక్రమం వాల్ పోస్టర్‌ను కూనంనేని సాంబాశివరావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం, విద్యా–వైద్య రంగాల ప్రైవేటీకరణ, కార్మిక–రైతు వ్యతిరేక విధానాల కారణంగా సామాన్య ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల తరఫున నిరంతరం పోరాడుతూ, వారి సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహిస్తున్న ఏకైక పార్టీ సిపిఐ అని అన్నారు. ఈ నెల 6 నుండి 14 వరకు పార్టీ నిర్వహించే ప్రచార యాత్రలను అన్ని నియోజకవర్గంలో బలమైన డివిజన్లలో నిర్వహించాలని పిలుపునిచ్చారు. అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేయడమే సిపిఐ లక్ష్యమని తెలిపారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలంటే ప్రజా ఉద్యమాలే అసలైన మార్గమని, అదే కమ్యూనిస్టు రాజకీయాల మూల సూత్రమని పేర్కొన్నారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికలు ప్రజా సమస్యలను పరిష్కరించే ప్రజాప్రతినిధులను ఎన్నుకునే కీలక అవకాశమని కూనంనేని అన్నారు. ప్రజల మధ్య నిరంతరం పనిచేసిన, సేవా దృక్పథం కలిగిన సిపిఐ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఎన్నికల బరిలోకి దిగాలని ఆయన పిలుపునిచ్చారు. కాలనీలు, బస్తీలు, శ్రామికవాడలు, పేద ప్రజల సమస్యలను తమ ఎన్నికల ఎజెండాగా తీసుకుని ప్రజల విశ్వాసాన్ని సంపాదించాలని సూచించారు . రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్. బోస్ మాట్లాడుతూ కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థుల విజయంతో ప్రజల గొంతుక స్థానిక సంస్థల్లో బలపడుతుందని, అవినీతి, అక్రమాలు, ప్రజా వ్యతిరేక పాలనకు అడ్డుకట్ట వేయవచ్చని ఆయన అన్నారు. ప్రజలతో మమేకమై పనిచేసే కమ్యూనిస్టు నాయకత్వాన్ని గెలిపించి స్థానిక పాలనలో పారదర్శకత, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయాన్ని బలోపేతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్,జిల్లా కార్యవర్గ సభ్యులు దామోదర్ రెడ్డి, ధర్మేంద్ర,స్వామి,లక్ష్మ ణ్, రచ్చ కిషన్, నర్సింహా, శ్రీనివాస్, హైమావతి,రవిచంద్ర,ప్రమీల,వెంకటాచారి, వెంకటరెడ్డి,అన్వార్,నరేంద్ర,పసాద్,యాదగిరి,నాగరాజు,మాధవి,లత,బాపిరాజు, పరమేష్ , హరినాథ్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిజం అజరామరం

ఈ వారసత్వాన్ని భావితరాలకు అందించాలి : భాగం హేమంతరావు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** వందేళ్ళ చరిత్రలో అధికారం ఉన్నా లేకపోయినా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ఎర్రజెండా అజరామరంగా కొనసాగుతోందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంత్‌రావు అన్నారు. ఆదివారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని ముత్తగూడెంలో అనుముల రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం మండలాల సిపిఐ శిక్షణాతరగతులు అట్టహాంగా నిర్వహించారు. తొలుత ముత్తగూడెంలో ఏర్పాటు చేసిన అరుణపతాకాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అరుణ పతాకాన్ని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో భాగం హేమంత్ రావు మాట్లాడుతూ... కమ్యూనిస్టులకు అధికారం అవసరం కాదని, బూర్జువా పార్టీలకే అధికారం లక్ష్యమన్నారు. అలాంటి పార్టీలు అధికారం ఉన్నప్పుడే కనిపిస్తాయని, అధికారం కోల్పోయిన తర్వాత కనుమరుగవుతాయన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంతో పాటు ప్రజల హక్కుల సాధనలో కమ్యూనిస్టుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రజల పక్షాన చట్టసభల్లో కమ్యూనిస్టు ఎంపిలు, ఎమ్మెల్యేలు గట్టిగా గొంతెత్తి హక్కులు సాధించారని గుర్తు చేశారు. అయితే డబ్బు ప్రభావం పెరగడంతో కమ్యూనిస్టులు బలహీనపడగా, కార్పొరేట్‌శక్తులు బలపడి దేశ సంపదను దోచుకుంటున్నాయని విమర్శించారు. మతం ముసుగులో ప్రధాని నరేంద్రమోదీ ప్రజల మధ్య విభేదాలను సృష్టిస్తూ అధికారాన్ని అనుభవిస్తున్నారని దుయ్యబట్టారు. తాము ఎప్పుడూ మతాలను విమర్శించలేదని, కులమత బేధాలు లేని సమసమాజ నిర్మాణమే కమ్యూనిస్టుల లక్ష్యమని స్పష్టం చేశారు. శ్రీరాముడి పేరుతో రాజకీయాలు చేస్తున్న బిజెపి పాలనలో అయోధ్య నిర్మాణంలో వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపించారు. వారికి మతం, దేవుళ్లపై ప్రేమ కాదని, అధికార కాంక్ష మాత్రమే ముఖ్యమని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు భావజాలం అవసరం పెరుగుతోందని, ప్రపంచ రాజకీయ పరిణామాలు కూడా అదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయన్నారు. ప్రపంచాన్ని శాసిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం కమ్యూనిస్టుభూతం ప్రపంచాన్ని ఆవహించబోదోంది అని వ్యాఖ్యానించారని, ఇది కమ్యూనిస్టుల బలపడుతున్నారనేదానికి నిదర్శనం అన్నారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన విద్యార్థి ఉద్యమంలో ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదాలతో పోరాటం సాగిందని, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంత వరకు విద్యార్థులు వెనక్కి తగ్గలేదని అన్నారు. ఇంట్లో తల్లిదండ్రుల ఒక్క చెంపదెబ్బతినని వారు పోలీసుల లాఠీ దెబ్బలను సైతం లెక్కచేయకుండా పోరాడిన ఆ విద్యార్థుల పోరాటస్ఫూర్తి కమ్యూనిస్టులకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణా తరగతుల్లో ఉపాధ్యాయుడిగా భాగం హేమంత్‌రావు, ప్రిన్సిపల్‌గా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిద్ధినేని కర్ణకుమార్, వైస్ ప్రిన్సిపల్‌గా జిల్లా సమితి సభ్యులు ఉన్నం రంగారావు, చెరుకుపల్లి భాస్కర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, రాష్ట్ర గిరిజన సంఘం అ ధ్యక్షులు అజ్మీరా రామ్మూర్తి, జిల్లా కార్యవర్గ సభ్యు లు పుచ్చకాయల కమలాకర్, సింగు నరసింహారా వు, ఏనుగు వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు దంతాల బాలరాజు, లింగ వెంకటనారాయణ, వెంపటి సురేందర్, పగీళ్ల వీరభద్రం, యడ్లపల్లి శంకరయ్య, బూర నాగేశ్వరరావు, ఏవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు గౌస్‌పాషా, సిపిఐ రెండు మండలాల కార్యదర్శులు పుచ్చకాయల సుధాకర్, దంతాల బాలరాజు, 28,32 వార్డుల సిపిఐ కౌన్సిలర్లు రంగారావు, శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 6 నుండి 11 వరకు జిల్లాలో ప్రచార జాత

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రచారం : కర్రె భిక్షపతి



**ప్రజాపక్షం/హనుమకొండ :** కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ ప్రచార జాత నిర్వహిస్తుందని, ఈ జాత ఆగస్టు 6 నుండి 11 వరకు జిల్లాలో ఉంటుందని, ఈ జాతలను విజయవంతం చేయగలరని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పిలుపునిచ్చారు. ఆదివారం బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి పాల్గొని మాట్లాడుతూ ఈ దేశంలో బిజెపి ప్రభు త్వం రోజురోజుకు ప్రజలను అణచివేత ధోరణిని అవలంభిస్తుందని, దేశంలో ఏ సమస్యలు లేనట్టు దేవుడు, మతం పేరు మీద ప్రజలను 12 సంవత్సరాలుగా మోసం చేస్తూ వస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జిల్లాలో ఆగస్టు 6 నుండి 11 వరకు ప్రచార జాత సిపిఐ నిర్వహిస్తుందని, ఆగస్టు 6వ తేదిన కాజీపేటలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు జాతను ప్రారంభిస్తారని, ఈ జాత జిల్లాలో గ్రామ గ్రామనా యాత్ర చేసి ఆగస్టు 11వ తేదీన హనుమకొండలోని వేయి స్థంబాల గుడి నుండి పబ్లిక్ గార్డెన్ వరకు ర్యాలీతో ముగిస్తుందని తెలిపారు. ఆగస్టు 7,8 తేదీల్లో జరిగే ప్రచార జాత లో సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట రెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఈ జాత ద్వారా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీ రును ప్రజలకు వివరిస్తూ ప్రతి గ్రామంలో ఉన్న ప్రజా సమస్యల పైన పోరాటాలు కొనసాగిస్తూ సెప్టెంబర్ 1వ తేదీన ఛలో ఢిల్లీతో ముగుస్తుందని అన్నారు. జిల్లాలో జరిగే ప్రచార జాతను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు అద రి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్, జిల్లా సహా య కార్యదర్శి తోట బిక్షపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్ఎ స్టాలిన్, ఏశబోయిన శ్రీనివాస్, కొట్టేపాక రవి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల వేతనాలు ప్రతి నెల 1వ తేదీనే చెల్లించాలి

రామ రాజేష్ ఖన్నా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లిస్తామని ప్రభుత్వం పలుమార్లు హామీ ఇచ్చినా, ఆచరణలో అమలు కావడం లేదని జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా విమర్శించారు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాఖాధిపతులతో నిర్వహించిన సమావేశంలో ప్రతి నెల 1వ తేదీకే ఉద్యోగుల వేతనాలు చెల్లించాలని ఆదేశించినప్పటికీ, ఇప్పటికీ ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందడం లేదని ఆయన పేర్కొన్నారు. నెల ప్రారంభంలో వేతనాలు అందకపోవడంతో ఇంటి అద్దె, విద్యుత్ బిల్లులు, ఈఎంఐలు, పిల్లల చదువుల ఖర్చులు, కుటుంబ పోషణ వంటి అవసరాలు తీర్చుకోవడం ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు భారంగా మారిందన్నారు. రెండో పిఆర్‌సి అమలుకు ఏడాది దాటినా ఇప్పటికీ అమలు చేయకపోవడం, ఎప్పుడు అమలు చేస్తారనే దానిపై స్పష్టత లేకపోవడం ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళనకు కారణమైందని తెలిపారు. తెలంగాణ ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని, బడుగు, బలహీన వర్గాలకు నిరంతరం సేవలందిస్తున్న ఉద్యోగుల పట్ల ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పెరిగిన వేతనాలు, గత ప్రభుత్వం ప్రకటించిన ఏడు నెలల పిఆర్‌సి బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో కలిసి ఉద్యమ కార్యాచరణ చేపట్టి, అవసరమైతే నిరవధిక సమ్మెకు కూడా వెనుకాడబోమని రామ రాజేష్ ఖన్నా హెచ్చరించారు.

## సిజెపి ఉద్యమం అణచివేతలో కేంద్రం క్రూరత్వం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల నరసింహ



**ప్రజాపక్షం / నారాయణ పేట్ :** సిజెపి ఉద్యమం అణచివేతకు కేంద్రం తీసుకున్న క్రూర చర్యలు రాజ్యాంగ హక్కులను, ప్రజాస్వామ్యాన్ని హరించాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల నరసింహ విమర్శించారు. ఈ కార్యక్రమం నాగరాజు అధ్యక్షతన జరిగినది. నారాయణపేట సిపిఐ జిల్లా సమితి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... ఆగస్టు 6 నుంచి 14 వరకు పాదయాత్రలు దేశవ్యాప్తంగా బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బద్లావ్ జరూరీ హై...మార్పు కావాలి నినాదంతో ఆగస్టు 6 నుంచి 14 వరకు గ్రామాలు మండలాలు జిల్లాల్లో పాదయాత్రలకు కేంద్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు. ధరల పెరుగుదల అరికట్టిలని ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించాలని సార్వత్రిక విద్యా వైద్యం అందుబాటులోకి తేవాలని పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని మహిళలకు రిజర్వేషన్ తక్షణమే అమలు చేయాలని కార్మిక హక్కులను పరిరక్షించాలని బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలు జరపాలని దళిత ఆదివాసీలపై అకృత్యాలను దాడులను నిలిపివేయాలని పోరాటంలో ప్రధాన డిమాండ్లు అన్నారు. దీనికి ముగింపుగా సెప్టెంబర్ 1న న్యూఢిల్లీ రామ్ లీలా మైదానంలో బద్లావ్ జెరూరీ హై (మార్పు అత్యవసరం ) భారీ బహిరంగ సభతో ముగుస్తుందని అన్నారు. నీట్ పేపర్ లీకేజీపై ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద సిజేపి ఉద్యమాన్ని అణచివేసేందుకు లాఠీలు పెలైట్ గన్నులు, భాష్పవాయు గోళాలతో పోలీసులు క్రూరంగా దాడి చేయడం ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అన్నారు. యువత మొక్కవోని ధైర్యంతో పోరాడి డిమాండ్లను సాధించారని, వారి ఉద్యమ విజయం ప్రజాస్వామ్య ఉద్యమాలకు ప్రేరణ అన్నారు. యువత విద్యార్థుల పై విచక్షణ రహితమైన లాఠీచార్జి పై అత్యున్నత విచక్షణ రహితమైన లాఠీచార్జ్ పై అత్యున్నత విచారణ జరిపించి దోమలను శిక్షించాలన్నారు. బీహార్లో యువత పై ఏకే 47తో కాల్పులు జరపారని దీనికి ఎవరు అనుమతి ఇచ్చారో తేల్చి వారిని ఉద్యోగం నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నారాయణ పేట జిల్లా కార్యదర్శి నరసింహులు, కౌన్సిల్ సభ్యులు నాగరాజు, శ్రీనివాసులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

ఎఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరి వెంకటేష్

**ప్రజాపక్షం/చౌటుప్పల్** : స్థానిక పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా పరిశ్రమల యాజమాన్యాలు వ్యవహరించడం దారుణమని ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరి వెంకటేష్ విమర్శించారు. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మునిసిపల్ కేంద్రంలో యువజన సంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చౌటుప్పల్ ప్రాంతంలో సహజవనరులను వినియోగించుకుంటున్న కంపెనీలు స్థానిక యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు.ప్రతి యేటా వందలాది మంది యువత డిగ్రీలు చదివి దూర ప్రాంతాలకు వలస వెళ్ళి ఉపాధి పొందాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక యువతకు ఇక్కడ ఉద్యోగాలు ఇవ్వకుండా దివిస్ లాంటి పరిశ్రమలు ఆంధ్రా ప్రాంతానికి పంపుతామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు.ఈ ప్రాంతాని కాలుష్యాన్ని వెదజల్లుతున్న పరిశ్రమల యాజమాన్యాలు ఈ ప్రాంత యువతకు ఉపాధి కల్పించడానికి అనేక సాకులు చెప్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి,ఎఐవైఎఫ్ మండల మాజీ అధ్యక్షులు బద్దుల సుధాకర్,మండల కన్వీనర్ ఉడుత రాజు,నాయకులు బరిగెల వేణు,గుండెబోయిన భాస్కర్,బద్దుల సాయితేజ,టంగుటూరు కిరణ్‌కుమార్,నీళ్ళ రాము,భాను తదితరులు పాల్గోన్నారు.

## కేంద్రం విధానాలపై సమరశంఖం

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మేళ్లచెరువులో కీలక సమావేశం నిర్వహించారు. బద్లావ్ జరూరి హై అనే నినాదంతో దేశ వ్యాప్తంగా చేపట్టబోయే ఉదృత పోరాటంపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమానికి చింతలపాలెం మండలానికి చెందిన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్తేల నారాయణరెడ్డి పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలను తీవ్ర వంచనకు గురి చేస్తుందని మండిపడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలన్ని అట్టడుగును పడ్డాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఆగస్టు 6 నుండి 14వ తేదీ వరకు నిర్వహించే పాదయాత్రను ఆపై సెప్టెంబర్ 1న జరిగే చలో ఢిల్లీ ప్రదర్శనను పెద్ద ఎత్తున తరలి వెళ్లి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మహిళ జిల్లా అధ్యక్షురాలు ఉప్పతల కోటమ్మ, సిపిఐ మండల కార్యదర్శి గంగిరెడ్డి భద్రారెడడ్డి, చిదిరాల యలమంద, సోమగాని మల్లయ్య, పాపిరెడ్డి, సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రతి ఆటో కార్మికుడికి రూ. 12వేల జీవనభృతి

ఎఐటియుసి డిమాండ్




**ప్రజాపక్షం/చండూరు :** ఆటో రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటియుసి చండూరు మండల అధ్యక్ష కార్యదర్శులు భూతరాజు దేవదాస్ , దోటి వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ట్రాలీ ఆటో కార్మికుల సంఘం మండల సమావేశం కల్లెట్ల వెంకన్న అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎఐటియుసి మండల అధ్యక్షకార్యదర్శులు భూతరాజు దేవదాస్ ,దోటి వెంకన్న మాట్లాడుతూ ట్రాలీ ఆటో కార్మికుల సంక్షేమం బోర్డు ఏర్పాటు చేయాలని ,ప్రతి ఆటో కార్మికుడికి 12వేల రూపాయలు జీవన భృతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఆటో వర్కర్స్ యూనియన్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో భూతరాజు రవి, కల్లెట్ల వెంకన్న, తీగల రామకృష్ణ , ఎస్‌కె సత్తార్ , దోటి లింగయ్య ,నిమ్మల సైదులు , జంగాల రామచంద్రం ,ముదిగొండ నర్సింహ్మ , దోమల రాజు తదితరులు పాల్గొన్నారు.

## దోషులకు శిక్షలు వేయకపోవడం వల్లే దాడులు : మంచాల రాధమ్మ



**ప్రజాపక్షం/మోటకొండూర్** : భారత జాతీయ మహిళా సమైఖ్య యాదాద్రి భువనగిరి జిల్లా 4వ మహాసభ ఆగస్టు 5న ఆలేరులో ఆర్యవైశ్య భవనంలో జరుగు తుందని మహిళలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మోట కొండూరు మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బండి జంగమ్మ పిలుపునిచ్చారు. ఆమే ఆదివారం మండలంలోని ముత్తిరెడ్డి గూడెంలో మహాసభ కరపత్రాలు విడుదల చేశారు. రాధమ్మ మాట్లా డుతూ దేశంలో నాటి నుండి నేటి వరకు ప్రభుత్వాలు మారినప్పటికి మహిళలపై అత్యాచారాలు,యాసిడ్ దాడులు జరుగుతున్నాయని, ప్రభుత్వాలు దోషులకు కఠినశిక్షలు వేయకపోవడం వల్లనే ఇలా జరుగుతుందని ఆరోపించారు. పశువుల కలమ్మ, దూసేటి అందాలు, పంతుల లక్ష్మి, ఎరకల మమత, హేమలత, వంగర అండాలు, కొప్పుల లావణ్య, గంగం సోనీ, మంగమ్మ,ఆడెపు లక్ష్మి ,పంతుల నరసమ్మ, లక్ష్మి , జానమ్మ పాల్గొన్నారు.

## 15లోపు ఇకెవైసి చేయించుకోవాలి

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్** : ఇండియన్ గ్యాస్ వినియోగదారులు ఈనెల 15లోగా ఈకెవైసి చేయించుకోవాలని శ్రీయాదగిరి లక్ష్మి నరసింహ స్వామి ఇండియన్ గ్యాస్ డీలర్ గుండపునేని అనిత రాజశేఖర్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిర్ణీయ సమయంలో ఈకెవైసి చేయించుకున్న వారికి ఒక గ్యాస్ సిలిండర్ ధర రూ.1,016లు ఉంటుందన్నారు. ఈకెవైసి చేయించుకోని వారికి ఒక గ్యాస్ సిలిండర్ ధర రూ.2,500లు ఉంటుందన్నారు.

# నల్లగొండకు రూ.383 కోట్లతో తాగునీటి ప్రాజెక్టులు

24 గంటల నీరు అందిస్తాం

కంచనపల్లి గ్రామంలో అభివృద్ధి పనులు : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ** : కంచనపల్లి గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిద్దుతానని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన గ్రామంలో 20 లక్షల రూపాయల వ్యయం తో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామం నుండి హైదరాబాద్, నల్గొండ, చిట్యాలకు వెళ్లేందుకు డబుల్ రోడ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. గ్రామ పరిధిలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు 11 కోట్లతో చేపట్టిన కంచనపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ను వచ్చే దసరా నాటికి పూర్తి చేస్తామన్నారు. గ్రామానికి 3 కోట్లతో 33/11కెవి సబ్‌స్టేషన్ ను మంజూరు చేశామని, లిఫ్ట్ ఇరిగేషన్ తో పాటు సబ్‌స్టేషన్ ను దసరా రోజున ప్రారంభిస్తామని చెప్పారు. అదే రోజు తన సొంత నిధులతో గ్రామంలోని ఆడబిడ్డలందరికీ పట్టుచీరలు అందిస్తానని హామీ ఇచ్చారు. బ్రాహ్మణ వెల్లెముల ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని, ఎస్ఎల్‌బిసి ద్వారా జిల్లాలోని 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించి నల్గొండ జిల్లాను సస్యశ్యామలం చేయటమే తన ధ్యేయం అన్నారు. ఎస్ఎల్‌బిసి పునర్నిర్మాణ పనులు చేపట్టామని, 2028 ఆగస్టు నాటికి పూర్తి చేసి సాగునీరు అందిస్తామని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామానికి ఇప్పటికే 35 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, 26 పూర్తయ్యాయన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒక తెలంగాణ మోడల్ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

**నల్లగొండ కార్పొరేషన్‌కు రూ. 383 కోట్లు**

అనంతరం నల్గొండ తహసిల్దార్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాల కింద 64 మంది లబ్ధిదారులకు 64 లక్షల 74,224 రూపాయల చెక్కులను మంత్రి అందజేసి మాట్లాడుతూ నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ప్రతి డివిజన్ లో సిసి రోడ్లు, డ్రైన్లతో పాటు ప్రతి ఇంటికి 24 గంటల తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా 83 కోట్లతో వాటర్ ప్లాంట్ కు శంకుస్థాపన చేయించామని, అంతేకాక తాగునీటి కోసం మరో 300 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. నల్గొండ కార్పొరేషన్ కు కేంద్రం నుండి 1000 కోట్ల నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు. 700 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ,అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,మాజీ జెడ్‌పిటిసిలు గుమ్మల మోహన్ రెడ్డి, లక్ష్మయ్య, ఎస్ఈలు మోహన్, గిరిధర్, శ్రీధర్ రెడ్డి, తహసిల్దార్ పరశురాం, ఎంపిడిఓ యాకూబ్, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ పాల్గొన్నారు.

## అద్దె భవనంలో దుర్భర పరిస్థితులు

హాస్టల్ విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** హాస్టల్ అద్దె భవనం కావడం వల్ల రూములు డోర్లు సరిగా లేవని,అరకొర వసతులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళి కృష్ణ అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలో ఆసంఘం ఆధ్వర్యంలో బాలుర ఎస్‌సిఏ హాస్టల్ ను సర్వే చేశారు.విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మురళి కృష్ణ మాట్లాడుతూ సరిపడా బాత్రూములు లేవని, ఉన్న బాత్రూములు పరిశుభ్రంగా లేవని, చాలా దుర్వాసన వస్తున్నందున విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. పై స్థాయి అధికారులు పర్యవేక్షణ చేయడం లేదని, విద్యార్థులను పట్టించుకోవడం లేదని విమర్శించారు.ప్రభుత్వ హాస్టళ్లలో మంచినీటి సౌకర్యం కూడా లేదని, హాస్టళ్లు ప్రారంభమై రెండు నెలలు అవుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. అధికారుల పిల్లలు అయితే ఇలాగే నిర్లక్ష్యం చేస్తారా అని ప్రశ్నించారు.వెంటనే భవనం మార్చాలివెంటనే భవనాన్ని మార్చాలని డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థుల సమస్యలను పట్టించుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వికాస్, ముని, శ్రీకాంత్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా, కార్మిక, కర్షక సమస్యలపై ఎఐటియుసి సమరశీల పోరాటాలు

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రావు




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : ప్రజల, కార్మికుల, కర్షకులు ఎదుర్కొనే ప్రతి సమస్యపై ఏఐటియుసి సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాస్ రావు అన్నారు. ఏఐటియుసి సూర్యాపేట జిల్లా మూడవ మహాసభల సందర్భంగా ఆదివారం స్థానిక ధర్మభిక్షం భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఐటియుసి సూర్యాపేట మూడవ జిల్లా మహాసభలు ఉత్సాహవంతంగా జరిగాయని 5100 సభ్యత్వాలు పూర్తి చేసుకోగా 350 మంది ప్రతినిధులతో సభ విజయవంతంగా ముగిసిందన్నారు. రాష్ట్రంలో ప్రజలు, కార్మికులు, కర్షకులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికై ఈ మహాసభల్లో పలు తీర్మానాలు చేసినట్లు వెల్లడించారు. ముఖ్యంగా రాష్ట్రంలో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి ప్రస్తుతం పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. హెల్త్‌ఇన్సూరెన్స్, ఈఎస్‌ఐ లిమిటేషన్ ఎత్తివేసి అందరికి వర్తించేలా చూడాలన్నారు. చిన్న, పెద్ద పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. అలాగే చివ్వెంల మండలం రావుస్ ఫార్మా కంపెనీలో నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని ఈ విషయమై లేబర్ కమీషన్ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రం ఇచ్చిన నివేదిక ప్రకారం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.25000లు, ఆటో కార్మికులకు నెలకు రూ.15వేల జీవనభృతి అమలు చేయాలన్నారు. ప్రస్తుతం సూర్యాపేట రైలు మార్గం ప్రజలకు కలగానే మిగిలిందని బుల్లెట్ ట్రైన్ విషయంలో మొదట అనుకున్న ప్రకారంగా నార్కెట్‌పల్లి, నకిరేకల్ సూర్యాపేట మీదుగా అమరావతి అలైన్‌మెంట్ పునరుద్ధరించాలని అన్నారు. ఈ బుల్లెట్ ట్రైన్ రాకతో సూర్యాపేట ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో పాటు నిరుద్యోగులకు ఉపాధి కలుగుతుందన్నారు. ఇవే కాకుండా ఇంకా అనేక సమస్యలపై పోరాటాలు నిర్వహించేందుకు తీర్మానాలు చేసినట్లు తెలిపారు. అనంతరం ప్రతినిధులందరి ఆమోదం మేరకు 35 మందితో ఏఐటియుసి జిల్లా నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. 15 మంది కార్యవర్గ సభ్యులు, 9 మంది ఆఫీసర్ బేరర్స్‌తో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు సమక్షంలో కమిటి వేయడం జరిగిందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా మేకల శ్రీనివాస్ రావు, గౌరవ అధ్యక్షులుగా దంతాల రాంబాబు, అధ్యక్షులుగా జడ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుగులోతు రాజారాం, ఉపాధ్యక్షులుగా శ్యాంసుందర్, నకిరేకంటి కవిత, ఆర్గనైజర్‌గా ఎస్‌కె లతీఫ్, సహాయ కార్యదర్శిగా సుధాకర్ రెడ్డి, కోశాధికారిగా రాఘవరెడ్డి, గౌరవ సలహాదారులుగా చామల అశోక్, పోతురాజు సత్యనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అధ్యక్షులు జడ శ్రీనివాస్, జిల్లా గౌరవ అధ్యక్షులు దంతాల రాంబాబు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు రాజారాం, సుధాకర్ రెడ్డి, గౌరవ సలహాదారు చామల అశోక్, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



## ఎక్స్‌గ్రేషియా నిధులు విడుదల చేయాల్సిందే

గీత పని వారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : ప్రమాదాల్లో మరణించిన గీత కార్మికులకు రూ.5 లక్షలు ఎక్స్ గ్రేషియా వెంటనే విడుదల చేయాలని గీత పని వారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కల్లుగీత వృత్తిపై ఆధారపడి లక్షకు పైగా కుటుంబాలు జీవనం సాధిస్తున్నాయని తెలిపారు. ప్రమాదకరమైన ఈ వృత్తి పని చేస్తూ మరణించిన కార్మికులకు ఎక్స్ గ్రేషియాను 10 లక్షల పెంచాలని కోరారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు 50 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికునికి వృత్తి పెన్షన్ నెలకు రూ.5000 మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి సొసైటీకి 560 జీవో ప్రకారం 10 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించాలని, అందులో తాటి ఈత వనాలను ప్రభుత్వ నిధులతో పెంచాలని కోరారు. తాటి ఈత వనాలు అధికంగా ఉన్న ప్రాంతాలలో వీటి ఆధారిత పరిశ్రమలను ప్రభుత్వం నెలకొల్పి ఉపాధి కల్పించాలన్నారు. గీత కార్మికులు మరణిస్తే వారి భార్యలకు వితంతు పెన్షన్ వెంటనే మంజూరు చేసి వారి కుటుంబాలకు చేయూతనివ్వాలి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పనున్న స్కిల్ యూనివర్సిటీలో గీత వృత్తి పనివారల నైపుణ్యాన్ని పెంచే కోర్సులను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. సమావేశానికి గీతా పనివారాల సంఘం మండల కమిటీ అధ్యక్షుడు పందుల యాదగిరి గౌడ్ అధ్యక్షత వహించారు. సంఘం రాష్ట్ర సమన్వయ కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం, జిల్లా నాయకులు మోగదాల సత్తయ్య, వీరమల్ల యాదయ్య, నీళ్ల గాలయ్య, మాధగోని బాలరాజు, పల్లె రాములు, పెద్దగోని విష్ణు, బొమ్మగాని చంద్రయ్య, బత్తిని మల్లేష్, నాతి సత్తయ్య పాల్గొన్నారు.

## గురుకులం నుండి తప్పించుకున్న ఇద్దరు విద్యార్థులు

సర్వేలు గురుకులంలో ఆదివారం ఉదయం ఘటన

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేలు గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఇద్దరు ఆదివారం ఉదయం తెల్లవారుజామున పాఠశాల నుండి తప్పించుకున్నట్లు సమాచారం. మండల పరిధిలోని కోతులాపురం గ్రామానికి చెందిన ఇరిగి దిండ్ల నవదీప్ విద్యార్థితో పాటు జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన మరో విద్యార్థి సర్వేలు గురుకులంలో 8వ తరగతి చదువుతున్నారు. ఉదయం వరకు ఖోఖో టీములు సిద్ధం చేసి వివిధ ఆటలలో పాల్గొన్న విద్యార్థులు పాఠశాల ప్రహరీ గోడ దూకి పారిపోయినట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. జరిగిన సంఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్లో ప్రిన్సిపాల్ ఫిర్యాదు చేశారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుకున్నట్లు నారాయణపురం ఎస్ఐ సీత పాండు తెలిపారు. విద్యార్థులు పాఠశాల నుండి తప్పించుకోవడానికి గల కారణాలు ఏమిటో తెలియ రాలేదు.చదువు ఇష్టం లేక మరెమైన ఇతర కారణాలు అయి ఉండవచ్చా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే మండల పరిధిలోని సీసీ కెమెరాలు పోలీస్ శాఖ జల్లెడ పడుతుంది. గత రెండు రోజుల క్రితం గురువారం నారాయణపురం మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినిలు పాఠశాల మెయిన్ గేట్ నుంచి తప్పించుకొని తమ సొంత ఇంటికి చేరుకున్నారు.

## పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో నిరుద్యోగ యువతకు అన్యాయం

ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఏల్లంకి మహేష్, పేరబోయిన మహేందర్





**ప్రజాపక్షం/రామన్నపేట** : అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రామన్నపేట 12వ మండల నిర్మాణ మహాసభ ఎర్ర రమేష్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఏల్లంకి మహేష్, పేరబోయిన మహేందర్ మాట్లాడుతూ జూలై 29న రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినటువంటి పోలీసు రిక్రూట్మెంట్ నోటిఫికేషన్‌లో కోడ్ నెంబర్ 21 సివిల్ కానిస్టేబుల్ మరియు కోడ్ నెంబర్ 22 ఏఆర్ కానిస్టేబుల్ జాబితాలో యాదాద్రి భువనగిరి జిల్లా (ఖాళీలు) లేకపోవడం వల్ల జిల్లాకు సంబంధించిన నిరుద్యోగుల్లో ఆందోళన మొదలైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2021 డిసెంబర్ 317 జీవో ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా, రాచకొండ పరిధిలో ఉండేది నల్గొండ, సూర్యాపేట ఇతర జిల్లాలకు చెందిన పలువురు కానిస్టేబుళ్లు యాదాద్రి జిల్లాలో విధులకు కేటాయించబడ్డారు. ఈ కేటాయింపు పారదర్శకంగా జరగలేదన్నారు. అనంతరం ప్రభుత్వం పోలీస్ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించి యాదాద్రి భువనగిరి జిల్లాను రాచకొండ కమిషనరేట్ పరిధి నుండి వేరు చేసి 6నెలలు గడుస్తున్నప్పటికీ ఇతర జిల్లాలకు చెందిన కానిస్టేబుల్ లను వారు సంబంధిత స్థానిక కేడర్లకు బదిలీ చేయకపోవడం వల్ల నల్లగొండ సూర్యాపేట జిల్లాలో గణనీయమైన ఖాళీలు ఏర్పడ్డాయి కానీ యాదాద్రి భువనగిరి జిల్లాలో ఖాళీలు లేకుండా పోయింది. జిల్లాకు చెందిన నిరుద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు. విద్యా వైద్యం ప్రవేటీకరణకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 8,9,10 తేదీలలో యాదగిరిగుట్టలో జరిగే ఏఐవైఎఫ్ యువజన ప్రదర్శన బహిరంగ సభను విజయవంతం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది అధ్యక్షులుగా కల్లెం స్వామి, ఉపాధ్యక్షులు వినయ్, ప్రధాన కార్యదర్శిగా రచ్చ దయాకర్ సహాయ కార్యదర్శి కొత్త లింగస్వామి, కోశాధికారిగా ఊట్కూరి శ్రీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నిర్మాణ మహాసభలో సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నయీం, జిల్లా కోశాధికారి సాయి, పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, పాండు, వీసం గాలయ్య, నాగరాజు, సంగిశెట్టి నవీన్ పాల్గొన్నారు.


## పన్ను చెల్లించిన ఇంటికే మళ్లీ డిమాండ్ నోటీసు

ఇంటి పన్ను వసూళ్లలో భారీ అక్రమాలా..

రికార్డుల్లో నమోదు చేయకుండా నగదు మళ్లించారా..

గ్రామపంచాయతీలో అవినీతిపై విచారణ జరిపించాలని ప్రజల డిమాండ్





**ప్రజాపక్షం/మునుగోడు :** మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీలో ఇంటి పన్ను వసూళ్లలో అవకతవకలు జరిగాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంటి పన్ను, నల్లా బిల్లు పూర్తిగా చెల్లించి అధికారిక రసీదు పొందిన ఓ గృహ యజమానికి తిరిగి అదే బకాయి చెల్లించాలని డిమాండ్ నోటీసు జారీ కావడంతో గ్రామపంచాయతీ వ్యవహారశైలిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం 2025/26,2026/27 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన ఇంటి పన్ను,నల్లా బిల్లు కలిపి మొత్తం రూ.2,500ను ఈ ఏడాది జూన్ 15న గ్రామపంచాయతీ కార్యాలయంలో సిబ్బందికి చెల్లించాడు.అనంతరం అధికారిక చెల్లించిన రసీదును కూడా అందుకున్నాడు.అయితే ఆశ్చర్యకరంగా జూలై 30న అదే బిల్లులు బకాయిగా ఉన్నాయని పేర్కొంటూ మరోసారి డిమాండ్ నోటీసు అందింది.దీంతో బాధితుడు గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లి సిబ్బందిని నిలదీయగా,తాము పొరపాటున నోటీసు జారీ చేశామని చెప్పినట్లు సమాచారం.అంతేకాక, ఈ విషయాన్ని బయటకు చెప్పవద్దని కూడా కోరినట్లు బాధితుడు ఆరోపిస్తున్నాడు. వసూలు చేసిన నగదును అసలు రికార్డుల్లో నమోదు చేయలేదనే అనుమానాలు ఈ ఘటనతో మరింత బలపడుతున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు.ఈ ఘటనతో మునుగోడు మేజర్ గ్రామపంచాయతీలో వసూలు చేసిన ఇంటి పన్నులు, నల్లా బిల్లుల మొత్తం ప్రభుత్వ ఖాతాల్లో జమ అవుతున్నాయా? లేక మధ్యలోనే దారి మళ్లుతున్నాయా.. అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. గతంలో వసూలు చేసిన పన్నులన్నింటిపై కూడా సమగ్ర ఆడిట్ నిర్వహించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.గ్రామపంచాయతీలో జరిగిన ఈ ఘటనపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను వెలికితీయడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. భవిష్యత్తులో ఇటువంటి అక్రమాలు పునరావృతం కాకుండా పారదర్శకమైన వసూళ్ల వ్యవస్థను అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ట్రేడ్ లైసెన్స్ లేని సంస్థలను గుర్తించాలి

అధికారులకు కమిషనర్ వంశీకృష్ణ ఆదేశం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ట్రేడ్ లైసెన్స్ ఆదాయాన్ని పెంచడంతో పాటు చెల్లుబాటు అయ్యే లైసెన్స్ లేకుండా ఏ వ్యాపార సంస్థ కూడా కొనసాగకుండా చర్యలు చేపట్టాలని కమిషనర్ బి.వంశీకృష్ణ అధికారులను ఆదేశించారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలోని అన్ని వ్యాపార సంస్థలపై షాప్ టు షాప్ సర్వే నిర్వహించి, ట్రేడ్ లైసెన్స్ లేని సంస్థలను గుర్తించి వెంటనే లైసెన్స్ పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిబంధనలను పాటించని సంస్థలపై తెలంగాణ మున్సిపాలిటీల చట్టం2019 ప్రకారం నోటీసులు జారీ చేసి, అవసరమైతే సీజ్ చేయడం లేదా మూసివేయడం వంటి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఆగస్టు నెలాఖరు నాటికి నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ట్రేడ్ లైసెన్స్ లేకుండా ఏ వ్యాపార సంస్థ కూడా కొనసాగకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్లక్ష్యం ప్రదర్శించిన సంబంధిత వార్డు అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే, ప్రతి వార్డు అధికారి తన పరిధిలో ట్రేడ్ లైసెన్స్ వసూళ్లు, ఆస్తి పన్ను వసూళ్లు, పారిశుద్ధం, తాగునీటి సరఫరా, అక్రమ నిర్మాణాల నియంత్రణ ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి, ప్రతి వార్డులో సమర్థవంతమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## జిల్లా అభివృద్ధే లక్ష్యం : సుదర్శన్‌రెడ్డి





**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లా అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న నాయకులు సుదర్శన్‌రెడ్డి అని నగర మేయర్ ఉమారాణి, డిసిసి కార్పొరేషన్ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ అన్నారు. ఆదివారం కాంగ్రెస్ భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ ఉమారాణి, డిసిసి కాక్పొరేషన్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజలే తన కుటుంబంగా ముందుకెళ్లే సుదర్శన్‌రెడ్డి వ్యక్తిత్వం గల గొప్ప నాయకుడన్నారు. జిల్లా అభివృద్ధే తన లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు సలహాదారులుగా అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో శరత్, రత్నాకర్‌గౌడ్, భక్తవత్సలం, ప్రవీన్‌గౌడ్, యాదగిరి, విపుల్ గౌడ్, జావిద్ అక్రమ్, గోపి, కార్పోరేటర్లు , నాయకులు పాల్గొన్నారు.

## నేడు బిఎల్‌ఎలతో సమావేశం

**ప్రజాపక్షం/నర్సాపూర్:** నర్సాపూర్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ తరపున ఏర్పాటుచేసిన బిఎల్ఎ, బి ఎల్ ఎ సూపర్వైజర్లతో సోమవారం నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ సమావేశం నర్సాపూర్ పట్టణంలోని సాయి కృష్ణ కళ్యాణ మండపంలో ఉదయం 11 గంటలకు ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో సర్ పై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సర్ మెదక్ పార్లమెంటు కోఆర్డినేటర్, తెలంగాణ సాంస్కృతిక సారథి వెన్నెల గద్దర్, నర్సాపూర్ అసెంబ్లీ కోఆర్డినేటర్ అన్వేష్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ లు వస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు, బిఎల్‌ఏలు, బిఎల్‌ఏ సూపర్వైజర్లు తప్పకుండా హాజరుకావాలని ఆయన కోరారు.

## రోడ్ల నిర్మాణానికి రూ. 27 కోట్ల నిధులు

### ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



**ప్రజాపక్షం/భైంసా :** రానున్న గోదావరి పుష్కరాల సందర్భంగా బాసరలో భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం 27 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసిందని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తెలియజేశారు.ఆదివారం భైం సాలోని తన నివాసంలో ఈ విషయాన్ని వెల్లడించారు.పంచాయత్ రాజ్ ద్వా రా ఓని నుండి బాసర వరకు రోడు మరమ్మత్తులకు 2 కోట్ల 55 లక్షలు, గన్నోరా నుండి ఓని వరకు రూ.2 కోట్లు, పిడబ్ల్యూడి రోడ్ నుండి బాసర లో మహంకాళి టెంపుల్ రోడ్‌కు రూ. 1 కోటీ 20 లక్షలు, కిర్గుల్ బి నుండి బా సర వరకు రోడ్ కన్నెక్టివిటీకీ రూ.2 కోట్ల 80 లక్షలు,బాసర రైల్వేస్టేషన్ నుం డి నావేగావ్ రోడ్ వరకు 1 కోటీ 35 లక్షల నిధులు, మల్కాపూర్ మీదుగా బాసర వరకు రూ. 2 కోట్ల 70 లక్షలు ట్రిపుల్ ఐటి నుండి బాలాపూర్ రోడ్ కు రూ.45 లక్షలు, పెట్రోల్ బంక్ నుండి శాంఖరి స్కూల్ వరకు రూ. 45 లక్షలు, ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో బాసర అబాది నాలుగు లేన్ల రోడ్ పుష్కరా ఘాట్ వరకు రూ.8కోట్ల 50 లక్షలు,బిద్రేల్లి నుండి ధర్మబాద్ కు 2 లైన్స్ రోడ్‌కు రూ.4కోట్ల 65 లక్షల రూపాయల నిధులు,బాసర బస్ స్టాండ్ రహదారి మరమ్మత్తులకు రూ.85 లక్షల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. 2027లో పుష్కరాల వేగవంతం చేయనున్నట్లు చెప్పారు.

## మల్లన్న గుట్ట హరిహర క్షేత్రంలో భారీ చోరీ


### ఉప ఆలయాలే లక్ష్యంగా దుండగుల దాడి



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లన్న గుట్ట హరిహర క్షేత్రంలో ఆదివారం తెల్లవారుజామున భారీ చోరీ జరిగింది. ఆలయంలోని ఉప ఆలయాలే లక్ష్యంగా చేసుకుని చొరబడిన దుండగులు ఈ అక్రమానికి ఒడిగట్టారు.ఈ ఘటనలో క్షేత్రంలో వేంచేసి ఉన్న శ్రీ సుబ్రహ్మణ్య స్వామి, శ్రీ గణపతి స్వామి, అమ్మవారి ఉప ఆలయాల తలుపులు తీసి లోపలికి చొరబడిన దుండగులు స్వామివార్లు, అమ్మవార్లకు చెందిన సుమారు 10 కిలోల వెండి, 2.30 తులాల బంగారు ఆభరణాలను అపహరించినట్లు సమాచారం.చోరీ ఘటనపై సమాచారం అందుకున్న డిఎస్‌పి శ్రీనివాస్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. క్లూస్ టీమ్ రంగంలోకి దిగి వేలిముద్రలు,ఇతర కీలక ఆధారాలను సేకరించింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. పవిత్రమైన పుణ్యక్షేత్రంలో చోరీ జరగడంతో స్థానిక భక్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## పెండింగ్ బకాయిలు చెల్లించాలి

**ప్రజాపక్షం/జన్నారం :** విశ్రాంతి ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆర్టిసి విశ్రాంతి ఉద్యోగుల సంఘం నాయకులు జి. సత్యనారాయణ, చుంచు లచ్చన్న డిమాండ్ చేశారు. ఈ నెల 4వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న బస్ భవన్ ముట్టడికి మద్దతుగా జన్నారం ప్రెస్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు చేపడుతున్న ఈ కార్యక్రమానికి మండలంలోని విశ్రాంతి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పెండింగ్ ఆర్థిక ప్రయోజనాలపై ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా ప్రభుత్వం, ఆర్టిసి యాజమాన్యం స్పందించకపోవడంతోనే ఆందోళన బాట పట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కే. తిరుపతి రెడ్డి, నరసయ్య, రామకృష్ణ, ఆర్. కుమార్, రాజమౌళి, మల్లయ్య, శంకరయ్య, గాన బ్రియాల్, విశ్రాంతి ఆర్టిసి ఉద్యోగులు పాల్గొన్నారు.




# అర్హుల కళ్లలో 'చేయూత' ఆశలు!

- ఈ నెల 15 నుంచి చేయూత పింఛన్ల మంజూరుకు ముహూర్తం
- 25 వేలకుపైగా కొత్త దరఖాస్తులు.. కేటాయించే యూనిట్లు ఎన్నో?
- జిల్లాలో1,44,773 మంది లబ్ధిదారులు
- పెండింగ్‌లో 3,320 దరఖాస్తులు



**ప్రజాపక్షం/నిర్మల్ :** రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా చేయూత పింఛన్ల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అర్హులైన నిరుపేదల కళ్లలో కొత్త ఆశలు చిగురించాయి.ఈ నెల 15వ తేదీ నుంచి నూతన పింఛన్ల మంజూరు ప్రక్రియకు అధికారికంగా శ్రీకారం చుట్టనున్నట్లు ప్రకటించడమే కాకుండా, ఈ మేరకు నిర్మల్ జిల్లా అధికార యంత్రాంగానికి ఆదేశాలు సైతం జారీ అయ్యాయి.దీంతో జిల్లా పరిపాలన యంత్రాంగం క్షేత్ర స్థాయి పరిశీలన, దరఖాస్తుల క్రోడీకరణ పనుల్లో వేగం పెంచింది. అయితే, జిల్లాలో కొన్నేళ్లుగా కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియ పూర్తిగా నిలిచిపోవడంతో దరఖాస్తుదారుల సంఖ్య కొండలా పేరుకుపోయింది. ప్రస్తుతం ప్రభుత్వం మంజూరు చేయబోయే కోటా ఎంత? అందులో తమకు అవకాశం దక్కుతుందో లేదో అనే తీవ్ర ఉత్కంఠ, ఆందోళన ప్రతి ఒక్క ఆశావహుడిలో నెలకొంది. జిల్లా అధికారిక గణాంకాల ప్రకారం ప్రస్తుతం నిర్మల్ జిల్లా పరిధిలో మొత్తం 1,44,773 మంది సామాజిక భద్రత (చేయూత/ఆసరా) పింఛన్ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నారు. వివిధ కేటగిరీల వారీగా వివరాలను పరిశీలిస్తే.. జిల్లాలో అత్యధికంగా బీడీ కార్మికుల పింఛన్లు 61,933 మందికి, వితంతు పింఛన్లు 35,664 మందికి, వృద్ధాప్య పింఛన్లు 33,890 మందికి అందుతున్నాయి. వీరికి తోడు దివ్యాంగుల పింఛన్లు 9,822 మందికి, ఒంటరి మహిళల పింఛన్లు 2,093 మందికి, గీత కార్మికుల పింఛన్లు 266 మందికి క్రమం తప్పకుండా పంపిణీ చేస్తున్నారు. అదనంగా ఫైలేరియా బాధితులు 221 మందికి, డయాలసిస్ పేషెంట్లు 110 మందికి కూడా ప్రతి నెలా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోంది.

**323 అక్రమ పింఛన్ల తొలగింపు.. 25 వేలకు పైగా దరఖాస్తులు :** ఇప్పటికే పింఛన్లు పొందుతున్న పాత లబ్ధిదారులకు తోడు కొత్త పింఛన్ల కోసం జిల్లా వ్యాప్తంగా అర్జీలు కుప్పలు తెప్పలుగా వచ్చి పడ్డాయి. 2019 నుంచి ఆసరా ఆన్‌లైన్ పోర్టల్‌లో కొత్త దరఖాస్తుల స్వీకరణ నిలిచిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్వహించిన ప్రజాపాలన సభల్లో వచ్చిన 25 వేలకు పైగా దరఖాస్తులతో పాటు, అధికారుల పరిశీలన పూర్తయి సిఫార్సు చేసిన 3,320 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. మరోవైపు మంత్ర యాప్ ద్వారా లైవ్ అథెంటికేషన్ నిర్వహించి జిల్లాలో అక్రమంగా పింఛన్ పొందుతున్న 323 మంది అనర్హులను అధికారులు జాబితా నుంచి తొలగించారు.మండల స్థాయిలో ఎంపిడిఒలు, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్ల సంయుక్త ఆధ్వర్యంలో పరిశీలిస్తూ వడపోత ప్రక్రియ చేపట్టారు.

**యూనిట్లు తక్కువ.. అర్హులు ఎక్కువ!**

రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా సుమారు 2 లక్షల చేయూత పింఛన్లను మంజూరు చేయనున్నట్లు ప్రభు త్వం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రకటించింది. అలాగే లైవ్ అథెంటికేషన్ ప్రక్రియ ద్వారా అర్హత లేని వారిని తొలగించి, ఆ స్థానాల్లో కొత్తవారికి అవకాశం కల్పిస్తున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఈ 2 లక్షల పింఛన్లలో జిల్లా వారీగా ఎంత కోటా కేటాయించారు? ఆమోదించిన లబ్ధిదారుల జాబితాలు ఏమిటి? అనే వివరాలు ఇప్పటివరకు అధికారికంగా అందుబాటులోకి రాలేదు. దరఖాస్తుల సంఖ్యతో పోలిస్తే జిల్లాకు వచ్చే యూనిట్లు చాలా పరిమితంగానే ఉండే అవకాశం కనిపిస్తోంది. క్షేత్రస్థాయికి కోటా కేటాయింపులు, అధికారిక ఉత్తర్వులు వస్తే తప్ప జిల్లాలో ఎంతమందికి కొత్తగా పింఛన్ భాగ్యం దక్కుతుందో స్పష్టత రాదు.

## వంతెన నిర్మాణం చేపట్టి ఇబ్బందులు తొలగించాలి

**ప్రజాపక్షం/వాంకిడి :** వాంకిడి మండలంలోని వెల్గి గ్రామపంచాయతీ పరిధిలో ప్రవహించే ఒర్రెవాగుపై మంజూరైన వంతెన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని గ్రామస్తులు, రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. వెల్గి గ్రామాల ప్రజలకు, రైతులకు, విద్యార్థులకు ఈ మార్గం కీలక రవాణా ఆధారంగా ఉండగా, వర్షాలు పడిన ప్రతిసారి గంటల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయి. వాగు ఉధృతి కారణంగా అత్యవసర సమయాల్లో గర్భిణులు, రోగులను ఆసుపత్రులకు తరలించలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. వంతెన నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాకపోవడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని కోరుతున్నారు.



## జీవితాంతం నేర్చుకునే తత్వాన్ని అలవర్చుకోవాలి

### జెఎన్‌టియు హెచ్ రిజిస్టర్ ప్రొఫసర్ డాక్టర్ జయలక్ష్మి

**ప్రజాపక్షం/నర్సాపూర్:** ఇంజనీరింగ్ విద్యార్థులు జీవితాంతం నేర్చుకునే తత్వాన్ని అలవర్చుకోవాలని జేఎన్టీయూ హెచ్ డాక్టర్ ఏ జయలక్ష్మి పట్టబద్ధులకు సూచించారు. ఆదివారం నర్సాపూర్ పట్టణ సమీపంలోని బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ఆడిటోరియంలో 26వ స్నతకత్సవ గ్రాడ్యుయేషన్ డే 2026 అత్యంత వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జేఎన్టీయూ హెచ్ రిజిస్టర్ డాక్టర్ ఏ జయలక్ష్మి విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు వేగంగా మారుతున్న సాంకేతిక ప్రపంచంలో ముందుకు సాగాలంటే నేర్చుకునే తత్వం అలవర్చుకోవాలని పట్టభద్రులైన విద్యార్థులకు సూచించారు. గ్రాడ్యుయేషన్ అనేది సంవత్సరాల పట్టుదల కృషి అంకిత భావానికి లభించిన ఫలితం అని అన్నారు. విద్యార్థుల విజయాల వెనుక తల్లిదండ్రులు నిశ్శబ్ద శిల్పులుగా నిలుస్తారని కొనియాడుతూ విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఆమె అభినందించారు.



అనంతరం విష్ణు విద్యా సంస్థల వైస్ చైర్మన్ రవి చంద్రన్ రాజగోపాల్ మాట్లాడుతూ శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో అభివృద్ధి చెందుతున్న స్టార్టప్ నీకొ సిస్టం ద్వారా ఎదుగుతున్న విద్యార్థి పారిశ్రామికవేత్తలను అభినందిస్తూ బివిఆర్ ఐటి తన పూర్వ విద్యార్థులకు భవిష్యత్తులో అన్ని విధాల అండగానిలిస్తుందని హామీ ఇచ్చారు. కళాశాలలో చదివి యూజీ, పిజి పూర్తిచేసిన1510 మంది విద్యార్థులకు పట్టాల ప్రధానం తో పాటు ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు స్వర్ణ పథకాలు, విశిష్ట అవార్డులను ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రధానం చేశారు. అయితే డాక్టర్ బి వి రాజు మెమోరియల్ అవార్డు 2026 ను బయో మెడికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన గడ్డం సాయి లిఖిత్ కుమార్ రెడ్డి, బెస్ట్ అవుట్ గోయింగ్ అకాడమిక్ అవార్డు 2026 ను కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన కుమారి గోపిశెట్టి సౌమ్యలు అందుకున్నారు.డైరెక్టర్ కే లక్ష్మీ ప్రసాద్ కళాశాల డిన్స్, వివిధ విభాగాధిపతులు, ప్లేస్మెంట్ అధికారి డాక్టర్ జె బంగారు రాజు, పరీక్షల చీఫ్ కంట్రోలర్ డాక్టర్ కాపుల ప్రభాకర్ రావు, కళాశాల డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీకాంత్ రావు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ బాపిరాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక చట్ట సవరణలు ప్రమాదకరం

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి విలాస్

**ప్రజాపక్షం/మంచిర్యాల:** కార్మిక చట్ట సవరణలు కార్మిక వర్గానికి తీవ్ర ప్రమాదకరమని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్. విలాస్ అన్నారు. మంచిర్యాల జిల్లా ఎఐటియుసి 4వ జిల్లా మహాసభల ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 100 సంవత్సరాల పోరాట ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్పొరేట్లకు అనుకూలంగా నాలుగు కోడ్‌లను తీసుకురావడం దారుణమన్నారు. దేశంలోని 54 కోట్ల మంది కార్మికుల ప్రయోజనాలను నిర్లక్ష్యం చేస్తూ ఈ చట్టాలను తెచ్చారని విమర్శించారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో ఈ కోడ్‌లను అమలు చేయడం లేదని, తెలంగాణలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా అసెంబ్లీలో తీర్మానం చేసి వీటిని అమలు చేయబోమని ప్రకటించాలని డిమాండ్ చేశారు. గతంలో రైతుల పోరాటానికి దిగివచ్చి కేంద్రం సాగు చట్టాలను రద్దు చేసినట్లే, నీట్ వ్యవహారంలో విద్యార్థుల ఉద్యమానికి లొంగిపోయినట్లే, కార్మిక వర్గం కూడా ఐక్యమై నాలుగు కోడ్‌ల రద్దు కోసం తీవ్రమైన పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీలకు రూ.18,000, మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10,000 వేతనం ఇస్తామని ఇచ్చిన హామీని రేవంత్ ప్రభుత్వం నెరవేర్చాలనికోరారు. కనీస వేతనం రూ.26,000 అమల్లోకి తేవాలన్నారు. కరీంనగర్‌లో జరిగే రాష్ట్ర మహాసభలు, డిసెంబర్‌లో బెంగళూరులో జరిగే జాతీయ మహాసభల్లో భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించి దేశవ్యాప్త సమ్మెకు సన్నాహాలు చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, కలవేన శంకర్, రామడుగు లక్ష్మ ణ్, ఎమ్. వెంకటస్వామి, మేకల దాసు, అక్బర్ అలీ, కలిందర్ అలీ ఖాన్, ఎమ్. పౌలు, ఎమ్. సమ్మయ్య, సరస్వతి, దాగం మల్లేష్, ఎస్.కె. బాజీ సైదా, సలేంద్ర సత్యనారాయణ, జోగుల మల్లయ్య, ఇప్పకాయల లింగయ్య పాల్గొన్నారు.



## సొసైటీలో అవినీతి.. తప్పించుకునేందుకు దేవేందర్ రెడ్డి ప్రయత్నం

### కోనాపూర్ సొసైటీ డైరెక్టర్ల ఆరోపణ

**ప్రజాపక్షం/రామాయంపేట:** మెదక్ జిల్లా రామాయంపేట మండలం కోనాపూర్ సొసైటీలో అవినీతి చేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మ భర్త దేవేందర్‌రెడ్డిపై సొసైటీ డైరెక్టర్లు తీవ్ర విమర్శలు చేశారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో డైరెక్టర్లు మామిడి సిద్దరాములు, నందు మహిపాల్‌రెడ్డి, గడ్డం సురేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సాగర్, శాదుల్లాలు విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. పిఎసిఎస్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి సొసైటీనీ అభివృద్ధి చేశానంటూ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని వారు ఖండించారు. గతంలో దళిత సీఈవో సిద్దరాములు నుండి డబ్బులు రికవరీ చేసిన దేవేందర్‌రెడ్డి తన సామాజిక వర్గానికి చెందిన గోపాల్‌రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. రూ.2.26 కోట్లు అవినీతి జరిగిందని అధికారులే తెలిపారని గుర్తు చేశారు. నిదుల దుర్వినియోగం చేసి కోర్టులను ఆశ్రయిస్తూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దమ్ముంటే గ్రామంలో రైతుల సమక్షంలో చర్చకు రావాలని సవాలు విసిరారు. రైతుల సొమ్ము తిని వారిని మోసం చేసిన దేవేందర్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి వెనుకేసుకొస్తున్నారని మండిపడ్డారు.

## దెబ్బతిన్న వంతెనకు త్వరలో మరమ్మతులు




**ప్రజాపక్షం / సిర్పూర్ (టి) :** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు అండ్ భవనాల (ఆర్ అండ్ బి) శాఖ వంతెనకు త్వరలోనే అత్యవసర మరమ్మతు పనులు చేపడతామని ఆ శాఖ సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ (ఏఈఈ) క్రాంతికుమార్ తెలిపారు. సిర్పూర్ (టి) మండలంలోని వంతెన ఒక వైపు గండి పడి ప్రమాదకరంగా మారిన అంశంపై ప్రజాపక్షం దినపత్రికలో 'భారీ వర్షాలకు ఆర్ అండ్ బి వంతెన వద్ద గండి' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు ఆదివారం ఏఈఈ సం ఘటనా స్థలాన్ని స్వయంగా పరిశీలించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే మరమ్మతులు పూర్తి చేసి ప్రయాణికులకు అనుకూలంగా మారుస్తామన్నారు. కథనానికి స్పంది ంచి క్షేత్రస్థాయికి వచ్చిన అధికారులకు, ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తున్న ప్రజాపక్షం పత్రికకు స్థానిక ప్రజలు, అభినందనలు తెలిపారు.

## ఎస్సారెస్పీని తాకిన కాళేశ్వరం జలాలు

### రాజేశ్వర్‌రావపేట పంపుహౌస్ నుంచి ముప్కాల్ వరకు రివర్స్ పంపింగ్

**ప్రజాపక్షం/ముప్కాల్ :** జగిత్యాల జల్లా రాజేశ్వరరావుపేట పంపుహౌస్ వద్ద నుంచి 34 కిలోమీటర్ల 0.0 కిలో ముప్కాల్ వరకు రివర్స్ పంపింగ్ ప్రక్రియతో ఆదివారం సాయంత్రం చేరుకున్నాయి. రాజేశ్వరరావుపేట పంపుహౌస్ నుంచి దిగువ నుండి ఎగువకు పంపుహౌస్‌ల ద్వారా ప్రవహిస్తూ ము ప్కాల్ 0. పంపుహౌస్ కొనసాగుతుంది. ప్రస్తుతం ఒక పంపు ద్వారా సుమా రు 1450 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తూ ఎత్తిపోతల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నీరు కాలువల్లోకి చేరటంతో బాల్కొండనియోజకవర్గ ఆయకట్టు పరిధిలోని రైతులకు భూగర్భజలాలు పెరగడంతో పాటు సాగునీటి అందుబాటులోకి రావటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పంటలకు అవసరమైన నీరందుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పంపింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరాన్ని బట్టి తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. రైతుల ప్రయోజనాల ప్రభుత్వ లక్ష్యంగా ఉండాలని, కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి సామర్థ్యాన్ని వినియోగించి తెలంగాణ రైతాంఆనికి సమృద్ధిగా సాగునీరందించే చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కోరారు.



# రెండు ఏళ్లుగా తప్పని ఆధార్ తిప్పలు

### దిలావర్పూర్ మండల ప్రజల తీవ్ర ఆగ్రహం!


**ప్రజాపక్షం/దిలావర్పూర్ :** ఏ చిన్న ప్రభుత్వ పథకానికైనా,రేషన్ సరుకుల నుంచి ఆసుపత్రి సేవల వరకు,చివరకు నవజాత శిశువు నమోదుకైనా ఆధార్ కార్డు అత్యంత కీలకంగా మారింది. అయితే నిత్యం వందలాది మందికి అవసరమయ్యే ఈ సేవలు నిర్మల్ జిల్లా దిలావర్పూర్ మండల కేంద్రంలో అందుబాటులో లేకపోవడం శోచనీయం.గత రెండేళ్లుగా మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో స్థానిక ప్రజలు,ముఖ్యంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే రైతులు, కూలీలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గతంలో సజావుగా సాగిన ఆధార్ కేంద్రాన్ని కొందరు వ్యక్తులు తమ వ్యక్తిగత ప్రయోజనాలు స్వార్థం కోసం ఇక్కడి నుంచి తొలగించారని, ఆ కారణంతోనే నేడు మం డల ప్రజలకు ఈ దుస్థితి దాపురించిందని స్థానికులు తీవ్ర ఆవేదనతో ఆరోపిస్తున్నారు.ఈ తీవ్రమైన సమస్యపై మండలవాసులు పలుమార్లు జిల్లా స్థాయి అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. గతం లో మండల తహసీల్దార్ (ఎమ్మార్వో) స్వయంగా ఉన్నతాధికారులకు లేఖ సమర్పించినప్పటికీ,ఆ తర్వాత ఈ సమస్య పరిష్కారంలో ఎలాంటి పురోగతి కనిపించలేదు. బడుల్లో చేరే చిన్న పిల్లలకు బయోమెట్రిక్ నవీకరణ చేసుకోవాలన్నా,వృద్ధులు మరియు వికలాంగులకు పింఛన్ల నిమిత్తం ఆధార్ సవరణలు చేయాలన్నా దిక్కుతోచని పరిస్థితి నెలకొంది.స్థానికంగా కేంద్రం లేకపోవడంతో ప్రతి చిన్న పనికీ కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లా కేంద్రానికి పరుగులు తీయాల్సి వస్తోంది.అక్కడకు వెళ్లినా నిత్యం ఉండే భక్తజనం లేదా ఇతర రద్దీ వల్ల రోజంతా క్యూలైన్లలో వేచి ఉండాల్సి వస్తోందని,దీనివల్ల సమయం వృథా కావడంతో పాటు రాకపోకలకు అయ్యే ఆర్థి క భారం తమపై పడుతోందని గ్రామీణులు వాపోతున్నారు.లేనిపక్షంలో మండల ప్రజలందరినీ సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.




## చెడిపోయిన రహదారి..

### విలేకరులను కించపరిచిన పంచాయతీ అధికారి

**ప్రజాపక్షం/పెంచికల్ పేట్ :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్ పేట్ మండలం చేడ్వాయి గ్రామంలోని కుమ్మరి వాడకు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతిని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత మూడేళ్లుగా ఈ సమస్య కొనసాగుతుండగా, ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మరింత అధ్వానంగా తయారై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీనికితోడు రహదారి ఇరువైపులా ఉన్న ఇళ్లవారు ఆక్రమణలు చేసి దడులు నిర్మించడంతో కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. విలేకరుల దృష్టికి తీసుకెళ్తామని ప్రజలు చెప్పగా, ఎంతమంది విలేకరులు రాసినా ఏమీ చేయలేరంటూ సర్పంచ్, అధికారులు కించపరిచేలా మాట్లాడుతున్నారని వాపోతున్నారు.రహదారి సమస్యను పరిష్కరించాలని చేడ్వాయి కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.



"సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు అన్న కుమారుడు జై కృష్ణ ఘట్టమనేని బ్లాక్ బస్టర్ మూవీ 'శ్రీనివాస మంగాపురం' తో హీరోగా పరిచయం అయ్యారు. ఈ చిత్రానికి అజయ్ భూపతి దర్శకత్వం వహించారు."

# రీల్



## 'టాక్సిక్' ట్రైలర్ 8న రిలీజ్

రాకింగ్ స్టార్ యష్ 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్అప్స్' ట్రైలర్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆ ఎదురుచూపులకు తెరదించుతూ మేకర్స్ తాజాగా కొత్త పోస్టర్‌ను విడుదల చేసి, సినిమా ట్రైలర్‌ను ఆగస్టు 8న రిలీజ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. కొత్త పోస్టర్‌లో యష్ పోషిస్తున్న 'రాయా' పాత్రను సిల్హౌట్ రూపంలో చూపించారు. చేతిలో టామీ గన్ పట్టుకుని కనిపించే ఈ పోస్టర్, సినిమా ప్రపంచం ఎంతరా, ఎంత ఇంటెన్సా ఉండబోతుందో సూచిస్తోంది. ఇప్పటివరకు విడుదలైన ప్రతి ప్రమోషనల్ కంటెంట్లాగే ఈ పోస్టర్ కూడా సోషల్ మీడియాలో బజ్ క్రియేట్ చేస్తూ, సినిమా కథపై అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. ట్రైలర్ను బెంగళూరులో గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. యష్, కేవీఎన్ ప్రొడక్షన్స్ హోమ్ స్టేట్ అయిన కర్ణాటక నుంచే సినిమా ప్రమోషన్స్కు శ్రీకారం చుడుతున్నారు. అలాగే ఆగస్టు 8 తేదీకి మరో ప్రత్యేకత కూడా ఉంది. 'టాక్సిక్' షూటింగ్ ప్రారంభమై సరిగ్గా రెండేళ్లు పూర్తవుతున్న ట్రైలర్ను విడుదల చేస్తున్నారు. గీతూ మోహన్దాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో యష్ తో పాటు నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హుమా ఖురేషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కన్నడ, ఇంగ్లిష్ భాషల్లో ఒకే సారి తెరకెక్కుతున్న ఈ చిత్రం తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషల్లో కూడా విడుదల కానుంది. ఈ నెల 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.



## 'లవ్ జాతర 'లో హీరోయిన్ పోస్టర్ రిలీజ్

అంకిత్ కొయ్య, మానస చౌదరి హీరో హీరోయిన్లుగా అయూజీ ప్రొడక్షన్ బ్యానర్ లో 'సమ్మతమే' ఫేమ్ డైరెక్టర్ గోపీనాథ్ రెడ్డి రూపొందిస్తున్న సినిమా 'లవ్ జాతర'. ఈ చిత్రాన్ని ప్రొడ్యూసర్ కంకణాల ప్రవీణ నిర్మిస్తున్నారు. కంప్లీట్ రోలర్ కోస్టర్ లవ్ ఎంటర్ టైనర్ గా 'లవ్ జాతర' సినిమా తెరకెక్కుతోంది. హీరోయిన్ మానస చౌదరి పోస్టర్ రిలీజ్ చేశారు. మానస చౌదరి ఈ చిత్రంలో శ్రద్ధ పగడాల అనే అందమైన అమ్మాయి క్యారెక్టర్ లో ప్రేక్షకులు అలరించబోతోంది. ట్రెడిషనల్ వేర్ లో వర్షంలో సంతోషంగా డాన్స్ చేస్తున్న స్టిల్ తో రూపొందించిన మానస చౌదరి బర్త్ డే పోస్టర్ ఆకట్టుకుంటోంది.'లవ్ జాతర' చిత్రానికి చేతన్ భరద్వాజ్ మ్యూజిక్ అందిస్తుండగా..సుజాత సిద్ధార్థ్ డిఒపిగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి డీవోపీ సుజాత సిద్ధార్థ్, మ్యూజిక్ చేతన్ భరద్వాజ్, ప్రొడ్యూసర్ కంకణాల ప్రవీణ, రచన , దర్శకత్వం గోపీనాథ్ రెడ్డి.


## 350+ మిలియన్‌ల వ్యూస్‌తో 'రామాయణ' ట్రెండింగ్



రణ్బీర్ కపూర్ కథానాయకుడిగా, నితేష్ తివారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణ: పార్ట్ – 1' ట్రైలర్ ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. విడుదలైన రెండు రోజుల్లోనే అధికారిక ప్లాట్ ఫార్మ్‌లలో 350 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి కొత్త రికార్డు నెలకొల్పింది. భారీ స్థాయి విజువల్స్, వరల్ క్లాస్ విఎఫెక్స్ , భావోద్వేగభరితమైన కథనం, బ్యాగ్రౌండ్ స్కోర్ సోషల్ లో హాట్ టాపిక్‌గా మారాయి. ముఖ్యంగా 'అవర్ ట్రూత్ అవర్ హిస్టరీ' అనే ట్యాగ్ పెట్టారు. శ్రీరాముడిగా రణ్బీర్ కపూర్ శక్తివంతమైన నటనతో ఆకట్టుకోగా, రావణుడిగా యష్ తన పవర్ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్తో అందరి దృష్టిని ఆకర్షించారు. సీతగా సాయి పల్లవి తన హుందాతనం, అమాయకత్వం, భావోద్వేగాలతో ప్రశంసలు అందుకుంటున్నారు. శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్ లుక్ కూడా మంచి ఆసక్తిని రేకెత్తించింది. దీంతో 'రామాయణ: పార్ట్ – 1' పై అంచనాలు మరింత పెరిగాయి. కేవలం రెండు రోజుల్లో 350 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించిన 'రామాయణ' ట్రైలర్ సినిమాపై ఉన్న అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్లింది. ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్ , డిఎన్ఇజి, మాస్టర్స్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సోనీ పిక్చర్స్, ధర్మ ప్రొడక్షన్స్ నార్త్ ఇండియాలో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నాయి. 'రామాయణ: పార్ట్ – 1' దీపావళి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

## హీరోగా జై కృష్ణ సక్సెస్

### ప్రముఖ నిర్మాత ఆదిశేషగిరి రావు



సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు అన్న కుమారుడు జై కృష్ణ ఘట్టమనేని బ్లాక్ బస్టర్ మూవీ 'శ్రీనివాస మంగాపురం' తో హీరోగా పరిచయం అయ్యారు. ఈ చిత్రానికి అజయ్ భూపతి దర్శకత్వం వహించారు. వైజయంతి మూవీస్ బ్యానర్‌పై అశ్విని దత్ సమర్పించారు. నిర్మాత పి. కిరణ్ నిర్మించారు. రాషా తడాని హీరోయిన్ గా పరిచయమైయింది. జులై 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం అద్భుతమైన రెస్పాన్స్‌తో ఘన విజయం అందుకుని సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ: కృష్ణతో కలిసి సినిమాలు నిర్మించాను. రెండు సినిమాలకు దర్శకత్వం కూడా వహించాను. చివరి నిమిషం వరకు ఆయనతోనే ఉన్నాను. కృష్ణని అభిమానులు ఎంతగానో అభిమానించారు. ఆయన తర్వాత మహేష్ బాబును కూడా అదే ప్రేమతో ఆదరిస్తున్నారు. ఇప్పుడు జై కృష్ణ సినిమా విడుదలకు కూడా అదే అభిమానాన్ని చూపించారు. అభిమానులు చూపిస్తున్న ప్రేమ, ఆదరణ చూస్తుంటే చాలా ముచ్చటగా అనిపిస్తోందిని అన్నారు. యాక్షన్, పాటలు, డ్యాన్సు, ముఖ్యంగా డైలాగ్ డెలివరీ అన్నీ అద్భుతంగా ఉన్నాయని ప్రశంసిస్తున్నారు. ఈ సినిమాతో జై కృష్ణ హీరోగా సక్సెస్ అయ్యాడు. తాతగారు, బాబాయిగారు, నాన్నగారి లెగసీని కొనసాగించే వ్యక్తిగా జై కృష్ణ ఎదగాలని కోరుకుంటున్నాను. అలాగే పద్మాలయ లెగసీని కూడా జై కృష్ణ ముందుకు తీసుకెళ్లాలి. తనపై పెద్ద బాధ్యతలు ఉన్నాయి. మా కుటుంబం తరపున జై కృష్ణను హృదయపూర్వకంగా ఆశీర్వదిస్తున్నాను అన్నారు.హీరో జై కృష్ణ, నిర్మాత కేఎస్ రామారావు, నిర్మాత నవీన్ ఎర్నేని, నిర్మాత అనిల్ సుంకర ప్రెస్ మీట్ లో పాల్గొన్నారు.

దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆకాశంలో ఒక తార' విడుదలకు సిద్ధమవుతోంది. ఇటీవల జివి ప్రకాష్ కుమార్ స్వరపరిచిన 'చిట్టి చిట్టి చీమ' పాట హృదయాన్ని హత్తుకునే మెలోడి.. భావోద్వేగంగా సినిమాలో ఏం చెప్పాలనుకున్నారో ఆ పాయింట్ను అద్భుతంగా ప్రతిబింబిస్తుంది. హీరోయిన్ కోణంలో పాడిన ఈ పాట, నక్షత్రాలను చేరాలనే ఒక మహిళ కలను, ఆమె పక్కన నిలబడి నిశ్శబ్దంగా అండగా నిలిచే వ్యక్తి ప్రేమను చూపిస్తుంది. శ్రీమణి రాసిన ఈ పాటను రమ్య బెహరా ఎంతో చక్కగా ఆలపించారు. చిట్టి చీమ చక్కెర మోసుకెళ్లడం, కొండపల్లి బొమ్మ కొండలు దాటడం, గాలికి ఎదురుగా మాత్రమే ఎగిరే ఉపమానాల ద్వారా ఈ పాట పట్టుదల, ఆశ, ప్రతి కల వెనుక ఉన్న నిశ్శబ్ద బలాన్ని అద్భుతంగా ఆవిష్కరించింది. ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లి, శ్రుతి హాసన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. పావన్ సాదినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని లైట్‌బాక్స్ మీడియా బ్యానర్‌పై సందీప్ గున్నం, రమ్య గున్నం నిర్మిస్తున్నారు. స్వప్న సినిమా, గీతా ఆర్ట్స్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.

## వైవిధ్యమైన ప్రేమకథ చిత్రం 'ఆకాశంలో ఒక తార'



## స్నేహితుల మధ్య సాగె కథ 'సమ్మర్ హాలిడేస్'

ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై 'సమ్మర్ హాలిడేస్' అనే చిల్డ్రన్ మూవీని నిర్మిస్తున్నారు. 'సమ్మర్ హాలిడేస్' సినిమాను మన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసే ఒక అందమైన కథతో దర్శకుడు శ్రీకర్ రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబి ఖుషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. త్వరలోనే 'సమ్మర్ హాలిడేస్' సినిమా థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ప్రతి స్నేహితుడికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ 'సమ్మర్ హాలిడేస్' సినిమా నుంచి మేకర్స్ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో కీ రోల్స్ చేస్తున్న రోహన్ రాయ్, అరుణ్ ఊరి కాలువలో సరదాగా ఆడుకుంటున్న స్టిల్ ఆకట్టుకుంటోంది. వీళ్లిద్దరి పాత్రలు ప్రతి ప్రేక్షకుడు తన ప్రాణ మిత్రుడిని గుర్తుచేసుకునేలా ఉండబోతున్నాయి. రోహన్ రాయ్, అరుణ్,



ఖుషి, జయసుధ, రాజీవ్ కనకాల, వాసుకి, హర్షిణి, హర్షవర్ధన్, తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి డిఒపి సాయి ప్రకాశ్, మ్యూజిక్ డైరెక్టర్ సింజిత్ యెర్రమల్లి,

# అట్టహాసంగా లష్కర్ బోనాలు





**ప్రజాపక్షం / హైదరాబాద్ సిటీ :** సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాలు ఆదివారం అంగరంగవైభవంగా జరిగాయి. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించారు. హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం ఉదయమే కుటుంబసమేతంగా అమ్మవారిని దర్శించుకుని తొలిబోనం సమర్పించారు. అమ్మవారికి బోనంతో పాటు ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించారు.అనంతరం పలువురు ప్రముఖులతో పాటు పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు బోనాలు సమర్పించారు. బోనాలు సమర్పించిన వారిలో మంత్రులు కొండాసురేఖ దనసరి అనసూయ (సీతక్క)లు ఉన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా అర్చకులు ముఖ్యమంత్రికి ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తీర్థప్రసాదాలు ఇచ్చి ఆశీర్వచనం ఇచ్చారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యులు పద్దిరాజు రవిచంద్ర, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, టిపిసిసి అధ్యక్ష్యులు మహేష్‌కుమార్ గౌడ్, శాసన సభ్యులు దానం నాగేందర్, తలసాని శ్రీనివాస యాదవ్, నవీన్ యాదవ్, శ్రీగణేష్, మర్రి రాజశేఖర్ రెడ్డి, కెటిఆర్, జగదీష్‌రెడ్డి, కాలేరు వెంకటేష్, మల్లారెడ్డిలతో పాటు సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల, సిపి సజ్జనార్, జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించారు. వీరితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు బోనాలతో పాటు పట్టువస్త్రాలు సమర్పించారు. తెలంగాణ నలుమూలల నుంచి కాక ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరావడంతో అధికార యంత్రాంగం భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసరిలాలలో ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేశారు. గుర్తించిన ప్రాంతాలలో త్రాగునీటి సౌకర్యాన్ని కల్పించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీసు శాఖ పటిష్ట బందో బస్తు ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణలో ఫైర్ ఇంజన్లు, అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచారు. విద్యుత్ అంతరాయం కలగకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. దేవాలయ చైర్మన్ రామేశ్వర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరాం, ఇఓ మనోహర్ రెడ్డిలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. జిహెచ్ఎంసి, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్, మెడికల్, ఫైర్, పోలీస్ తదితర శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించారు.

## ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)

మోదీ ప్రారంభించారు. మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా 100 వారాల పాటు సాగే ఈ ప్రచారాన్ని ప్రకటించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రసంగించిన మోదీ, మాదకద్రవ్య రహిత భారతదేశాన్ని నిర్మించే లక్ష్యంతో 'జన్ భాగీదారి' (ప్రజల భాగస్వామ్యం) కార్యక్రమంగా రాబోయే 100 వారాల పాటు ప్రతి ఆదివారం ఈ ప్రచారం కొనసాగుతుందని తెలిపారు. దేశవ్యాప్తంగా 'నషా ముక్త్ యువ అభియాన్' ప్రారంభమవుతోందని, సమష్టి కృషిలో అపారమైన శక్తి వస్తుందని, దాంతో ఈ ప్రచారం ప్రతి యువకుడి హృదయాన్ని తాకనుందని మోదీ పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా సాగే పోరాటంలో యువతకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఆయన చెప్పారు. దేశంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాదారులు, వినియోగదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, గతంతో పోలిస్తే అరెస్టుల సంఖ్య భారీగా పెరిగిందని, వేల కోట్ల రూపాయల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మాదకద్రవ్యాల విషయంలో తమ ప్రభుత్వం ఎంత కఠినంగా వ్యవహరిస్తోందో ఇది తెలియజేస్తుందని మోదీ చెప్పారు. లక్షలాది మంది యువకులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారని పేర్కొన్న ఆయన, రానున్న 100 వారాల్లో ఈ ప్రచారం మరింత ఊపందుకుంటుందని చెప్పారు. యువతను దేశపు 'అమృత తరానికి' చెందినవారిగా అభివర్ణించిన మోదీ, 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత దేశ లక్ష్యాన్ని సాధించడంలో వారు కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. 'ఒక యువకుడు మాదకద్రవ్యాల వ్యసనానికి బలి అయినప్పుడు, నష్టపోయేది కేవలం ఆ వ్యక్తి మాత్రమే కాదు; ఒక కల కూడా కనుమరుగవుతుంది. మన యువతను వ్యసనమనే ఉచ్చులోకి లాగడానికి శత్రు దేశాలు కుట్రలు పన్ని, అన్ని విధాలా ప్రయత్నిస్తాయి. మనలాంటి దేశాన్ని నాశనం చేయాలనే లక్ష్యంతో మాదకద్రవ్యాల సరఫరా ద్వారా లాభాలు గడించడం వారి ఉగ్రవాద ప్రేరిత ఎజెండాలో భాగం' అని ఆయన అన్నారు. యువత వ్యసనాలకు బానిస కాకుండా నిరోధించడానికి తల్లిదండ్రులు, పిల్లల మధ్య బలమైన చర్చలు అవసరమని మోదీ ఉద్ఘాటించారు.



కొరటికల్ జలపాతం

## ప్రకృతి రమణీయత..

(మొదటి పేజీ తరువాయి)

జలపాతం లోయలు, కొండల మధ్యలో నుండి పరవళ్ళు తొక్కుతున్న పాలధార లాంటి నీటితో 42 అడుగుల ఎత్తు నుండి ఎగసిపడే జలపాతం నిండుకుండలా మారి ప్రకృతి పర్యాటకులకు కనువిందు చేస్తూ మరింత శోభను సంతరించుకుంది. ముఖ్యంగా సెలవు రోజులలో ఇతర రాష్ట్రాలు, హైదరాబాద్ నుండి వేల సంఖ్యలో సందర్శకులు దర్శించి పరవశించి పోతున్నారు. ఆకట్టుకోవడానికి ఎగువ ప్రాంతం కుప్టీ, కుమారి గ్రామాల గుండా కడెం నది ప్రవహిస్తూ కుంటాల వద్ద జలపాతంగా మారింది. దీనినే తెలంగాణ నయాగారగా, రాష్ట్రంలో ఎత్తైన జలపాతంగా పిలుస్తుంటారు.

**జల సవ్వడితో కొరటికల్ జలపాతం**

మండలంలో గత మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షానికి వాగులు నిండుకుండలా మారి జలధారలు పైనుండి పారుతుండగ జాతీయ రహదారి 44పై ప్రయాణిస్తున్న ప్రయాణికులు కాసేపు ఆగి ఫోటోలు సెల్ఫీలతో కరటికల్ జలపాతం సందడిగా మారుతుంది. వాహన ఛోదకులు ఈ జలపాతం అందాలను ఆస్వాదిస్తున్నారు.

**పర్యాటక శోభతో పొచ్చెర జలపాతం**

బోథ్ గ్రామం ఎగువ నుండి వచ్చే పెద్దవాగు కనుగుట్ట గ్రా మం గుండా పొచ్చెర వద్ద జలపాతంగా మారి పైనుండి ప్ర వహించే నీరు ప్రకృతి శబ్దాలతో వినసొంపుగా ఉంటుంది. లోతైన సుడిగుండాలతో నిల్వ ఉండే నీళ్లు, పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన విడిది గదులు పిల్లలకు ప్రకృతి పార్కు సందర్శకులను ఆకర్షించడంలో ముందు వరుసలో ఉందని చెప్పవచ్చు, కుంటాలకు వచ్చే వారంతా పొచ్చర జలపాతాన్ని చూడకుండా వెళ్ళని పరిస్థితిగా ఉంది అని చెప్పవచ్చు, ఇవే కాకుండా బజార్‌హత్నూర్ మండలంలో కనకాయి జలపాతం, ఇచ్చోడ మండలంలో గాయత్రి జలపాతం, బోథ్ మండలంలో ఘన్పూర్ జలపాతం, పర్యాటకులను ఆకర్షించడంలో ప్రసిద్ధిగా చెప్పవచ్చు.

## నెలకు రూ.3 వేలేనా?

(మొదటి పేజీ తరువాయి)

కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఎడతెరిపి లేకుండా పోరాటాలు కొనసాగిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కార్మికులు, కష్టజీవులు, రైతులు, గుడిసెల్లో నివసించే నిరుపేదలు, భూమి సమస్యలతో బాధపడుతున్న వారి తరపున శాసనసభలోనూ, ప్రజా ఉద్యమాల్లోనూ కమ్యూనిస్టు పార్టీలు, ఎర్రజెండా మాత్రమే నిరంతరం గొంతెత్తుతున్నాయని తెలిపారు. ప్రజల సమస్యలను ఇతర రాజకీయ పార్టీలు పెద్దగా ప్రస్తావించవని విమర్శించారు. ఎన్నికల సమయంలో కార్మికులు, పేదలు తమ సమస్యల కోసం పోరాడే శక్తులను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎర్రజెండాకు ఎక్కువ మంది ప్రజల మద్దతు ఉన్నప్పటికీ, ఆ మద్దతు ఓట్ల రూపంలో ప్రతిఫలించడం లేదని వ్యాఖ్యానించారు. రాజకీయ చైతన్యంతో కార్మికులు, కష్టజీవులు తమ హక్కుల కోసం పోరాడే అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. గతంలో యుపిఎ ప్రభుత్వ కాలంలో కమ్యూనిస్టు పార్టీలకు గణనీయమైన పార్లమెంటు ప్రాతినిధ్యం ఉండటం వల్లే ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం వంటి కీలక నిర్ణయాలు అమల్లోకి వచ్చాయని ఆయన గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ఆర్భాటంగా వచ్చి హామీలు ఇచ్చే రాజకీయ పార్టీలను ప్రజలు నమ్మకుండా, తమ హక్కుల కోసం నిరంతరం పోరాడే శక్తులను బలోపేతం చేసే దిశగా రాజకీయ చైతన్యాన్ని పెంపొందించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

**కార్మికుల సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలి: నెల్లికంటి సత్యం**





కార్మికులు సంఘటితంగా పోరాడితేనే ప్రభుత్వం స్పందించి సమస్యల పరిష్కారానికి ముందుకు వస్తుందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పేర్కొన్నారు. కార్మికుల హక్కులను కాలరాసిన ప్రభుత్వాలు గతంలో ప్రజల తీర్పుతో గద్దె దిగిన చరిత్ర ఉందన్నారు. ఎఐటియుసి కార్మికుల సమస్యలను విస్మరించిన ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక ఫలితాలను చవిచూశాయని గుర్తు చేశారు. సుమారు 54 వేల మంది మధ్యాహ్న భోజన కార్మికులు, వారి కుటుంబ సభ్యులను కలుపుకుంటే లక్షలాది మంది ప్రభావితమవుతారని, వారి ఐక్యత ప్రభుత్వ విధానాలపై ప్రభావం చూపగలదని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మికులు మరింత క్రియాశీలకంగా ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అలాగే అంగన్వాడీ వ్యవస్థకు సంబంధించిన సరఫరాలు, సంక్షేమ అంశాల్లో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై కూడా కార్మికులు అప్రమత్తంగా ఉండాలన్నారు. శాసనమండలిలో కార్మికుల సమస్యలను ప్రస్తావించి, వారి పక్షాన నిలబడి పోరాడుతానని నెల్లికంటి సత్యం హామీ ఇచ్చారు. ఎస్.బాలరాజ్, ఎం.నరసింహ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు వారికి పిఎఫ్, ఇఎస్ఐ వంటి సదుపాయాలను అమలుచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బి.వి.విజయలక్ష్మి మాట్లాడుతూ మోదీకి సామాన్య ప్రజలపై పట్టింపులేదని, కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు అండగా నిలుస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహిస్తున్న వేలాది మంది కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రేం పావని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం యోచిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్ సిస్టం ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 54 వేలకుపైగా మధ్యాహ్న భోజన కార్మికులు పనిచేస్తుండగా, తక్కువ గౌరవ వేతనం, బకాయిలు, ఉద్యోగ భద్రత లేకపోవడం, సామాజిక భద్రతా పథకాల అమలు లేకపోవడం వంటి సమస్యలు వారిని తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయని తెలిపారు. తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ తన పాటలతో కార్మికుల్లో ఉత్సాహం పెంపొందించారు. ఈ మహాసభకు రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న కార్మికులు భారీగా తరలి వచ్చారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com